సోమవారం
10•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 226
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM I KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




## ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

# రాష్ట్రాల ఇష్టం

నియామకాలు, పదోన్నతుల్లో కోటాకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు

పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రాథమికహక్కు కాదు

రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రాలను ఆదేశించలేం: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

కాంగ్రెస్, ఎల్జేపీ అసంతృప్తి.. రిజర్వేషన్ల స్ఫూర్తికే విరుద్ధమని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:**

ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు రాష్ట్రాల అభీష్టమని, కోటాకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. పదోన్నతుల్లో కోటా పొందడం అనేది ప్రాథమిక హక్కు కాదని ఉత్తరాఖండ్ కేసులో శుక్రవారం తేల్చిచెప్పింది. రిజర్వేషన్లు కల్పించాలని తాము రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించలేమని స్పష్టంచేసింది. ఈ తీర్పుపై కాంగ్రెస్‌తోపాటు లోక్‌జనశక్తి పార్టీ అసంతృప్తి వ్యక్తంచేశాయి. ఇది రిజర్వేషన్ల స్ఫూర్తికే విరుద్ధమని వ్యాఖ్యానించాయి.

**ఇదీ నేపథ్యం..**

ఉత్తరాఖండ్ ప్రభుత్వం 2012 సెప్టెంబర్ 5న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే అందులో ప్రజా పనుల విభాగంలోని అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్) పోస్టులకు సంబంధించి పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి రిజర్వేషన్ కల్పించరాదని నిర్ణయించింది. దీనిపై ఉత్తరాఖండ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కాగా, నియామకాలకు న్యాయస్థానం బ్రేక్ వేసింది. ఆయా వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్‌లు ఎల్ నాగేశ్వర్‌రావు, హేమంత్ గుప్తాతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, కొలిన్ గొంజాల్వెజ్, దుష్యంత్ దేవ్ వాదనలు వినిపించారు. ఆర్టికల్ 16(4), 14(4-ఏ) ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించడం ప్రభుత్వం విధి అని పేర్కొన్నారు. ఈ వాదనలను



ప్రభుత్వం తరఫు న్యాయవాది తోసిపుచ్చారు. అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. 'గతంలో మేము నిర్దేశించిన చట్టం ప్రకారం.. నిస్సందేహంగా రాష్ట్రాలు రిజర్వేషన్లకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. అదేవిధంగా పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రాథమిక హక్కు అని ఏ ఒక్కరూ వాదించరాదు' అని స్పష్టంచేసింది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించాలంటూ కోర్టు ఆదేశాలు (మాండమస్) జారీ చేయజాలదని చెప్పింది. ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పును తప్పుబట్టింది. 'ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించరాదని చట్టంలో స్పష్టంగా ఉన్నది' అని ధర్మాసనం పేర్కొన్నది.

**అది వెసులుబాటు మాత్రమే**

ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు తగినంత సంఖ్యలో లేరని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే నియామకాలు, పదోన్నతుల్లో వారికి రిజర్వేషన్లు అమలుచేసే అధికారాన్ని ఆర్టికల్ 16(4), 14(4-ఏ) కట్టబెడుతున్నాయని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొన్నది. అదేసమయంలో

మిగతా 5వ పేజీలో



## కొనసాగుతున్న కరోనా విలయం

**813కు చేరిన మృతుల సంఖ్య**

**మరో 37,287 మందికి వైరస్ నిర్ధారణ**

- కరోనా వైరస్ విస్తరించే అవకాశమున్న దేశాల్లో భారత్
- వైరస్ వ్యాప్తికి కారణం కానున్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా విమానాశ్రయాలు: జర్మనీ పరిశోధకుల అంచనా
- వ్యాక్సిన్ అభివృద్ధి కోసం పరిశోధనలు ముమ్మరం చేసిన ప్రపంచ దేశాలు
- కరోనాను అడ్డుకోవడంలో చైనాకు పూర్తి సహకారం అందిస్తాం: ప్రధాని మోదీ

5



## జయేశ్ రంజన్‌కు జై

తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక

ప్రత్యర్థి రంగారావుపై 13 ఓట్ల తేడాతో ఘనవిజయం

కార్యదర్శిగా జగదీశ్వర్‌యాదవ్

8

## పెట్టుబడి వ్యయంలో

# మనమే టాప్



- తెలంగాణలో 30 శాతానికి పెరుగుదల
- గత ఐదేండ్లలో రూ.1.60 లక్షల కోట్లు వెచ్చించిన టీఆర్‌ఎస్ సర్కార్
- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా
- సంపద సృష్టికి భారీగా వెచ్చిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- చివరి పదేండ్లలో 'ఉమ్మడి' పాలకులు వెచ్చించింది రూ.59 వేల కోట్లే
- కేంద్ర పెట్టుబడుల వ్యయం 12 శాతంలోపే

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ ప్రభుత్వం ఓవైపు సొంత రాబడులను పెంచుకుంటూ మరోవైపు భవిష్యత్‌లో రాష్ట్ర సంపదను మరింత పెంచేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నది. రెవెన్యూ ఖర్చులతోపాటు పెట్టుబడి వ్యయానికి (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్‌కు) కూడా పెద్దపీట వేస్తూ రాబోయే తరాలకు స్థిరమైన రాబడిని అందించేందుకు దూరదృష్టితో వ్యవహరిస్తున్నది. భవిష్యత్ అవసరాలకు ఎలాంటి అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టాలన్న విషయంపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పక్కా ప్రణాళికను రచిస్తున్నారు. సంపద సృష్టికి వార్షిక బడ్జెట్‌లో తగిన నిధులను కేటాయిస్తున్నారు. సంక్షేమంతోపాటు సంపద సృష్టికి నిధులను పెంచుతూ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. పెట్టుబడి వ్యయం కింద ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు పదేండ్లలో కేవలం రూ.59 వేల కోట్లను వెచ్చించగా.. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన ఐదేండ్లలోనే తెలంగాణ రూ.1.60 లక్షల కోట్లు ఖర్చుచేసి దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.2 లక్షల కోట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం 10 నుంచి 12 శాతంలోపే ఉంటుంది. చాలా రాష్ట్రాలు కూడా పెట్టుబడుల వ్యయానికి తమ మొత్తం రెవెన్యూ వ్యయంలో 10 నుంచి 20 శాతంలోపే వెచ్చిస్తున్నాయి. కానీ తెలంగాణలో ఇది 30 శాతానికి చేరడం విశేషం. సంపదను సృష్టించే ప్రాజెక్టులు, రవాణా, నీటిపారుదల, ఖనిజాభివృద్ధి లాంటి రంగాలకు చేసే ఖర్చులను బడ్జెట్‌లో పెట్టుబడుల వ్యయంగా.. సంక్షేమరంగంతోపాటు ఉద్యోగుల జీతభత్యాలకు వెచ్చించే మొత్తాలను రెవెన్యూ ఖర్చులుగా చూపుతారు. తెలంగాణ ప్రభుత్వం మునుపెన్నడూ లేనివిధంగా రెవెన్యూ ఖర్చులతోపాటు పెట్టుబడుల వ్యయాన్ని కూడా భారీగా పెంచుతూ అభివృద్ధిపథంలో ముందుకు సాగుతున్నది. వ్యవసాయం, నీటిపారుదలరంగాలకు

మిగతా 2వ పేజీలో



## విద్యుత్ తీగలే యమపాశాలై..

- బస్సుకు కరంట్ తీగలు తగిలి 10 మంది మృత్యువాత
- 22 మందికి గాయాలు
- నిశ్చితార్థానికి వెళ్తుండగా ఘటన.. ఒడిశాలో విషాదం

5



## అకాల నష్టం!

- పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం
- ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో తడిసిన మిర్చి
- నేడూ పలు ప్రాంతాలకు వర్ష సూచన


7

| **చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 72.00 | రిటైల్ లైవ్ | 94.00 |
| డ్రెస్డ్ | 136.00 | స్కిన్‌లెస్ | 155.00 |

| **గుడ్ల ధరలు** (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 320.00 | రంగారెడ్డి | 320.00 |
| మెదక్ | 320.00 | కరీంనగర్ | 323.00 |
| వరంగల్ | 323.00 | డజన్ ధర | 60.00 |

# సిరులపంట

## రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి




**ఐదేండ్ల పెరుగుదలతో పోల్చితే ఈసారి అత్యధికం**

**2019-20 వానకాలం, యాసంగిలో 97.43 లక్షల ఎకరాల్లో పంటలసాగు**

**రెండుసీజన్లు కలిపి 130 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి**

**అర్థగణాంకశాఖ రెండోముందస్తు అంచనా నివేదికలో వెల్లడి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో సిరులపంట పండుతున్నది. ఈ ఏడాది రికార్డుస్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి జరుగనున్నది. గత ఐదేండ్లుగా ఆహారధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల ఉన్నప్పటికీ.. ఈ ఏడాది మరింత అధికంగా రానున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోపాటు.. ఇతరప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో రాష్ట్రంలో సాగువిస్తీర్ణం అంచనాలను మించి నమోదయింది. దీంతో ఉత్పత్తి కూడా అదేస్థాయిలో వస్తుందని అర్థగణాంకశాఖ నివేదిక వెల్లడించింది. 2019-20 వానకాలం, యాసంగి సీజన్లు కలిపి 130 లక్షల మెట్రిక్ టన్నుల (1.30 కోట్ల మెట్రిక్ టన్నులు) ఆహారధాన్యాల ఉత్పత్తి వస్తుందని అంచనా వేసింది. ఇది గతేడాది కంటే 37.26 లక్షల మెట్రిక్ టన్నులు అధికమని అర్థగణాంకశాఖ తన రెండోముందస్తు అంచనాల నివేదికలో వెల్లడించింది. తెలంగాణ ఏర్పడిన నాటినుంచి ఇదే అత్యధికమని కేంద్ర, రాష్ట్ర వ్యవసాయశాఖలకు అధికారులు నివేదించారు. ఈ ఏడాది వానకాలం, యాసంగి సీజన్లలో రాష్ట్రవ్యాప్తంగా 97.43 లక్షల ఎకరాల్లో ఆహారపంటలు

మిగతా 2వ పేజీలో

### వరి అత్యధికం

రాష్ట్రంలో వరిసాగు విస్తీర్ణం పెరుగడంతోపాటు, దిగుబడి కూడా పెరుగడంతో మొత్తం ఉత్పత్తిలో గణనీయ పెరుగుదల నమోదయింది. వానకాలం, యాసంగి సీజన్లలో వరి 68.50 లక్షల ఎకరాల్లో సాగైంది. 2018-19తో చూస్తే 20.76 లక్షల ఎకరాలు అధికంగా సాగవడం గమనార్హం. దీంతో వరిధాన్యం ఉత్పత్తి కూడా భారీగా వస్తున్నదని అర్థగణాంకశాఖ తెలిపింది. వానకాలంలో ఏకంగా 89.49 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 58.62 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి రానున్నట్లు అంచనా వేసింది. గత వానకాలంతో చూస్తే 2019లో 44.32 శాతం, యాసంగిలో 54.22 శాతం ఉత్పత్తి పెరుగుతున్నది. ఈ రెండు సీజన్లలో కలిపి 148.11 లక్షల మెట్రిక్ టన్నులు రానున్నట్లు పేర్కొంది. గతేడాదితో చూస్తే ఏకంగా 48.09 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి పెరుగనుండటం విశేషం. ఇక మొత్తం బియ్యంగా మారిస్తే 66.67 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని నివేదికలో వివరించారు.

## ఆప్‌లో ఆందోళన

**తుది పోలింగ్ శాతం వెల్లడిలో ఈసీ జాప్యం**

5

**ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు.. ఈసీ తీరు దిగ్భ్రాంతికరం: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్**

**బీజేపీ ఆమోదం కోసం వేచి చూశారా? ఈసీని ప్రశ్నించిన ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియా**

**ఎట్టకేలకు ఈసీ స్పందన.. 62.59 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడి**


## 17 నుంచి బయోఏషియా సదస్సు

'రేపటి కోసం నేడు' ఇతివృత్తంగా హెచ్‌ఐసీసీలో అంతర్జాతీయ సదస్సు

భాగస్వామ్యదేశంగా స్విట్జర్లాండ్.. హాజరుకానున్న 1,800 మంది ప్రతినిధులు

రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానించనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక బయోఏషియా సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగాల్లో దక్షిణాసియాలోనే అతిపెద్ద బయోఏషియా సదస్సు ఈ నెల 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో 'రేపటి కోసం నేడు' ఇతివృత్తంగా జరుగనున్నది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడానికి ప్రభుత్వం ఈ సదస్సును అనుకూలంగా మలుచుకోనున్నది. లైఫ్‌సైన్సెస్ రంగాలకు ఉన్న అవకాశాలు, ప్రాధాన్యం దృష్ట్యా 2004లో బయోఏషియా సదస్సును ప్రారంభించారు. అప్పటినుంచి ఏటా ఫిబ్రవరిలో సదస్సును నిర్వహిస్తున్నారు. 17న ఉదయం ఎంపికచేసిన ప్రతినిధులు జీనోమ్ వ్యాలీని సందర్శిస్తారు. సాయంత్రం హెచ్‌ఐసీసీలో ప్రారంభ కార్యక్రమం ఉంటుంది. మంత్రి కే తారకరామారావు ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్‌గోయల్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. 50 దేశాల నుంచి లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కంపెనీల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు, దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధులు 1,800 మంది తరలిరానున్నారు. మూడురోజులపాటు సదస్సులు, ప్యానల్ డిస్కషన్స్, వివిధ వస్తుప్రదర్శనలు ఉంటాయి. ఈ సదస్సు ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మాసిటీ, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్క్ ఇతర పారిశ్రామికరంగాల గురించి రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు మరోసారి వివరించనున్నది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కంపెనీల ప్రతినిధులను, పారిశ్రామికవేత్తలను కోరనున్నది. మొదటిదశ ఫార్మాసిటీని ఈ ఏడాదిలోనే ప్రారంభిస్తామని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు

మిగతా 2వ పేజీలో





తన పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి




తన పుట్టినరోజు సందర్భంగా ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకుంటున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు కూడా ఉన్నారు.

## నా మొదటి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్

- ట్విట్టర్‌లో పోస్టుచేసిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే తెలంగాణ పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు గతంలో తనకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరుచేసిన మొదటి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఫొటోలను ట్విట్టర్‌లో పోస్టుచేశారు. '1998లో నాకు తొలిసారి జారీ అయిన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌ను కనుగొన్నా' అని ఆయన ట్వీట్ చేశారు. త్రోబ్యాక్ హ్యాష్‌ట్యాగ్‌తో పాత చిత్రాలను ట్విట్టర్ ద్వారా అందరితో పంచుకుని, సంతోషం వ్యక్తం చేశారు.




మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో పోస్టుచేసిన తన మొదటి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్

## ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టివేత

**శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం కస్టమ్స్ అధికారులు భారీ మొత్తంలో బంగారాన్ని పట్టుకొన్నారు. జెడ్డా నుంచి వచ్చిన నలుగురు మహిళలు లోదుస్తుల్లో దాచుకొని బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారంతో తనిఖీ చేయగా.. రెండున్నర కిలోల బంగారం బయటపడింది. రోజుకో పద్ధతిలో అక్రమ బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తుండటంతో నిఘావర్గాలు పటిష్ఠ తనిఖీలు చేపడుతూ నిబంధనలను కఠినతరం చేశాయి. దాంతో స్మగ్లర్లు వివిధ రూపంలో బంగారాన్ని తీసుకువస్తూ పట్టుబడుతున్నారు.



# పెట్టుబడి వ్యయంలో మనమే టాప్

మొదటిపేజీ తరువాయి...

అధికమొత్తంలో నిధులను వెచ్చించడంతోపాటు రవాణా, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఖనిజవనరుల అభివృద్ధి తదితర రంగాలకు కూడా భారీగా వ్యయం చేస్తున్నది. దీనివల్ల రాష్ట్ర సంపద (జీఎస్డీపీ) మరింత పెరుగుతున్నది.

### శాశ్వత అవసరాలకు పెద్దపీట


తెలంగాణ ఆవిర్భవించిన నాటినుంచి తాత్కాలిక అవసరాలతోపాటు శాశ్వత అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకొంటున్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం.. భవిష్యత్ తరాల కోసం రాష్ట్ర సంపదను మరింత పెంచేందుకు భారీగా నిధులను కేటాయిస్తున్నది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడి వ్యయం కింద రూ.8,372.94 కోట్లు ఖర్చుచేసిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ మొత్తాన్ని 2015-16లో రూ.13,590.39 కోట్లకు పెంచింది. 2016-17లో ఈ కేటాయింపులను రూ. 33,370.57 కోట్లకు పెంచి రూ. 25.447.15 కోట్లు ఖర్చుచేసిన తెలంగాణ ప్రభుత్వం 2019-20లో పెట్టుబడుల వ్యయానికి దాదాపు రూ.18 కోట్లు వెచ్చించింది. నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రభుత్వం అన్ని ఖాతాలతో కలిపి ఏటా రూ.25 వేల కోట్ల మేరకు కేటాయిస్తున్నది. పెట్టుబడి వ్యయ ఖాతా కింద 2015-16లో నీటిపారుదలరంగానికి రూ.10,933.57 కోట్లు వెచ్చించిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం.. 2016-17లో రూ.13,664.58 కోట్లు, 2017-18లో రూ.10,078.46 కోట్లు వెచ్చించింది. 2018-19లో దాదాపు రూ.26 వేలకోట్లకు చేరిన ఈ వ్యయం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.18 వేల కోట్ల వరకు ఉన్నది. బడ్జెట్‌తోపాటు 'మిషన్ భగీరథ' లాంటి బృహత్తర కార్యక్రమాలకు వెచ్చిస్తున్న బడ్జెటేతర నిధులను కూడా కలిపితే తెలంగాణలో పెట్టుబడి వ్యయం 30 శాతం దాటుతున్నది. ఇందులో మిగతా నిధులను రవాణా, పరిశ్రమలు, ఖనిజవనరులు, వ్యవసాయ, అనుబంధ రంగాలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి వెచ్చిస్తున్నది. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఓవైపు రాబడిని పెంచుకోవడం, మరోవైపు రెవెన్యూ ఖర్చులను అదుపులో ఉంచుకోవడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను చాటుకొంటున్నది. 2014-15లో రూ.56,235గా ఉన్న రెవెన్యూ ఖర్చులు 2015-16లో రూ.75,900 కోట్లకు, 2016-17లో రూ.81,000 కోట్లకు, 2017-18లో రూ.85,365 కోట్లకు (సవరించిన అంచనాల ప్రకారం), 2018-19లో రూ.1,19,026 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఈ ఖర్చులు రూ.1,11,055 కోట్లుగా ఉంటాయని అంచనా.

# లాల్‌దర్వాజ ఆలయానికి నిధులు

## అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ

- అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్‌కు ఆదేశాలు
- మహంకాళి ఆలయ విస్తరణకు రూ.10కోట్లు.. అఫ్జల్‌గంజ్ మసీదు మరమ్మతుకు రూ.3కోట్లు ఇవ్వాలని కోరిన ఒవైసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ పాతబస్తీలోని లాల్‌దర్వాజ మహంకాళి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హామీఇచ్చారు. ఆలయ విస్తరణ, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. లాల్‌దర్వాజ మహంకాళి దేవాలయంతో



లాల్‌దర్వాజ ఆలయ అభివృద్ధికి నిధుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

పాటు, అఫ్జల్‌గంజ్ మసీదు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞాపనపత్రం అందజేశారు. 'లాల్‌దర్వాజ మహంకాళి దేవాలయానికి వందేండ్లకు పైగా చరిత్ర ఉన్నది. బోనాల సందర్భంగా లక్షల మంది భక్తులు ఈ గుడిలో పూజలు చేస్తారు. కానీ, ఆలయప్రాంగణం వంద గజాలు మాత్రమే ఉండటంతో బోనాలు సమర్పించే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రూ.10 కోట్లతో దేవాలయాన్ని విస్తరించి, అభివృద్ధి చేయండి. విస్తరణ వల్ల దీనికి అనుకుని ఉన్న ఆస్తులు కోల్పోయేవారికి జీహెచ్‌ఎంసీ ఆధీనంలోని ఫరీద్ మార్కెట్ ఆవరణలో 800 గజాల స్థలం కేటాయించండి. దేవాలయాన్ని విస్తరించి, అభివృద్ధి చేయడాన్ని అత్యంత ముఖ్యమైన పనిగా భావించండి. ఇది భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది' అని అక్బరుద్దీన్ కోరారు. తెలంగాణ బంగారు తెలంగాణ కావాలని దీవించాలని కోరుతూ ఈ దేవాలయంలో సీఎం కేసీఆర్ బంగారు బోనం సమర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా అక్బరుద్దీన్ గుర్తుచేశారు. అలాగే పాతబస్తీలోని అఫ్జల్‌గంజ్ మసీదు మరమ్మతుల కోసం రూ. మూడు కోట్లు మంజూరుచేయాలని కోరారు. మసీదు మరమ్మతులకు నోచుకోకపోవడం వల్ల ముస్లింల ప్రార్థనలకు ఇబ్బంది కలుగుతున్నదని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్బరుద్దీన్ విజ్ఞప్తికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. మహంకాళి దేవాలయ అభివృద్ధికి, అఫ్జల్‌గంజ్ మసీదు మరమ్మతులకు వెంటనే నిధులు విడుదలచేయనున్నట్టు హామీఇచ్చారు.

# 17 నుంచి బయోఏషియా సదస్సు

మొదటిపేజీ తరువాయి...

BioAsia 2020
Today for Tomorrow
17TH - 19TH FEB, HYDERABAD

ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో సదస్సు మరింత ప్రాముఖ్యం సంతరించుకున్నది. లైఫ్‌సైన్సెస్, ఫార్మారంగానికి సీఎం చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నది. ఫార్మారంగానికి ఫార్మాసిటీ ఏర్పాటుచేయగా, లైఫ్‌సైన్సెస్ రంగంలోను జీనోమ్ వ్యాలీకి పెద్దఎత్తున నిధులు కేటాయించడమే కాకుండా అదనంగా భూమిని సేకరించి అభివృద్ధి చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టితో అనేక ప్రపంచస్థాయి కంపెనీలు ఇక్కడికి వచ్చాయి. జీనోమ్ వ్యాలీకి ప్రత్యేకంగా ఐలాను కూడా కేటాయించారు. ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టడానికి అనేక కంపెనీలు ఉత్సాహం చూపుతున్నాయి. 19 వేల ఎకరాల్లో నిర్మించనున్న ఫార్మాసిటీకి ఇప్పటికే 10 వేల ఎకరాల భూసేకరణ పూర్తయింది. మరో రెండువేల ఎకరాల సేకరణ పూర్తికాగానే ఫార్మాసిటీ మొదటిదశను ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన పర్యావరణ అనుమతులు సహా నిమ్జ్ హోదా కూడా వచ్చింది. మౌలిక సదుపాయాల పనులు ప్రారంభమయ్యాయి. ఫార్మా వర్సిటీ, పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), ఇక్కడి కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు అక్కడే నివాసం ఉండేలా ప్రభుత్వం భూములు కేటాయించనున్నది. ఫార్మా కంపెనీలకు ప్రధానమైన పర్యావరణ అనుమతులు ఇప్పటికే వచ్చినందున పారిశ్రామికవేత్తలు ఆసక్తితో ఉన్నారు.

### భాగస్వామ్య దేశంగా స్విట్జర్లాండ్

బయోఏషియా సదస్సుకు ఈసారి భాగస్వామ్య దేశంగా స్విట్జర్లాండ్ ఉండనున్నది. ఈ మేరకు ఆ దేశ ప్రతినిధి బృందం ఇటీవలే రాష్ట్రానికి వచ్చి తమ ఆసక్తిని తెలిపింది. ఒప్పందంపై సంతకం కూడా చేసింది. భారత దేశంలోని నాలుగు రాష్ట్రాలు కూడా భాగస్వామ్యానికి ముందుకొచ్చాయి. ఇందులో గుజరాత్, కేరళ, ఒడిశా, అసోం ఉన్నాయి. కేంద్ర ఎమ్మెస్‌ఎంఈ మంత్రిత్వశాఖ కూడా ఇందులో భాగస్వామ్యం కానున్నది. ఆ శాఖ తన అంగీకారాన్ని బయోఏషియా నిర్వాహకులకు తెలిపింది. లైఫ్‌సైన్సెస్ విభాగానికి ఎమ్మెస్‌ఎంఈ రంగానిది కీలకపాత్ర. ఈ నేపథ్యంలో ఎమ్మెస్‌ఎంఈ మంత్రిత్వశాఖ భాగస్వామ్యం మరింత ఫలితాన్ని ఇవ్వనున్నదని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ సదస్సులో రేపటి కోసం నేడు (టుడే ఫర్ టుమారో) ఇతి వృత్తాన్ని ఎంపికచేశారు. ఆరోగ్యరంగంలో వస్తున్న మార్పులు, ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలను ఉద్దేశించి ఇతివృత్తాన్ని తీసుకున్నారు. లైఫ్‌సైన్సెస్ కంపెనీలు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు పెట్టుబడులు పెడితే రాబోయే రోజుల్లో వాటిని విలువ మరింత పెరుగుతుందని వివరించనున్నారు.

### స్టార్టప్‌లకు ప్రాధాన్యం

**లైఫ్‌సైన్సెస్** రంగంలో స్టార్టప్‌ల ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వాటి ఎంట్రీలకు ప్రత్యేకంగా దరఖాస్తులను ఆహ్వానించింది. స్టార్టప్‌ల కోసం 300 దరఖాస్తులు అందాయి. వీటికి ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటుచేయనున్నారు. ఉత్తమ స్టార్టప్‌లకు సదస్సు ముగింపు సందర్భంగా మంత్రి కేటీఆర్ అవార్డులు అందజేయనున్నారు. ఉత్తమ స్టార్టప్‌ల అభివృద్ధికి ప్రపంచస్థాయి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సహాయంచేసే అవకాశమున్నదని అంచనా వేస్తున్నారు. తద్వారా కొత్తకొత్త విధానాలు, పరిష్కారాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. మంత్రి కేటీఆర్ నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ, గ్రామీణ, పట్టణ యువత నూతన ఆవిష్కరణలను మరింత ప్రోత్సాహిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటా ఇన్నోవేటర్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రంగంలోనూ స్టార్టప్‌లను ప్రోత్సహించాలనే ఆయన లక్ష్యానికి అనుగుణంగా అవకాశాలను కల్పిస్తున్నారు. ఉత్తమమైన వాటికి నగదు బహుమతిని అందించనున్నారు.

## విశ్రాంత జడ్జి జయచంద్రారెడ్డి కన్నుమూత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కే జయచంద్రారెడ్డి (90) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని దవాఖానలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. జస్టిస్ జయచంద్రారెడ్డి స్వస్థలం ఏపీలోని కడప జిల్లా యండపల్లి గ్రామం. ఆయన గతంలో లా కమిషన్, ప్రెస్ కౌన్సిల్‌కు చైర్మన్‌గా పనిచేశారు.

## రాష్ట్రంలో మరో రెండు కరోనా అనుమానిత కేసులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా వైరస్‌కు సంబంధించి ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదుకాలేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఆదివారం ఇద్దరు అనుమానితులకు కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించామని, ఇప్పటివరకు మొత్తం 72 మందికి పరీక్షలు జరుపగా.. 70 మందికి నెగెటివ్ వచ్చినట్టు తెలిపారు. ఆదివారం పరీక్షలు నిర్వహించిన అనుమానిత రోగుల నివేదిక ఫలితాలు సోమవారం వస్తాయన్నారు.


### ముహూర్తం

**సూర్యోదయం:** 6.46 గంటలకు

**సూర్యాస్తమయం:** 6.08 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం పాడ్యమి ఉదయం 9.45 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: మఖ సాయంత్రం 5.06 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.58 నుంచి సాయంత్రం 4.23 వరకు, రాహుకాలం: ఉదయం 8.11 నుంచి 9.37 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.05 నుంచి 12.50 వరకు, తిరిగి 3.05 నుంచి 3.52 వరకు, వర్జ్యం: ఉదయం 6.25 నుంచి 7.51 వరకు, తిరిగి రాత్రి 12.12 నుంచి 1.37 వరకు.

### లోకం పోకడ




మీకు ఉచితంగా గవర్నమెంటు నివాస యోగ్యం కల్పిస్తాం పదా!

# మెట్రో విస్తరణకు అడుగులు

- రెండోదశకు ప్రభుత్వం సన్నాహాలు
- ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్‌వేతోపాటు మరిన్ని ప్రతిపాదనలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**



హైదరాబాద్ నగర రూపురేఖలు మార్చేక్రమంలో మెట్రోరైలు మరికొన్ని కొత్త రూట్లలో దూసుకుపోనున్నది. మొదటిదశ అందుబాటులోకి రావడంతో చాలా రూట్లలో మెట్రో కావాలని డిమాండ్ పెరుగుతుండటంతో రెండోదశ మెట్రోకు అడుగులు పడుతున్నాయి. మొదటిదశలోని మూడు కారిడార్లలో మెట్రో ప్రయాణం సాఫీగా సాగుతున్నది. బిజీ జీవితం గడిపే నగర ప్రజలు మెట్రోరైలు ప్రయాణంపై ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ మెట్రోరైలు మొదటిదశ ప్రాజెక్టు దాదాపు పూర్తికావడంతో రెండోదశపై చర్చ జరుగుతున్నది. దీనికితోడు కారిడార్-2 ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఎంజీబీఎస్‌లో అధికారులతో సమావేశమై మెట్రో విస్తరణ పనులపై దృష్టిసారించాలని సూచించారు. రెండోదశ ప్రతిపాదనలతో పాటు నగరంలో మరిన్ని రూట్లను కలుపుకొని పరిపూర్ణంగా ప్రజలకు మెట్రో ప్రయాణాన్ని అందుబాటులోకి తేనున్నారు. ఇప్పటివరకు మూడు కారిడార్ల నిర్మాణానికి పరిమితమైన మెట్రో నాలుగో కారిడార్ నిర్మాణానికి సిద్ధమవుతున్నది. కారిడార్- 4ను బీహెచ్ఈఎల్ నుంచి లక్డీకాపూల్‌వరకు 26.2 కిలోమీటర్లు మియాపూర్ మీదుగా నిర్మించేందుకు నిర్ణయించారు. కారిడార్-3ను కూడా నాగోల్ నుంచి ఎల్బీనగర్‌వరకు 5.1 కిలోమీటర్లు పొడిగించనున్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి హెచ్చెమ్మార్ అందించింది. ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వేను కూడా నిర్మించేందుకు సిద్ధమయ్యారు. మొదటిదశలో ఇప్పటికే నాగోల్ నుంచి రాయదుర్గంవరకు 29 కిలోమీటర్లు, ఎల్బీనగర్ నుంచి మియాపూర్ వరకు 29 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 11 కిలోమీటర్లు పూర్తిచేసుకొని మొత్తం 69 కిలోమీటర్ల మార్గాన్ని అందుబాటులోకి తెచ్చి దేశంలోనే రెండో అతి పెద్ద మెట్రోరైలు ప్రాజెక్టుగా అవతరించింది. రెండోదశకు సంబంధించి ఇప్పటికే ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్‌కు డీపీఆర్ తయారు చేసే బాధ్యతను అప్పగించారు. ప్రాథమిక నివేదిక అందజేసిన ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు సిద్ధమవుతున్నది. మొదటిదశ కాకుండా మరో 100 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మెట్రో వర్గాలు తెలిపాయి. ప్రతిపాదన దశలో ఉన్న ఈ మార్గాలు డీపీఆర్ తర్వాత స్పష్టత వచ్చే అవకాశమున్నది.

### ప్రతిపాదిత మార్గాలు..

1. **రాయదుర్గం- శంషాబాద్:** ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రో 31 కిలోమీటర్ల మార్గాన్ని రాయదుర్గం నుంచి గచ్చిబౌలిని టచ్‌చేస్తూ ఓఆర్ఆర్, ఖాజాగూడ, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్‌వరకు.
2. **బీహెచ్ఈఎల్ - లక్డీకాపూల్:** బీహెచ్ఈఎల్ నుంచి ప్రారంభమై మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ జంక్షన్, షేక్‌పేట, మెహిదీపట్నం మీదుగా లక్డీకాపూల్‌కు చేరుకొని మొదటిదశ ప్రాజెక్టులో నిర్మించిన కారిడార్- 1కు అనుసంధానం అవుతుంది.
3. **నాగోల్ - ఎల్బీనగర్:** మెట్రో మొదటిదశ ప్రాజెక్టులోని కారిడార్- 3లో నాగోల్ నుంచి ప్రారంభమై బండ్లగూడ జంక్షన్, కామినేని దవాఖాన మీదుగా ఎల్బీనగర్‌లోని మొదటిదశ కారిడార్- 1కు (5.1 కిలోమీటర్లు) అనుసంధానం అవుతుంది.
4. **ఎల్బీనగర్- ఫలక్‌నుమా:** ఎల్బీనగర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట మీదుగా ఫలక్‌నుమాలోని మొదటిదశ ప్రాజెక్టు కారిడార్- 2కు అనుసంధానమవుతుంది. అక్కడి నుంచి పాతబస్తీ ప్రాంతాలమీదుగా శంషాబాద్ వరకు.
5. **ఉప్పల్ - ఈసీఐఎల్:** ఉప్పల్ నుంచి మల్లాపూర్ మీదుగా ఈసీఐఎల్‌వరకు.
6. ప్యారడైజ్ నుంచి కండ్లకోయ ఓఆర్ఆర్ జంక్షన్‌వరకు.
7. జేబీఎస్ నుంచి శామీర్‌పేటవరకు.

# సోమశిల-సిద్దేశ్వరం బ్రిడ్జి నిర్మించాలి

- కొల్లాపూర్ ఎమ్మెల్యేకు కర్నూలు రైతుల వినతి
- ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయానన్న ఎమ్మెల్యే

**హైదరాబాద్/కొల్లాపూర్, నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని కృష్ణానదిపై సోమశిల- సిద్దేశ్వరం వద్ద వంతెన నిర్మించాలని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కొత్తపల్లి మండలానికి చెందిన రైతులు కోరారు. ఈ మేరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది రైతులు ఆదివారం కొల్లాపూర్‌కు వచ్చి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నదిపై బ్రిడ్జి లేకపోవడంతో కర్నూలు జిల్లాకు చెందిన నదీ తీర ప్రాంత ప్రజలతోపాటు తెలంగాణకు చెందినవారు కూడా నాటు పడవల్లో ప్రయాణిస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో పలు సందర్భాల్లో నాటు పడవలు మునిగి చాలా మంది చనిపోతున్నారని చెప్పారు. ఒకసారి ఏకంగా 62 మంది మృత్యువాతపడిన విషయాన్ని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి రాయలసీమ ప్రాంతానికి దూరం తగ్గే ఈ బ్రిడ్జి వల్ల రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తమ ప్రాంత ఎమ్మెల్యేల ద్వారా ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి చర్చిస్తామని వెల్లడించారు. తెలంగాణ తరపున చొరవ తీసుకోవాల్సిందిగా కొల్లాపూర్ ఎమ్మెల్యేను కోరారు. అయితే ఈ అంశాన్ని ఇప్పటికే తాను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, కచ్చితంగా నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టేలా కృషి చేస్తానని హర్షవర్ధన్ హామీ ఇచ్చారు.



కృష్ణానదిపై సోమశిల- సిద్దేశ్వరం వద్ద వంతెన నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరుతూ కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీలోని కర్నూలు రైతులు

# సిరులపంట

మొదటిపేజీ తరువాయి...

సాగయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే 29.02 శాతం అధికం. ఇందులో వరి వానకాలంలో 37.09శాతం, యాసంగిలో 53.7 శాతం అధికంగా సాగయింది. వానకాలంలో 78.68లక్షల టన్నులు ఉత్పత్తి రాగా, యాసంగిలో 51.33లక్షల టన్నులు రానున్నట్టు అర్థగణాంకశాఖ అంచనావేసింది. పప్పుధాన్యాల పంటల సాగు 13.10లక్షల ఎకరాల్లో కాగా, ఉత్పత్తి మొత్తం 4.67లక్షల టన్నులుగా ఉన్నది. ఇది గతేడాది కంటే 27వేల టన్నులు అధికం. మిర్చి ఈసారి 24వేల టన్నులు పెరిగి 3.28 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని నివేదికలో పేర్కొన్నారు. పసుపు ఉత్పత్తి గతం కంటే 14వేల టన్నులు తగ్గింది. ఈసారి 3.05 లక్షల టన్నులు అంచనా వేసింది.

### కంది దిగుబడి.. పత్తి ఉత్పత్తి పెరుగుదల

కంది పంటను వానకాలంలో 7.29 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. గతేడాది కంటే స్వల్పంగా తగ్గింది. అయితే ఉత్పత్తి మాత్రం 15 వేల మెట్రిక్ టన్నులు పెరిగింది. యాసంగిలో కందుల ఉత్పత్తి 2.07 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని పేర్కొన్నారు. ఇది గతేడాది 1.92 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నది. రాష్ట్రంలో వరి తర్వాత ప్రధానపంట అయిన పత్తి ఈసారి 52.24 లక్షల ఎకరాల్లో సాగయింది. గతంకంటే 2.75 లక్షల ఎకరాల్లో అధికంగా సాగు నమోదయింది. అయితే ఉత్పత్తి 48.62 లక్షల బేల్స్ (ఒక్క బేల్ 170 కేజీలు) గా అంచనావేసింది.

### పెరిగిన మక్కజొన్న.. తగ్గిన వేరుశనగ

మక్కజొన్న రెండు సీజన్లలో కలిపి 13.69 లక్షల ఎకరాల్లో సాగయింది. గతేడాది కంటే 27 వేల ఎకరాలు అధికంగా సాగుచేశారు. మొత్తం 25.59 లక్షల టన్నుల ఉత్పత్తి రానున్నట్టు అంచనా వేశారు. గతేడాదితో చూస్తే 4.77లక్షల టన్నులు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నది. వానకాలంలో 15.65లక్షల టన్ను లు, యాసంగిలో 9.94 లక్షల టన్నులు ఉత్పత్తి కానున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. పెసర గతేడాది ఈసారి ఒకేరకంగా 48 వేల టన్నుల ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. మినుములు ఉత్పత్తి పడిపోయింది. గతంలో 31 వేల టన్నులు రాగా, ఇప్పుడు 18 వేల టన్నులకే పరిమితమయింది. సోయాబీన్ 88 వేల టన్నులు పెరిగి ఈసారి 3.22 లక్షల టన్నులు వస్తుందని అంచనా. శనగ 1.46 లక్షల ఎకరాల్లో సాగవగా, 1.89 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనా వేశారు. గతేడాది కంటే 1.04 లక్షల ఎకరాలు అధికంగా సాగు కావడంతో ఉత్పత్తి కూడా 25 వేల టన్నులు పెరుగనున్నది. వేరుశనగ 3.27 లక్షల ఎకరాల్లో సాగవగా, గతం కంటే 32 వేల టన్నుల ఉత్పత్తి తగ్గింది. 2.83 లక్షల టన్నులు వస్తుందని నివేదించారు. నూనెగింజల ఉత్పత్తి ఈసారి పెరిగింది. 8.278 లక్షల ఎకరాల్లో సాగు నమోదవగా, 6.64 లక్షల టన్నుల ఉత్పత్తి అంచనావేశారు. గతేడాది కంటే 42 వేల టన్నులు పెరుగడం గమనార్హం.




## శునకానికి పేస్‌మేకర్

దేశంలోనే తొలిసారి.. ఢిల్లీలో ఘటన

**న్యూఢిల్లీ:** ఏడున్నరేండ్ల వయసున్న ఓ కుక్కకు శస్త్ర చికిత్స చేసి పేస్‌మేకర్(గుండె స్పందనలను ప్రేరేపించే యంత్రం)ను అమర్చారు. ఇలాంటి ఘటన దేశంలో జరుగడం ఇదే తొలిసారని పశు వైద్యులు తెలిపారు. గుర్గావ్‌కు చెందిన ఓ నివాసి కాకర్ స్పెనియల్ జాతికి చెందిన ఓ ఆడ శునకాన్ని పెంచుకుంటున్నాడు. దాని పేరు ఖుషి. కొంతకాలంగా మూర్ఛపోవడాన్ని గమనించిన యజమాని, మ్యాక్స్ పశు దవాఖాన వైద్యులకు చూపించాడు. ఖుషిని పరీక్షించిన వైద్యులు దాని గుండె నాళాల్లో రక్త ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయని నిర్ధారించారు. సాధారణంగా కుక్క గుండె నిమిషానికి 60 నుంచి 120 సార్లు కొట్టుకుంటుందని, అయితే ఖుషి గుండె 20 సార్లే కొట్టుకుంటున్నదని.. ఇది ఇలాగే కొనసాగితే దాని ప్రాణానికి ప్రమాదమన్నారు. పశు వైద్యుడు భాను దేవ్ శర్మ గత డిసెంబర్ 15న గంటన్నర పాటు శ్రమించి ఖుషి గుండెకు పేస్‌మేకర్‌ను అమర్చారు.

## దారిచ్చిన మానవత్వం

ఓ హిందువు అంతిమయాత్రలో పక్కకు తప్పుకొన్న సీఏఏ ఆందోళనకారులు

**న్యూఢిల్లీ:** అక్కడ ఒక మతానికి చెందినవారు తమ పౌరసత్వం గురించి ఆందోళన చెందుతూ పెద్ద సంఖ్యలో గుమిగూడి నిరసన వ్యక్తంచేస్తున్నారు. ఇంతలో ఓ హిందువు మృతదేహాన్ని నిరసన తెలుపుతున్న ప్రాంతం గుండా అంత్యక్రియలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. దాంతో మరో మాట మాట్లాడకుండా ఒక మతానికి చెందినవారు దారిచ్చి పరమత సహనం పాటించారు. ఈ దృశ్యం ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో ఆవిష్కృతమైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏను నిరసిస్తూ గత 50 రోజులుగా షాహీన్‌బాగ్‌లో రోడ్డుకు అడ్డంగా పలువురు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. కాగా, ఆదివారం సమీప ప్రాంతంలో నివసించే హిందూ కుటుంబంలోని ఒక వ్యక్తి కన్నుమూశారు. షాహీన్‌బాగ్‌లో ఆందోళనలు చేపడుతున్న ప్రాంతం మీదుగా మృతదేహాన్ని తీసుకెళ్లాల్సి ఉంది. విషయాన్ని గుర్తించిన కొందరు నిరసనకారులు.. తోటివారి చెవినవేసి సహకరించాల్సిందిగా కోరారు. దాంతో నిముషాల వ్యవధిలో దారిచ్చేలా పక్కకు తప్పుకోవడంతో.. అంత్యక్రియల ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగింది.

## సీఏఏను వెనక్కి తీసుకోవాలి

గోవా ఆర్చ్‌బిషప్ డిమాండ్

**పనాజీ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) తక్షణమే బేషరతుగా వెనక్కి తీసుకోవాలని గోవా, డామన్ ఆర్చ్‌బిషప్ రెవ్ ఫిలిప్ నెరి ఫెర్రా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అసమ్మతి తెలిపే హక్కును అణచివేయడాన్ని ఆపాలన్నారు. దేశవ్యాప్త ఎన్నార్సీ (జాతీయ పౌర జాబితా), ఎన్పీఆర్ (జాతీయ జనాభా పట్టిక) అమలు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిపై గోవా బీజేపీ ప్రధాన కార్యదర్శి నరేంద్ర సావైకర్ స్పందిస్తూ.. గోవా ప్రజలతోపాటు దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు సీఏఏకు మద్దతునిస్తున్నారని, ఆర్చ్‌బిషప్ ఎందుకు దీనిని వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. కాగా, ఆరెస్సెస్ అజెండాను తిప్పికొట్టేందుకు పౌరసమాజం, చదువుకున్న యువత గ్రామాలకు వెళ్లాలని సినీనటుడు సుశాంత్‌సింగ్ కోరారు. సీఏఏకు వ్యతిరేకంగా ఆదివారం ముంబైలోని హజ్ హౌజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత గడ్డ నుంచి మతతత్వం పోవాలని, పోరాటం ద్వారానే సీఏఏని అడ్డుకోగలమన్నారు.



## 2017 బ్యాచ్ ఐఏఎస్‌లకు పోస్టింగ్స్, బదిలీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పనిచేసేందుకు 2017 బ్యాచ్‌కు చెందిన 49 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు ఇవ్వగా.. మరికొందరిని ప్రస్తుత స్థానం నుంచి బదిలీచేస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్‌లు పొందినవారిలో 47 మందిని ఆయా జిల్లాల్లో అదనపు కలెక్టర్లుగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లుగా నియమించారు. ఒకరు గ్రౌండ్‌వాటర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, మరొకరు చీఫ్‌సెక్రటరీ ఓఎస్డీగా నియామకమయ్యారు.

**ప్రభుత్వం పోస్టులు కేటాయిస్తూ బదిలీ చేసినవారి వివరాలు**

| అధికారి పేరు | బదిలీ పోస్టు | జిల్లా పేరు |
|---|---|---|
| జీ సంధ్యారాణి | అదనపు కలెక్టర్ | ఆదిలాబాద్ |
| కే వెంకటేశ్వర్లు | అదనపు కలెక్టర్ | భద్రాద్రి కొత్తగూడెం |
| పీ రాజావిక్రమ్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | జయశంకర్ భూపాలపల్లి |
| ఎం క్రిష్ణ | అదనపు కలెక్టర్ | హైదరాబాద్ |
| బీ రాజేశం | అదనపు కలెక్టర్ | జగిత్యాల |
| ఓజే మధు | అదనపు కలెక్టర్ | జనగామ |
| పీ శ్రీనివాస్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | జోగుళాంబ గద్వాల |
| పీ యాదిరెడ్డి | అదనపు కలెక్టర్ | కామారెడ్డి |
| జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ | అదనపు కలెక్టర్ | కరీంనగర్ |
| ఎన్ మధుసూదన్ | అదనపు కలెక్టర్ | ఖమ్మం |
| పర్స రాంబాబు | అదనపు కలెక్టర్ | కుమ్రంభీం ఆసిఫాబాద్ |
| ఎం వెంకటేశ్వర్లు | అదనపు కలెక్టర్ | మహబూబాబాద్ |
| కే సీతారామారావు | అదనపు కలెక్టర్ | మహబూబ్‌నగర్ |
| వై సురేందర్‌రావు | అదనపు కలెక్టర్ | మంచిర్యాల |
| జీ నగేశ్ | అదనపు కలెక్టర్ | మెదక్ |
| కే విద్యాసాగర్ | అదనపు కలెక్టర్ | మేడ్చల్ మల్కాజిగిరి |
| ఏ వెంకట్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | ములుగు |
| వీ హన్మంతరెడ్డి | అదనపు కలెక్టర్ | నాగర్‌కర్నూల్ |
| వీ చంద్రశేఖర్ | అదనపు కలెక్టర్ | నల్లగొండ |
| డీ శ్రీనివాస్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | నారాయణపేట |
| ఏ భాస్కర్‌రావు | అదనపు కలెక్టర్ | నిర్మల్ |
| బీ చంద్రశేఖర్ | అదనపు కలెక్టర్ | నిజామాబాద్ |
| వీ లక్ష్మీనారాయణ | అదనపు కలెక్టర్ | పెద్దపల్లి |
| ఆర్ అంజయ్య | అదనపు కలెక్టర్ | రాజన్న సిరిసిల్ల |
| ఎస్ హరీశ్ | అదనపు కలెక్టర్ | రంగారెడ్డి |
| జీ వీరారెడ్డి | అదనపు కలెక్టర్ | సంగారెడ్డి |
| ఎస్ పద్మాకర్ | అదనపు కలెక్టర్ | సిద్దిపేట |
| డీ సంజీవరెడ్డి | అదనపు కలెక్టర్ | సూర్యాపేట |
| సబావత్ మోతీలాల్ | అదనపు కలెక్టర్ | వికారాబాద్ |
| డీ వేణుగోపాల్ | అదనపు కలెక్టర్ | వనపర్తి |
| పీ మహేందర్‌రెడ్డి | అదనపు కలెక్టర్ | వరంగల్ రూరల్ |
| జీ రమేశ్ | అదనపు కలెక్టర్ | యాదాద్రి భువనగిరి |
| ఎం డేవిడ్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | ఆదిలాబాద్ |
| వెంకటేశ్ ధోత్రే | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | కామారెడ్డి |
| స్నేహలత మొగిలి | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | ఖమ్మం |
| పీ మోహన్‌లాల్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | మహబూబ్‌నగర్ |
| డీ జాన్‌శామ్సన్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | మంచిర్యాల |
| ఎం మధుచౌదరి | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | నాగకర్‌కర్నూల్ |
| రాహుల్‌శర్మ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | నల్లగొండ |
| బీ ఎస్ లత | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | నిజామాబాద్ |
| ప్రతీక్ జైన్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | సంగారెడ్డి |
| మంజామిల్‌ఖాన్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | సిద్దిపేట |
| భీమ్యానాయక్ | అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) | యాదాద్రి భువనగిరి |
| సంతోష్ బీఎం | గ్రౌండ్‌వాటర్ ప్రాజెక్టు డైరెక్టర్ | హైదరాబాద్ |
| కే చంద్రమోహన్ | చీఫ్‌సెక్రటరీ ఓఎస్డీ | హైదరాబాద్ |



ఆదివారం ఏపీలోని కావలిలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు, దళిత సంఘాల నాయకులు

## విద్యతోనే దళితుల అభివృద్ధి

ఏపీ పర్యటనలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దళితుల అభివృద్ధి విద్యతోనే సాధ్యమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్నదని, సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అధిక సంఖ్యలో గురుకుల విద్యాలయాలను ఏర్పాటుచేసి దళిత, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం ఏపీలోని నెల్లూరు జిల్లా కావలిలో పర్యటించిన ఆయనను ఆ రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు, దళిత సంఘాల నాయకులు సత్కరించారు. కావలిలోని జవహర్ భారతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎర్రోళ్ల మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అన్నివిధాలా కృషిచేస్తున్నారని చెప్పారు. ఈ పర్యటనలో ఎర్రోళ్ల వెంట కమిషన్ సభ్యుడు రాంబల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## రూ.30 కోట్ల మేర నిధులు పక్కదారి

- టీఎస్ రెడ్కో కుంభకోణంలో కీలక ఆధారాలు సేకరిస్తున్న సీఐడీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాల కుంభకోణంలో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. టీఎస్ రెడ్కో అధికారులు వినియోగదారుల నుంచి సేకరించిన రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డుల్లోని సమాచారాన్ని వాడుకొని నిధులు కొల్లగొట్టిన తీరుపై సీఐడీ అధికారులు ఆరాతీస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మొత్తం రూ.30 కోట్ల మేర నిధులు పక్కదారి పట్టినట్టు గుర్తించారు.


## వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు

- సమీక్షా సమావేశంలో ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి

**హైదరాబాద్/ గజ్వేల్, నమస్తే తెలంగాణ:** వచ్చే వేసవిలో రాష్ట్రంలోని ఏ ఒక్క ఆవాసంలోనూ తాగునీటి సమస్య రానివ్వొద్దని ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి ఆదేశించారు. మార్చి చివరినాటికి మిషన్ భగీరథ స్థిరీకరణ పనులు పూర్తిచేయాలని చెప్పారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ కోమటిబండ మిషన్‌భగీరథ నాలెడ్జ్‌సెంటర్‌లో ఆదివారం సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మెజార్టీ గ్రామీణ ఆవాసాల్లో భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నాయని తెలిపారు. ఇంట్రావిలేజ్ పనుల్లో ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని పలు గ్రామాలు వెనుకబడ్డాయని, అక్కడి అధికారులు తీరుమార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు, జిల్లాల ఎస్‌ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

# రక్షణ భూములతో ఆదాయం!


- నిధుల కొరతను అధిగమిస్తాం
- దశలవారీగా రక్షణ కొనుగోళ్లు
- సీడీఎస్ బిపిన్ రావత్ వెల్లడి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** సుమారు 1.34 లక్షల కోట్ల పెన్షన్ భారంతోపాటు ఇప్పటికే కొనుగోలు చేసిన వాటికి ఈఎంఐలు చెల్లించడానికి సతమతమవుతున్న సాయుధ బలగాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు నిరాశాజనకంగానే ఉన్నాయి. అయితే రక్షణ బలగాల అధిపతి (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ మాత్రం ఆశావహ దృక్పథంతో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ భూముల ద్వారా ఆదాయాన్ని సముపార్జించి నిధుల కొరతను అధిగమించనున్నట్లు చెప్పారు. 'మౌలిక వసతుల అభివృద్ధికి వచ్చే 10 ఏండ్లలో రూ.35 వేల కోట్ల నిధులు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది రక్షణ నిధుల నుంచి కాదు. రక్షణ శాఖ భూముల నుంచి ఆదాయం పొందొచ్చు. భారతమాల వంటి ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ భూములను కేటాయించి, అందుకు బదులుగా వారిని మనం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నెలకొల్పాలని కోరవచ్చు' అని రావత్ చెప్పారు. దేశవ్యాప్తంగా త్రివిధ దళాలకు సమారు 17.54 లక్షల ఎకరాల భూమి ఉన్నది. 'బడ్జెట్‌ను మనం ద్రవ్య కోణంలో చూడకూడదు. ప్రభుత్వం మనకు రూ.2 లక్షల కోట్లు కేటాయించి.. వచ్చే రెండేండ్లలో ఆధునీకరించాలంటే సాధ్యమవుతుందా? కాదు. ఎందుకంటే మనకు కావాల్సినవి బహిరంగ మార్కెట్‌లో దొరికేవి కావు' అని ఒక జాతీయ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రావత్ చెప్పారు. వాయుసేవ వద్ద 28 స్క్వాడ్రన్స్ మాత్రమే ఉన్నాయి. మరో 100 యుద్ధ విమానాల కోసం ఎదురుచూస్తున్నది. మరో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కోసం నేవీ నిరీక్షిస్తున్నది. సైన్యమూ ఆయుధ కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నది. ఇందుకు బడ్జెట్ కేటాయింపులు సరిపోతాయా అని ప్రశ్నించగా.. 'ప్రాధాన్యాలను మనం మొదట గుర్తించాల్సిన అవసరం ఉన్నది. ఆధునీకరణలో త్రివిధ దళాల మధ్య సమతుల్యత మరిచిపోకూడదు. ఆయుధ కొనుగోళ్లు దశలవారీగా జరుగాలి. ఉదాహరణకు, మన యుద్ధ ట్యాంకులన్నీ రెండు మూడేండ్లలో కొనుగోళ్లు చేశామనుకో.. 20-30 ఏండ్లకు ఒకేసారి వాటి జీవితకాలం తీరిపోతుంది. అలా ఉండకూడదు' అని బదులిచ్చారు. నౌకాదళానికి మూడో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కొనుగోలు విషయమై ప్రశ్నించగా.. 'అవసరమైనప్పుడు దానిని కొనుగోలు చేస్తాం. పదేండ్ల తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయో మనం అంచనా వేయలేం. హిందూ మహాసముద్ర ప్రాంతంలో మన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ద్వీప భూభాగాల సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉన్నది' అని రావత్ పేర్కొన్నారు. అలాగే నిధుల కొరతను అధిగమించేందుకు దేశవ్యాప్తంగా రక్షణ శాఖకు ఉన్న భూముల నుంచి ఆదాయం పొందే మార్గాలపై దృష్టిసారించనున్నట్లు తెలిపారు.

## ఆరెస్సెస్ సిద్ధాంతకర్త పరమేశ్వరన్ కన్నుమూత


ప్రధాని మోదీ, అమిత్ షా, కేరళ గవర్నర్, సీఎం నివాళి



**కొచ్చి:** ఆరెస్సెస్ సిద్ధాంతకర్త, రచయిత పీ పరమేశ్వరన్(93) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కేరళలోని పాలక్కాడ్ జిల్లా ఒట్టపళంలోని ఓ ఆయుర్వేద దవాఖానలో చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. చిన్నప్పుడు ఆరెస్సెస్ పట్ల ఆకర్షితుడైన పరమేశ్వరన్ .. జనసంఘ్ కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా.. ఢిల్లీలోని దీన్‌దయాళ్ అధ్యయన సంస్థ డైరెక్టర్‌గా పనిచేశారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ, వాజపేయి, అద్వానీ తదితరులతో కలిసి పనిచేశారు. కేరళలో జాతీయవాద ఆలోచనల విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్రం 2004లో పద్మశ్రీ, 2018లో పద్మవిభూషణ్ అవార్డులను ప్రదానం చేసింది. ఆయన మృతికి ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్‌ఖాన్, సీఎం విజయన్ సంతాపం తెలిపారు. 'పరమేశ్వర్ జీ ఆలోచనలు ఫలవంతమైనవి, అత్యుత్తమం, ఆయన ఎవరికీ లొంగలేదు' అని మోదీ ట్వీట్‌చేశారు. పరమేశ్వరన్ మృతదేహాన్ని ఆదివారం కొచ్చిలోని ఆరెస్సెస్ ప్రధానకార్యాలయంలో ఉంచారు. సంఘ్, బీజేపీ నేతలు , ప్రజలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన స్వస్థలమైన అలప్పుజ జిల్లాలోని ముహమ్మ వద్ద అంత్యక్రియలు నిర్వహిస్తామని సంఘ్ నేతలు తెలిపారు.

## హిందువుల సాధికారతకు కృషి చేయాలి

భారత్‌లో పని చేయాలకునే వారికి ఆరెస్సెస్ నేత భయ్యాజీ హితవు



**పనాజీ:** భారత్‌లో పని చేయాలని కోరుకునే వారు హిందూ సామాజిక వర్గం సాధికారత కోసం పని చేయాల్సి ఉంటుందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి సురేశ్ భయ్యాజీ స్పష్టంచేశారు. గోవా రాజధాని పనాజీలోని డోనా పాలాలో 'విశ్వగురు భారత్, ఆరెస్సెస్ దృక్కోణం' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో హిందువులు ఎత్తుపల్లాలను చూశారు. భారత్‌ను హిందువు (సామాజిక వర్గం)ల నుంచి విభజించొద్దు. ఈ దేశంలో హిందువులు కేంద్రస్థానంలో ఉన్నారు. హిందువు మతతత్వవాది కాదు. విరోధి కాదు. హిందూ సామాజిక వర్గాలతో కలిసి పనిచేయడానికి ఏ ఒక్కరూ నిరాసక్తత వ్యక్తం చేయనక్కరలేదు. 2020లో భారత్ 'అద్భుతమైన దేశం (సూపర్ నేషన్)'గా అవతరిస్తుందని ఓ మేధావి చెప్పారు' అని తెలిపారు. 'హిందువుల మధ్య ఐక్యత కోసం వారికి అవగాహన కల్పిస్తున్నది ఇతరుల (సామాజిక వర్గాల)కు వ్యతిరేకంగా చర్య తీసుకోవడానికి కాదు. ఏ ఒక్కరూ అలా భావించొద్దు. హిందువులు బలపడితే విధ్వంస కార్యకలాపాలు చేయబోరని మేం పూర్తి విశ్వాసంతో చెబుతున్నాం. మేం మానవత్వం, సమాజం కోసం పని చేస్తాం' అని సురేశ్ భయ్యాజీ చెప్పారు.

## అందుకే నిర్బంధించాం!


**శ్రీనగర్:** ప్రజా భద్రతా చట్టం (పీఎస్‌ఏ) కింద జమ్ముకశ్మీర్ మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ నిర్బంధాన్ని సమర్థిస్తూ పోలీసులు రూపొందించిన వివరణ పత్రంలో పలు కీలక అంశాలు ప్రస్తావించారు. ఒమర్ అబ్దుల్లాకు ప్రజల్లో గణనీయ ప్రభావం చూపగల సామర్థ్యం ఉన్నదన్నారు. మెహబూబా ముఫ్తీ జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, యూఏపీఏ చట్టం కింద నిషేధించిన జమాతే ఇస్లామియా వంటి సంస్థలకు మద్దతు తెలిపారన్నారు. ఉగ్రవాదం బలంగా ఉన్నప్పుడు వేర్పాటువాదులు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చినా భారీగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేసే సామర్థ్యం ఒమర్‌కు ఉన్నదన్నారు. రాజకీయాల ముసుగులో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు ఒమర్, ముఫ్తీని ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్న పోలీసులు అనంతరం ఫిబ్రవరి 6న వారిని పీఎస్‌ఏ కింద నిర్బంధంలో ఉంచారు.

## గతంలో 14 మంది.. ఇప్పుడు ఐదుగురు

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదంవైపు మొగ్గుతున్న యువత సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని అధికారులు తెలిపారు. గతంలో నెలలో సుమారు 14 మంది యువకులు ఉగ్రవాదంవైపు ఆకర్షితులై తుపాకులు చేతపట్టేవారని, గత ఏడాది ఆగస్టు నుంచి ఈ సంఖ్య ఐదుకు పడిపోయినట్లు నిఘా వర్గాల నివేదికలో పేర్కొన్నారు. ఆర్మీ బలగాల చేతుల్లో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు వేల సంఖ్యలో స్థానికులు హాజరయ్యేవారని, ఈ సందర్భంగా యువత ఉగ్రవాదంపట్ల ప్రేరేపితులయ్యేవారని తెలిపారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పదుల సంఖ్యలోనే హాజరవుతున్నారని, రాళ్ల దాడులు కూడా గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో విధించిన ఆంక్షలు, సమాచార వ్యవస్థపై నిఘా వంటి చర్యల వల్ల గణనీయమార్పులు సంభవించినట్లు ఆ నివేదిక పేర్కొంది.

# కరోనాతో ముడిసరుకు కొరత

- ఆందోళనలో ఫార్మా, బల్క్‌డ్రగ్, ఎలక్ట్రానిక్స్
- అందుబాటులో మార్చినాటికి సరిపోయేంత ముడిసరుకు
- సమస్య తీవ్రమయ్యే అవకాశాలున్నాయని అంచనా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కరోనా వైరస్ పారిశ్రామికరంగంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నది. దీని కారణంగా ఫార్మా, బల్క్‌డ్రగ్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు ఆందోళనకు గురవుతున్నాయి. మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా పేరొందిన చైనా నుంచి మన రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు ఎక్కువగా దిగుమతి అవుతుంది. చైనా సరుకు తక్కువ ధరకు లభిస్తుండటంతో అక్కడి నుంచి వచ్చే ముడిసరుకుపైనే చాలా పరిశ్రమలు ఆధారపడి ఉన్నాయి. కరోనా వైరస్ కారణంగా చైనాలో పరిశ్రమలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు అందని పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామికవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మన రాష్ట్రంలోని అధిక సంఖ్యలోని ఫార్మా పరిశ్రమలు ముడిసరుకును చైనా నుంచి దిగుమతి చేసుకొంటున్నాయి. మార్చి నెలాఖరుకు సరిపోయేంత ముడిసరుకును ఇప్పటికే దిగుమతి చేసుకొన్నారు. కరోనా వైరస్ సమస్య మార్చి తర్వాత కూడా కొనసాగినపక్షంలో ముడిసరుకు కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. త్వరలో తమ దేశంలోని పరిశ్రమలు తిరిగి ప్రారంభమవుతాయని చైనా ప్రభుత్వం ప్రకటించింది. కరోనా అదుపులోకి వచ్చి సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఇబ్బందులు తప్పవని ఇక్కడి పారిశ్రామికవర్గాలు భావిస్తున్నాయి. అలాకుదరనిపక్షంలో ముడిసరుకును ఇతర దేశాలనుంచి గానీ, మన దేశంలోగానీ కొనుగోలు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంటుందని ఎఫ్టీసీసీఐ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి చెప్పారు. కరోనా వైరస్ ప్రభావం పరిశ్రమలపై తప్పకుండా ఉంటుందని, మధ్యతరగతి పరిశ్రమలపై ప్రభావం అధికంగా ఉంటుందని సీఐఐ అధ్యక్షుడు రాజు తెలిపారు. ఇతర దేశాల నుంచి దిగుమతులను తగ్గించేందుకు దేశంలో ఫార్మా, బల్క్‌డ్రగ్ ముడిసరుకు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిర్ణయం ఇప్పటికీ కార్యాచరణలోకి రాకపోవడం వల్ల పరిశ్రమలు ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తున్నాయి.

## గ్రామీణ పర్యాటకాన్ని అభివృద్ధిచేయాలి

- హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామీణ ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలను వెలుగులోకి తీసుకొచ్చి అభివృద్ధిచేయాలని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్టు అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ఆదివారం గచ్చిబౌలిలోని నిథంలో 'పర్యాటక రంగం, ఆతిథ్యం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' అనే అంశంపై నిర్వహించిన రెండో అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామీణ పర్యాటకానికి ఎంతో ప్రాధాన్యం ఉన్నదని, సమ్మక్క జాతరకు కోటి మందికి పైగా హాజరవ్వడం గొప్ప విషయమని చెప్పారు. హైదరాబాద్‌లో వీకెండ్ డెస్టినేషన్ కార్యక్రమాలను అందుబాటులోకి తేవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చునన్నారు.

# అలవాట్లలో మార్పులతోనే రోగాలు

- వ్యాధులకు మధుమేహమే మూలం
- డయాబెటిస్‌పై సదస్సులో వైద్యశాఖ మంత్రి ఈటల




డయాబెటిస్ సదస్సులో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీవనశైలి, అలవాట్లలో మార్పుల కారణంగానే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శారీరక శ్రమ కల్పించకపోవడం కూడా అనారోగ్యానికి కారణమవుతున్నదని చెప్పారు. ఫ్రాంటియర్స్ డయాబెటిస్ అవేర్‌నెస్ అండ్ రిసెర్చ్ సొసైటీ (ఎఫ్‌డీఏఆర్‌ఎస్) ఆధ్వర్యంలో సైంటిఫిక్ అప్‌డేట్- 2020 పేరిట ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ వైద్యసదస్సులను హైదరాబాద్‌లో నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. వైద్యులు నిత్యవిద్యార్థులన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని, కొత్తగా ఎదురయ్యే సవాళ్లను తట్టుకొని ముందుకుసాగాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌ను హెల్త్‌హబ్‌గా తీర్చిదిద్దామని, ప్రజలకు ఉపయోగపడే అన్ని పనులను చేపడుతున్నాని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్సీడీ వ్యాధులు పెరుగుతున్నాయని, వీటి నియంత్రణ బాధ్యత వైద్యరంగానిదొక్కటే కాదని, ప్రజలు కూడా వ్యక్తిగత ఆరోగ్య భద్రతను పాటించాలని సూచించారు. సదస్సు ద్వారా వైద్యనిపుణులు షుగర్ వ్యాధి నియంత్రణకు సూచనలు చేయాలని ఈటల కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఏఆర్‌ఎస్ సదస్సు నిర్వహణ కమిటీ ప్రతినిధులు పీసీ రథ్, శైష్ఠ, ఫరాజ్, ఫరిష్ట, వీ శ్రీనివాస్, ప్రతిమరాజ్, వెంకటరామన్, ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, విక్రమ్‌కుమార్, కృష్ణచైతన్య, శబరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.




పారిస్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా అంతర్జాతీయ విత్తన సమాఖ్య అధికారులతో సమావేశమైన తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు

## విత్తన సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- తెలంగాణకు సూచించిన ఐఎస్‌ఎఫ్ సెక్రటరీ జనరల్ మైకేల్ కెల్లర్
- ప్యారిస్‌లో పర్యటిస్తున్న తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆసియా ఖండపు ప్రాంతీయ సీడ్‌హబ్‌గా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో అంతర్జాతీయ విత్తన సమాఖ్య ద్వారా రాబోయే రోజుల్లో విత్తన పరిశ్రమ ఎదుర్కొనే సవాళ్లను, సమస్యలను తెలుపడంలో తెలంగాణ ముందుండాలని అంతర్జాతీయ విత్తన సమాఖ్య (ఐఎస్‌ఎఫ్) సెక్రటరీ జనరల్ మైకేల్ కెల్లర్ సూచించారు. రెండ్రోజుల పారిస్ పర్యటనలో భాగంగా అంతర్జాతీయ ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) విత్తన విభాగం ప్రతినిధి సెబా గాస్పేర్, అంతర్జాతీయ విత్తన సమాఖ్య సెక్రటరీ జనరల్ మైకేల్ కెల్లర్, రోమ్‌లో భారత రాయబారి రినాట్ సంధు, ఎఫ్‌ఏవో ప్రతినిధి డాక్టర్ బీ రాజేందర్‌తో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ, ఇస్టా ఉపాధ్యక్షుడు డాక్టర్ కేశవులు సమావేశమయ్యారు.

# ప్రధాని దృష్టికి అనాథల సమస్యలు

- అంతర్జాతీయ సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్:** అనాథల సమస్యలను మానవతా దృక్పథంతో చూడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. అనాథల సందేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా కృషిచేస్తానని భరోసాఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తట్టిఅన్నారంలో ఫోర్స్ ఫర్ ఆర్ఫన్ రైట్స్ అండ్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ (ఫోర్స్) ఆధ్వర్యంలో అనాథ బిడ్డల హక్కుల సాధన కోసం జరుగుతున్న రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనాథల కోసం కేంద్రప్రభుత్వం తరఫున చట్టం రావాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. అనాథలపై డాక్యుమెంట్ చేసి ఢిల్లీకి వస్తే సంబంధిత మంత్రులతో మాట్లాడి దానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు కృషిచేస్తానని, అవసరమైతే ఫోర్స్ ప్రతినిధులను ప్రధాని మోదీతో కలిపిస్తానని పేర్కొన్నారు. అనంతరం అనాథల బాధలపై రూపొందించిన పాటల సీడీని ఆవిష్కరించారు. సదస్సులో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ వివేక్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ జాతీయ కమిషన్ సభ్యురాలు ప్రజ్ఞాపరాండే, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, విశ్రాంత జడ్జి చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులి పురుగుల నివారణ దినం నేడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సర్వంసిద్ధం చేసింది. చిన్న పిల్లల్లో నులి పురుగుల నివారణే లక్ష్యంగా 1-19 సంవత్సరాల వయసు కలిగిన 1.03 కోట్ల మందికి పంపిణీ చేయనున్నారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కోసం ఇప్పటికే వైద్య శాఖ ముందస్తు శిక్షణ ఇచ్చింది.

## నాకేమీ ఇబ్బందిలేదు

- సస్పెన్షన్‌పై ఐపీఎస్ వెంకటేశ్వర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీనియర్ ఐపీఎస్ అధికారి ఏపీ వెంకటేశ్వర్‌రావు తన సస్పెన్షన్‌పై ఆదివారం స్పందించారు. మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవంలేదని, ఆ వార్తలతో తనకేమీ ఇబ్బంది లేదని ఓ ప్రకటనలో తెలిపారు. సస్పెన్షన్‌పై న్యాయపోరాటానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, వెంకటేశ్వర్‌రావు సస్పెన్షన్‌పై టీడీపీ, వైఎస్సార్సీపీ మధ్య మాటల యుద్ధం మొదలైంది.

## చరిత్ర సృష్టించిన కామ్య

దక్షిణ అమెరికాలో ఎత్తైన శిఖరాన్ని

అధిరోహించిన నేవీ స్కూల్ విద్యార్థిని



**న్యూఢిల్లీ:** ముంబైలోని నౌకాదళానికి చెందిన పిల్లల పాఠశాల విద్యార్థిని కామ్య కార్తికేయన్ చరిత్ర సృష్టించింది. ఏడవ తరగతి చదువుతున్న ఈ బాలిక, దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తైన అకాన్కాగో శిఖరాన్ని ఈనెల ఒకటో తేదీన అధిరోహించిందని, అక్కడ జాతీయ పతాకాన్ని ఎగురవేసిందని నేవీ అధికారులు తెలిపారు. ఆసియా బయట ఎత్తైన ఈ 6962 మీటర్ల పర్వతాన్ని అధిరోహించిన ప్రపంచంలోనే పిన్న బాలికగా కామ్య రికార్డు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఘనత కోసం ఆ విద్యార్థిని కొన్నేండ్లుగా ఎంతో శ్రమించడంతోపాటు ఎన్నో అవరోధాలను అధిగమించినట్లు నౌకాదళ అధికారులు వెల్లడించారు.

## సీఏపీఎఫ్ పోస్టుల భర్తీకి కొత్త పద్ధతి

సివిల్ సర్వీసు పరీక్షల కిందకు తీసుకొచ్చే యోచనలో కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** పారామిలిటరీ దళాల్లో భాగమైన కేంద్ర సాయుధ పోలీసు దళాలు(సీఏపీఎఫ్)లోని పోస్టులకు నిర్వహించే ప్రవేశ స్థాయి పరీక్ష కోసం కొత్త నియామక ప్రక్రియను తీసుకువచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ పోస్టుల కోసం ఏటా నిర్వహిస్తున్న సివిల్ సర్వీసు పరీక్షల్లో దీన్ని కలిపే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఇప్పటివరకూ సీఏపీఎఫ్ పోస్టుల భర్తీ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలను నిర్వహిస్తున్నది. సీఏపీఎఫ్ పోస్టులను ఆర్గనైజ్డ్ గ్రూప్ ఏ సర్వీసు(ఓజీఏఎస్)లో చేరుస్తూ కేంద్రం గతేడాది నిర్ణయం తీసుకున్నది. దీంతో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ తదితర విభాగాలు 'ఓజీఏఎస్' కేటగిరీలో చేరాయి. ఈ క్రమంలో ఆయా పోస్టుల భర్తీ, పదోన్నతులకు ప్రత్యేక నియామక వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో వీటి నియామకాన్ని సివిల్ సర్వీసు గొడుగు కిందకు తీసుకొచ్చే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

## తొలి మూగ, చెవిటి సర్పంచ్!

రికార్డులకెక్కనున్న మధ్యప్రదేశ్‌లోని

ధనసరి గ్రామ నివాసి లాలు

**ఇండోర్, ఫిబ్రవరి 9:** ధనసరి.. మధ్యప్రదేశ్‌లోని వేయి మంది జనాభా ఉన్న ఓ గ్రామం. ఈ గ్రామ సర్పంచ్ పదవిని గిరిజనులకు రిజర్వ్‌చేశారు. అయితే అక్కడ ఉన్నది ఒకే ఒక్క గిరిజన ఓటర్. పంచాయతీ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో.. అంతా సవ్యంగా సాగితే ఆ ఏకైక గిరిజన ఓటర్ ఆగ్రామానికి సర్పంచ్ కానున్నారు. ఇక్కడ మరో విశేషమేంటంటే.. సదరు ఓటర్ మూగ, చెవిటి వ్యక్తి. ఈ ప్రత్యేకతతో కూడిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నిక కావడం దేశంలోనే తొలిసారి కానున్నది. ధనసరి గ్రామంలో పుట్టిపెరిగిన గిరిజనుడు లాలు తల్లిదండ్రులు చిన్ననాటనే కన్నుమూశారు. అయినప్పటికీ గ్రామాన్ని వదలకుండా ఇక్కడే ఉండి వ్యవసాయం చేసుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. త్వరలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ధనసరి గ్రామం పేరు మార్మోగిపోతున్నది. సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవంగా ఎన్నుకొనే అవకాశం ఉన్న లాలూతో.. సామాజిక కార్యకర్త జ్ఞానేంద్ర పురోహిత్ సంజ్ఞలతో మాట్లాడి ఆయన అభిప్రాయాలను మీడియాకు వెల్లడించారు. 'రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేస్తా. సర్పంచ్‌గా ఎన్నికై రైతుల బాగు కోసం పనిచేస్తా. అలాగే గ్రామంలో రోడ్ల రూపురేఖలు మార్చేందుకు కృషిచేస్తా' అని హామీ ఇచ్చారు.



# ఆప్‌లో ఆందోళన

- తుది పోలింగ్ శాతం వెల్లడిలో ఈసీ జాప్యం
- ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు
- ఈసీ తీరుపై కేజ్రీవాల్ గరం
- బీజేపీ ఆమోదం కోసం వేచి చూశారన్న డిప్యూటీ సీఎం సిసోడియా
- ఎట్టకేలకు ఈసీ స్పందన.. 62.59 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడి



ఢిల్లీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూం వద్ద పహారా కాస్తున్న భద్రతా సిబ్బంది

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తుది పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) జాప్యం చేయడంపై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'ఈసీ తీరు ఖచ్చితంగా దిగ్భ్రాంతికరం.. షాకింగ్' అని పేర్కొన్నారు. 70 స్థానాల ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు పూర్తయి ఒకరోజు దాటినా తుది పోలింగ్ శాతాలను ఈసీ ఎందుకు ప్రకటించలేదన్నది ఆశ్చర్యకరమని ఆదివారం ట్వీట్ చేశారు. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం ఈసీ ప్రతిస్పందించింది. 62.59 శాతం నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) రణబీర్ సింగ్ తెలిపారు. అంతకుముందు తుది పోలింగ్ శాతం వెల్లడిపై ట్విట్టర్ వేదికగా కేజ్రీవాల్ స్పందిస్తూ 'పోలింగ్ పూర్తయిన ఒకరోజైనా వారు (ఈసీ) ఎందుకు తుది పోలింగ్ శాతాలను ప్రకటించలేదు?' అని ప్రశ్నించారు. చివరిగా ఈసీ శనివారం రాత్రి పోలింగ్ శాతం 61.46 నమోదైందని ప్రకటించింది. 'బీజేపీ కార్యాలయం నుంచి తుది పోలింగ్ శాతం వివరాలు ఈసీకి అందలేదా?' అని ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ప్రశ్నించారు. అంతకుముందు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ పూర్తయి ఒకరోజైనా తుది పోలింగ్ శాతాన్ని ఈసీ వెలువరించకపోవడంతో తెర వెనుక ఏదో జరుగుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. 'ఒకవేళ ఈవీఎంలలో బీజేపీ ఏదైనా చేస్తుందా? అన్నది అనుమానంగా ఉన్నది. తెర వెనుక రహస్యంగా ఏదో మతలబు జరుగుతున్నది' అని అన్నారు. ఆప్ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాల వల్ల బీజేపీ.. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని సంజయ్‌సింగ్ రెండు వీడియోలతో ట్వీట్లు చేశారు. బాబర్‌పూర్ అసెంబ్లీ స్థాన పరిధిలోని సరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంను రిజర్వు పోలీసు (బలగాల) భద్రత లేకుండానే ఒక అధికారి తీసుకెళుతున్న దృశ్యంతో కూడిన వీడియోను ట్యాగ్ చేశారు. ఇదే స్థానం పరిధిలో మరో కేంద్రంలో ఇలాంటి ఘటనే జరిగిందన్నారు. మరో వీడియోలో బస్సు నుంచి బయటకు తెచ్చిన ఈవీఎంను ఓ వీధిలో మోసుకెళ్తుండటం కనిపిస్తున్నదని, ఇక్కడికి సమీపంలో ఈసీ కేంద్రాలు లేవని, దీనిపై ఈసీ దర్యాప్తు జరుపాలని సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు. ఈవీఎంల వెంట కొందరు అధికారులు చట్ట విరుద్ధంగా వెళుతున్నట్లు సమాచారం ఉందని, దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఢిల్లీలోని 30 స్ట్రాంగ్ రూమ్ కేంద్రాల బయట వలంటీర్ల నిఘా పెడుతామన్నారు.

**ఢిల్లీ ఎన్నికల్లో ఐదు శాతం తగ్గిన పోలింగ్**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 62.59% పోలింగ్ నమోదైందని ఢిల్లీ సీఈఓ రణ్‌బీర్‌సింగ్ మీడియాకు తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఐదు శాతం పోలింగ్ తగ్గిందన్నారు. తుది పోలింగ్ శాతాన్ని వెల్లడించడంలో జాప్యానికి అన్ని స్థానాల్లో పోలింగ్‌పై ఖచ్చితత్వం కోసం ప్రయత్నించడమే కారణమన్నారు.బాలిమరన్ స్థానంలో గరిష్ఠంగా 71.6%, ఢిల్లీ కంటోన్మెంట్‌లో కనిష్ఠంగా 45.4% పోలింగ్ నమోదైందన్నారు. 2015 ఎన్నికల్లో ఢిల్లీలో 67.47% పోలింగ్ జరిగింది.కాగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు విఫలం అవుతాయని బీజేపీ నేత ఒకరు చెప్పారు. గడువు కంటే రెండు గంటలు ఎక్కువగా పోలింగ్ జరిగినప్పుడు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ఎలా నిర్ధారిస్తారని ఆ నేత ప్రశ్నించారు.

# కరంటు తీగల కాటు

బస్సుకు విద్యుత్ వైర్లు తగిలి 10 మంది మృత్యువాత

22 మందికి గాయాలు

నిశ్చితార్థానికి వెళ్తుండగా ఘటన.. ఒడిశాలో విషాదం



ఒడిశాలోని మందరాజాపూర్ సమీపంలో బస్సుకు కరెంట్ తీగలు తగిలిన దృశ్యం..

**బెర్హంపూర్, ఫిబ్రవరి 9:** ఒడిశాలోని గంజాం జిల్లాలో ఆదివారం ఘోర విషాదం చోటుచేసుకున్నది. బస్సుకు విద్యుత్ తీగలు తగులడంతో విద్యుదాఘాతానికి గురై పది మంది మృత్యువాతపడ్డారు. 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఎంకేసీజీ వైద్య కళాశాల, దవాఖాను తరలించారు. 40 మంది ప్రయాణికులతో కూడిన బస్సు జంగల్‌పాడు నుంచి చికరాడాకు వెళ్తుండగా, మందరాజాపూర్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. బస్సులో ఉన్నవారంతా నిశ్చితార్థ వేడుకకు వెళ్తున్నట్లు బెర్హంపూర్ సదర్ సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీవో) జయంత్ కుమార్ తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్‌కు బస్సు లగేజీ క్యారియర్ తగులడంతో బస్సులో మంటలు చెలరేగాయి. దీంతో ప్రాణనష్టం పెరిగింది. ఈ దుర్ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అలాగే గాయపడినవారికి ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు. దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పద్మానంద బెహరా చెప్పారు. ఘటనపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కూడా విచారం వ్యక్తంచేశారు. ఈ విషాదంపై దర్యాప్తు జరిపించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగారు. మంటలను ఆర్పివేసి, బస్సులో ఉన్నవారిని సమీప దవాఖానకు తరలించినట్లు చీఫ్ ఫైర్ ఆఫీసర్ సుకంత్ సేథి తెలిపారు. ఇరుకైన మార్గంలో బస్సు డ్రైవర్ ద్విచక్ర వాహనానికి దారి ఇచ్చే ప్రయత్నంలో బస్సు లగేజి క్యారియర్‌కు విద్యుత్ తీగలు తగులడంతో ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనపై విచారణ ప్రారంభించామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పినాక్ మిశ్రా తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విద్యుత్ సరఫరా సంస్థ 'సౌత్‌కో' విచారణ జరుపుతుందని పేర్కొన్నారు. ఒడిశా విద్యుత్ ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ (ఓపీటీసీఎల్) సీఎండీ సౌరవ్ గార్గ్ మాట్లాడుతూ.. విద్యుత్ లైన్ ఎత్తుతో సహా అన్ని అంశాలపై సమగ్ర నివేదిక అందజేయాలని సౌత్‌కో ఆదేశించినట్లు చెప్పారు.

## పోలీస్ ఇన్‌ఫార్మర్ పేరుతో గ్రామస్థుడి హత్య

ఛత్తీస్‌గఢ్‌లో ఘటన



మావోయిస్టులు హతమార్చిన గ్రామస్థుడు

**కొత్తగూడెం క్రైం/ దంతేవాడ:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లా బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామస్థుడు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ మావోయిస్టులు హతమార్చారు. బార్సూర్‌లోని కొకేర్‌నార్ గ్రామం నుంచి దశరథం అనే వ్యక్తిని శనివారం మావోయిస్టులు అపహరించుకు వెళ్లారు. ఆదివారం ఉదయం మంగనార్ పరిధిలో గుఫా చౌక్‌లో ఆ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న బార్సూర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, అక్కడ మావోయిస్టులు అంటించిన పోస్టర్లను స్వాధీనపరుచుకున్నారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తూ మావోయిస్టుల సమాచారాన్ని చేరవేస్తున్నాడనే కారణంతోనే దశరథాన్ని హత్య చేసినట్లు ఆ పోస్టర్లలో పేర్కొన్నారు.

## చేరిక, నిష్క్రమణలకు బోర్డులు పెట్టలేదు

బీజేపీని వీడుతున్న ముస్లిం నేతలపై కేంద్రమంత్రి నక్వీ వెల్లడి

**ఇండోర్, ఫిబ్రవరి 9:** కేంద్రం ఇటీవల ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు నిరసనగా మధ్యప్రదేశ్‌లోని ముస్లిం నేతలు కొందరు బీజేపీని వీడుతున్నారు. దీనిపై కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ ఆదివారం స్పందిస్తూ చాలా పెద్దదైన తమ పార్టీలో చేరడానికైనా, వెళ్లి పోవడానికైనా.. 'నో ఎగ్జిట్', 'నో ఎంట్రీ' బోర్డులు పెట్టలేదన్నారు. సీఏఏను తప్పుగా అర్థం చేసుకున్నవారు నిష్పక్షపాతంగా ఆలోచించి తమ సందేహాలను తొలిగించుకోవాలన్నారు. సీఏఏ వల్ల భారత్‌లోని ముస్లింలతోపాటు భారతీయులెవ్వరికీ ముప్పు లేదన్నారు. దేశ ప్రయోజనాల రీత్యానే సీఏఏను అమలులోకి తెచ్చామని నక్వీ చెప్పారు. పార్టీలోని ముస్లిం నేతలకు నచ్చచెప్పడంలో బీజేపీ విఫలమైందన్న విమర్శలను నక్వీ నిరాకరించారు.

## రవిదాస్ బోధనలు తక్షణావసరం

- ప్రియాంకాగాంధీ వెల్లడి
- వారణాసి ఆలయంలో పూజలు




రవిదాస్ ఆలయంలో ప్రియాంక పూజలు

**లక్నో:** పద్నాలుగో శతాబ్ది సాధువు, కవి గురు రవిదాస్.. మత, కుల వివక్ష లేని సమాజం కోసం కలలు కన్నారని, దాని సాకారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ కోరారు. రవిదాస్ జయంతి సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. రవిదాస్ బోధనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రామ్, రహీం ఒక్కరేనని రవిదాస్ బోధించారని.. హింస, విద్వేషం నెలకొన్న ప్రస్తుత సమాజంలో ఆయన బోధనలు తక్షణావసరమన్నారు. ఆయన బోధనల నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. సద్గురు రవిదాస్ జన్మస్థలంలో పూజలు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అంతకుముందు ఆమె గురు రవిదాస్ జన్మస్థాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సహపంక్తి భోజనం చేశారు.

**ఉపరాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు**

గురు రవిదాస్ జయంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. గురు రవిదాస్ తన బోధనల ద్వారా ప్రేమ, ఐక్యతాభావాన్ని వ్యాప్తిచేశారని ఉపరాష్ట్రపతి ట్వీట్ చేశారు. సమాజంలో సానుకూల మార్పునకు శాంతి, సామరస్యం, సోదరభావాన్ని ఆయన ప్రబోధించారని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.



భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్, బంగ్లాదేశ్ (ముస్లిం) వలసదారులను వెనక్కి పంపించేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ముంబైలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న నవనిర్మాణ్ సేన కార్యకర్తలు

## ఉద్యోగాల్లో రిజర్వేషన్లు రాష్ట్రాల ఇష్టం

మొదటిపేజీ తరువాయి...


కచ్చితంగా కోటా అమలు చేయాలని ఎక్కడా పొందుపరుచలేదని తెలిపింది. 'ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం కోటా ఇవ్వాలని భావిస్తే.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఆయా వర్గాలకు తగిన ప్రాధాన్యం లేదని నిరూపించే సమాచారం సేకరించాల్సి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**తీర్పును అంగీకరించం**

సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్‌సహా పలు పార్టీలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. తీర్పును తాము అంగీకరించబోమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ స్పష్టంచేశారు. ఆదివారం ఆయన ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీల హక్కులకు ముప్పు పొంచి ఉన్నదని ఆరోపించారు. ఆ పార్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. ఈ అంశంపై పార్లమెంట్ లోపల, బయట పోరాడుతామని చెప్పారు. నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. దేశం మొత్తాన్ని ప్రభావితం చేసే అంశాన్ని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించడం సబబు కాదని, ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం విచారించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రిజర్వేషన్లను హక్కులుగా గుర్తిస్తూ చట్ట సవరణ చేయాలని మోదీ ప్రభుత్వానికి సూచించారు. 'రిజర్వేషన్లకు ముగింపు పలుకాలన్నదే బీజేపీ ఎజెండా. కోటాను ఒకేసారి ఎత్తివేస్తే ప్రజాతిరుగుబాటు వస్తుందని వారికి తెలుసు. అందుకే ఒక్కో అడుగు వేస్తున్నారు' అని ఆరోపించారు. లోక్‌జనశక్తి పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ సైతం సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. రిజర్వేషన్లు యథాతథంగా అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు ఆయన తండ్రి, కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ సోమవారం ఎస్సీ, ఎస్టీ ఎంపీలతో సమావేశమై ఈ విషయంపై చర్చించనున్నారు.

# కొనసాగుతున్న కరోనా విలయం

- 813కు చేరిన మృతుల సంఖ్య.. మరో 37,287 మందికి వైరస్ నిర్ధారణ
- కరోనా వైరస్ విస్తరించే అవకాశమున్న దేశాల్లో భారత్
- వైరస్ వ్యాప్తికి కారణం కానున్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా విమానాశ్రయాలు: జర్మనీ పరిశోధకుల అంచనా
- వ్యాక్సిన్ అభివృద్ధి కోసం పరిశోధనలు ముమ్మరంచేసిన ప్రపంచ దేశాలు
- కరోనాను అడ్డుకోవడంలో చైనాకు పూర్తి సహకారాలు అందిస్తాం: మోదీ



వుహాన్‌లోని ఒక దవాఖానలో చికిత్స పొందుతున్న కరోనా బాధితులు

**న్యూఢిల్లీ/బీజింగ్:** చైనాతోపాటు ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్ ఉద్ధృతి క్రమంగా పెరుగుతున్నది. కరోనా సోకి శనివారం ఒక్కరోజే 91 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చాలామంది వైరస్‌కు కేంద్రమైన హుబెయ్ రాష్ట్రం నుంచే ఉండడం గమనార్హం. దీంతో కరోనా వల్ల ఇప్పటి వరకు మరణించిన వారి సంఖ్య 813కు చేరింది. కొత్తగా మరో 2,656 మందిలో కరోనా వైరస్‌ని గుర్తించడంతో వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య 37,287కి చేరింది. అయితే, హుబెయ్ వెలుపల శనివారంనాటికి వైరస్ బారిన పడ్డ వారి సంఖ్య 509గా ఉన్నదని, గత సోమవారంతో పోలిస్తే(890 మంది) బాధితుల సంఖ్య కొంత మేర తగ్గినట్టు చైనా కేంద్ర ఆరోగ్య కమిషన్ తెలిపింది. దీని నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నది. శనివారం దాదాపు 600 మంది వైరస్ నుంచి విముక్తి పొందినట్టు అధికారులు పేర్కొన్నారు. కాగా 2002-2003 మధ్య ప్రపంచ దేశాల్ని వణికించిన సార్స్ వైరస్ దాదాపు 774 మందిని బలిగొన్న విషయం తెలిసిందే.

**భారత్‌కు కరోనా ముప్పు**

కరోనా వైరస్ విస్తరించే అవకాశం గల దేశాల్లో భారత్ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. కరోనా సోకిన బాధితులు చైనా నుంచి ఇదివరకే వివిధ దేశాలకు చేరుకొని ఉండొచ్చని, ఆ దేశాల జాబితాలో భారత్ 17వ స్థానంలో ఉన్నదని.. జర్మనీలోని హమ్‌బోల్ట్ యూనివర్సిటీ పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా 4 వేల విమానాశ్రయాల మధ్య విమాన రాకపోకల ఆధారంగా ఈ నివేదికను తయారు చేశారు. '2019 నోవెల్ కరోనా వైరస్ గ్లోబల్ రిస్క్ అసెస్‌మెంట్' అనే ఈ నివేదికలో.. వాయు మార్గం ద్వారా భారత్‌కు కరోనా సోకే ప్రమాదం 0.219 శాతంగా ఉన్నట్టు వెల్లడైంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా 0.066% ముప్పు.. ముంబైలోని ఛత్రపతి శివాజీ విమానాశ్రయం ద్వారా ఈ ముప్పు 0.034 శాతంగా ఉన్నది. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎయిర్‌పోర్ట్ నుండి కరోనా ముప్పు 0.020% ఉన్నదని నివేదిక పేర్కొంది. వీటితో పాటు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోచి విమానాశ్రయాల నుంచీ కరోనా ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించింది. కరోనా వెలుగుచూసిన వుహాన్ నగరం.. చైనాలో ఏడో అతిపెద్ద సిటీ. 1.1 కోట్ల జనాభా ఉన్న ఈ నగర విమానాశ్రయానికి చైనాతోపాటు పలు దేశాలతో వైమానిక మార్గాలున్నాయని, కరోనా ఉద్ధృతి పెరుగటంతో గత నెల జనవరి 23న వుహాన్ విమానాశ్రయాన్ని అధికారులు మూసేసే నాటికే చైనాలోని ఇతర రాష్ట్రాలు, పలు దేశాలకు ఈ వైరస్ వ్యాపించి ఉండొచ్చని నివేదిక అంచనా వేసింది.

**పరిశోధనలు ముమ్మరం**

చైనాతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, సింగపూర్, ఫ్రాన్స్ తదితర దేశాల శాస్త్రవేత్తలు కరోనా వైరస్ నియంత్రణకు వ్యాక్సిన్ అభివృద్ధి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొత్త టెక్నాలజీతో దీన్ని తయారు చేయనున్నట్టు వాళ్లు పేర్కొన్నారు. మరో ఆరు నెలల్లో కరోనా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తామని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు.. కనీసం 20 నెలలు పడుతుందని ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

**సహకారాలందిస్తాం**

కరోనా వైరస్‌ను అడ్డుకోవడంలో చైనాకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ క్రమంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆయన ఓ లేఖను రాసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కరోనా మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్టు మోదీ పేర్కొన్నట్టు అధికారులు చెప్పారు. చైనాలోని హుబేయిలో చిక్కుకున్న 650 మంది భారతీయులను భారత్‌కు తేవడంలో సహకరించినందుకు జిన్‌పింగ్‌కు మోదీ ధన్యవాదాలు తెలిపినట్టు పేర్కొన్నారు.

### 'ఎయిర్ షో'పై కరోనా దెబ్బ

ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శనకు కరోనా వైరస్ చిక్కులు తెచ్చిపెట్టింది. సింగపూర్ వేదికగా వచ్చే మంగళవారం ప్రారంభం కానున్న ఈ ఎయిర్ షోలో పాల్గొనేందుకు దాదాపు 70 ప్రదర్శన సంస్థలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి. వీటిలో అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు చైనాకు చెందిన డజను కంపెనీలు కూడా ఉన్నాయి. కరోనా వైరస్ తీవ్రతరం కావడమే సదరు సంస్థలు వెనుకంజ వేయడానికి ప్రధాన కారణమని ఎయిర్ షో నిర్వాహకులు పేర్కొన్నారు. మరోవైపు, కరోనా వైరస్ సోకిన కొందరు ఓడలో ప్రయాణిస్తున్నారన్న కారణంతో గత ఐదురోజులుగా హాంకాంగ్ తీరంలో నిలిచిపోయిన 'వరల్డ్ డ్రీమ్' నౌకను అధికారులు ఆదివారం విడుదల చేశారు. ఓడలోని 1,800 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. వైరస్ లేదని తేలడంతో ప్రయాణికులను విడుదల చేశారు.

## జమ్ముకశ్మీర్‌లో పాక్ కాల్పులు

దీటుగా బదులిస్తున్న భారత్

**జమ్ము, ఫిబ్రవరి 9:** పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్ సరిహద్దులోని నియంత్రణ రేఖ వెంబడి పూంచ్ జిల్లాలో గత రెండు రోజులుగా కాల్పులు, మోర్టార్ బాంబు దాడులకు పాల్పడుతున్నది. పాక్ కాల్పులను దీటుగా తిప్పికొడుతున్నామని, ఆదివారం ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని భారత ఆర్మీ అధికారి తెలిపారు. కాగా, శనివారం డిగ్వార్ సెక్టార్‌లో జరిగిన భారీ కాల్పుల్లో జవాన్ నాయక్ రాజీవ్ సింగ్ మరణించగా మరో ముగ్గురు గాయపడినట్లు పేర్కొన్నారు. అమరుడైన జవాన్‌కు సైనిక లాంఛనాలతో నివాళి అర్పించి, మృతదేహాన్ని సొంత రాష్ట్రమైన రాజస్థాన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

## క్రాష్ ల్యాండ్ అయిన రష్యా విమానం

తృటిలో తప్పిన పెను ప్రమాదం

**మాస్కో, ఫిబ్రవరి 9:** వంద మంది ప్రయాణికులు, సిబ్బందితో ప్రయాణిస్తున్న బోయింగ్ సంస్థకు చెందిన ఓ విమానానికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. వాతావరణం అనుకూలించకపోవడం, ల్యాండింగ్ గేర్‌లో సమస్య తలెత్తడంతో విమానం క్రాష్ ల్యాండ్ అయింది. రష్యాకు ఉత్తరంగా ఉన్న కోమి ప్రాంతంలో ఆదివారం ఈ ఘటన జరిగినట్టు బోయింగ్ సంస్థ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని.. పైలట్, విమాన సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు పేర్కొన్నారు. విమానం ల్యాండ్ అయిన దృశ్యాలు, వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి.

## ఆఫ్ఘన్ సైనికుడి కాల్పులు

ఇద్దరు అమెరికా సైనికులు మృతి

**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్ సైనికుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు అమెరికన్ సైనికులు గాయపడిన ఘటన శనివారం నంగర్హార్ రాష్ట్ర పరిధిలో జరిగింది. అమెరికా సైన్యం ఆదివారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఇరు దేశాల సైనిక కమాండర్లు 'కీ-లీడర్ ఎంగేజ్‌మెంట్' చర్చల్లో ఉండగా ఈ ఘటన చోటు చేసుకున్నది. మెషీన్‌గన్‌తో ఒక ఆఫ్ఘన్ సైనికుడు అమెరికా-ఆఫ్ఘన్ సంయుక్త సైనిక పటాలంపై కాల్పులు జరిపాడని అమెరికా- ఆఫ్ఘన్ సైనిక బలగాల అధికార ప్రతినిధి సొన్నీ లెగ్గెట్ ఓ ప్రకటనలో తెలిపారు.

# ఉన్మాద జవాన్ హతం

- ఎన్‌కౌంటర్‌లో కాల్చిచంపిన థాయ్‌లాండ్ ఆర్మీ
- 30కి చేరిన మృతుల సంఖ్య
- శనివారం నరమేధం సృష్టించిన జక్రపంత్ థొమ్మా
- ప్రార్థనలతో మృతులకు నివాళి అర్పించిన జనం



మృతులకు నివాళిగా బ్యాంకాక్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్‌లో శనివారం నరమేధం సృష్టించి 30 మందిని పొట్టనపెట్టుకున్న ఉన్మాద జవాన్‌ను ఆ దేశ ఆర్మీ హతమార్చింది. నాఖోన్ రాట్చసీమ నగరంలోని షాపింగ్‌మాల్‌లో జనంపై కాల్పులు జరిపి బీభత్సం సృష్టించిన సార్జెంట్ మేజర్ జక్రపంత్ థొమ్మాను కమాండోలు ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టారు. ఈ ఘటనతో 17 గంటలపాటు అక్కడ భీతావాహ పరిస్థితి నెలకొన్నది. సీనియర్ అధికారి ఇంట్లో పని చేస్తున్న జూనియర్ సైనికుడు జక్రపంత్ శనివారం మధ్యాహ్నం తొలుత జరిపిన కాల్పుల్లో ఒక సైనికుడు, మరో ఇద్దరు మరణించారు. తర్వాత ఆయుధాగారంలోకెళ్లి ఎమ్ 60 మెషిన్‌గన్‌తోపాటు కొన్ని ఆయుధాలతోపాటు దొంగిలించిన వాహనంతో సెంటర్‌లోని టెర్మినల్ 21 షాపింగ్‌మాల్ వద్దకెళ్లాడు. వారాంతం కావడంతో అక్కడ పెద్ద సంఖ్యలో ఉన్న జనంపై మెషిన్‌గన్‌తో విచక్షణా రహితంగా జరిపిన కాల్పు ల్లో 13 ఏండ్ల బాలుడు సహా 25 మందికిపైగా చనిపోగా పలువురు గాయపడ్డారు. కాల్పుల వల్ల భయాందోళనతో సందర్శకులు, షాపింగ్‌కొచ్చినవారు తలోదిక్కున దాక్కుని, 6 గంటలకుపైగా బిక్కుబిక్కుమంటూ గడిపారు. కాగా, కాల్పులతో నరమేధానికి పాల్పడిన జక్రపంత్ ఆ ఫొటోలు, వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి పైశాచికానందం పొందాడు. తర్వాత అతడి ఖాతాను ఫేస్‌బుక్ తొలిగించింది. మరోవైపు అక్కడికి చేరుకున్న ఆర్మీ కమాండోలు, ప్రత్యేక పోలీసు దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, షాపింగ్‌మాల్‌లో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు పంపాయి. ఆదివారం ఉదయం జక్రపంత్‌ను కాల్చి చంపారు. ఇలాంటి ఘటన ఎప్పుడూ జరుగలేదని థాయ్‌లాండ్ ప్రధాని ప్రయూత్ చాన్ ఓచా తెలిపారు. వ్యక్తిగత కారణాలవల్లే ఆ జవాన్ ఇలా ప్రవర్తించాడని అనుమానం వ్యక్తం చేశారు. ఈ నరమేధం నుంచి తేరుకున్న నగర ప్రజలు ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీలు, ప్రార్థనలు, జాగరణలతో మృతులకు నివాళి అర్పించారు.

# చెలిమె

కరీంనగర్ **6** నమస్తే తెలంగాణ
సోమవారం 10 ఫిబ్రవరి 2020


## దేశదిమ్మరి

**అతనికీ మనకూ తేడా వుంది**
మనం ఏమనుకున్నా
మనది నిర్మిత ప్రపంచం.
మన విలువలన్నీ
దీని పాదులోంచే మొలకెత్తాయి.

ఊరు మన కేంద్ర బిందువు
మన దూరాలన్నీ
ఇంటి దగ్గరి నుంచే.
గోడలుంటాయి కాబట్టి
మన ఇల్లు చిన్నది,

అతని లోకం అట్లా కాదు
దానికి అవధులుండవు
అది బహు విశాలం, విస్తృతం
అతని సంచార చక్రాల్లోంచి
మరిన్ని భ్రమణాసక్తులు పుట్టుకొస్తాయి.

అతని చూపుల్లో
కట్టడాలు కరిగిపోతాయి
కలతలుండొచ్చు

కొలతలకు లొంగడు.

అతని కదిలే నేలకు
నాలుగు కాళ్ళు మొలుస్తాయి
చేతుల సంఖ్య ఇంకా పెరగొచ్చు.

నేలా గాలీ నీరూ
మన ఆక్రమణలకు గురవుతాయి
భౌగోళిక ఖండాలూ

అగాథ సముద్రాలూ అన్నీ అతనివే.

సాహసాలు
హమారే బస్ కీ బాత్ నహీ
కోల్పోతామనే భయం మనది.

మరణించటానికి
తోడు అవసరం మనకు
అతనికి ఎవరూ తోడు రారు
మనది ఒకటే దారి
అతడు స్వేచ్ఛా విహారి.

**– డాక్టర్ ఎన్.గోపి**

# మన సామెతలు

'A proverb is a short, generally known sente -nce of the folk which contains wisdom, truth, morals and traditional views'

–Wolfgand Mieder

సామెతలు ప్రసంగానికి దీపాల్లాంటివి. సామెతలను సందర్భోచితంగా వాడితే అవి సంభాషణను కాంతివంతం చేస్తాయి. 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అనే వాక్యానికి అక్షర నిదర్శనం సామెతలు. సామెతల అధ్యయనాన్ని 'Paremiology' అంటారు. సామెతల సేకరణను 'Paremiography' అంటారు. **'జానపద విజ్ఞానంలోని అన్ని అంశాలలాగే సామెతలు కూడా సాంప్రదాయకమైనవి. వాటి ప్రత్యేకత వివేకవంతమైనవి కావడం, సంక్షిప్తంగా ఉండటం.'**(డాక్టర్ సుందరం, ఆర్వీయస్ 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' పుట.172) 'సామెత' అనే మాట 'సామ్యత' నుంచి వచ్చిందని పరిశోధకులు చెప్తారు. అందుకే చాలా సామెతల్లో ఒక వస్తువును మరో వస్తువుతో పోల్చి చెప్పడం కనిపిస్తుంది. సామెతలు సాధారణంగా ఒక వాక్యంలోనే ఉంటాయి. తక్కువ సందర్భాల్లో మాత్రమే రెండు లేదా మూడు వాక్యాలకు విస్తరిస్తాయి. సామెతలు సరళమైన భాషలో, ప్రజాబాహుళ్యంలో ఎక్కువ ప్రచారంలో ఉంటాయి. సామెతలను ఛందో దృష్టితో చూస్తే అనేక పద్య లక్షణాలు కూడా కనిపిస్తాయని వ్యాకరణకారులు, ఛందోవేత్తలు గుర్తించిందే. 'పదునైన భావాల్ని పదునైన మాటల్లో చెప్పడం సామెత లక్షణం. చెప్పే విషయాన్ని సాధ్యమైనంత సూటిగా చెప్తాయవి. మానవుని దీర్ఘానుభవం ఆధారంగా రూపుదాల్చిన సంక్షిప్త వాక్యాలు కావడం చేత సామెతలకు ఈ తీక్షణత లభ్యమైందని చెప్పవచ్చు.'(పై పుస్తకమే). అంతేగాక సామెతలు 'తరతరాలు తరచి చూసిన జీవితాలు, వడబోసిన అనుభవాలు రాబోయే తరాలకు పరంపరగా అందించే వారసత్వ మౌఖిక విజ్ఞానం సామెతలు. మనుషులెన్ని తీర్లో, భావనలెన్ని తీర్లో సామెతలన్ని తీర్లు. సన్నివేశానికి, సందర్భానికి తగినట్లు అర్థవంతంగా ఒదిగే గొప్ప సామెతలెన్నో (సిధారెడ్డి నందిని, 'తెలంగాణ సామెతలు' గ్రంథానికి రాసిన ముందు మాట).

సామెతలు ఎప్పుడు పుట్టాయంటే.. మానవుల అనుభవసారాన్ని ప్రతి సామెత గర్భీకరించుకుంటుందని చెప్పవచ్చు. సామెతలు ఏ ప్రాంతంలో పుట్టాయి? ఏ కాలంలో పుట్టాయో అందులో ఉన్న ఒక పదాన్ని ఆధారంగా చేసుకొని అంచనా వేయవచ్చు. వేదకాలం నుంచి ఈనాటి ఆధునిక గ్రంథాల దాకా సామెతలు అనేక గ్రంథాల్లో నిక్షిప్తం చేయబడి ఉన్నాయి.

సామెతల్ని కూడా స్థూలంగా రెండువిధాలుగా విభజిస్తారు. 1. అకారాదిగా 2. వస్తుపరంగా. వస్తువును బట్టి సామెతలను అధ్యయనం చేయడమే సమంజసమైందని చాలామంది పరిశోధకులు చెప్పారు.

**'తల్లిని బట్టి బిడ్డ నూలును బట్టి బట్ట'**
**'తడి గుడ్డతో గొంతు కోసినట్లు'**
**'తనదాకా వస్తే కాని తెలియదు'**
**'తమ్ముడు తనవాడైనా ధర్మం సరిగా చెప్పాలి'**
**'తవ్వికొద్దీ పెంకాసులెల్లినట్టు'**

జానపదుల జీవితం నిండా పేదరికమే పరుచుకొని ఉంటుంది. అలాగని వాళ్లు ఎప్పుడూ తాము పేదలమని, పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని బాధ పడరు. జీవితం ఎట్లా పలకరిస్తే అట్లానే దాన్ని అనుభవించి ఉన్నంతలో జీవితాన్ని ఆనందమయం చేసుకుంటారు. ఆ జీవితానుభవం నుంచే అనేక సామెతల్ని ఆయా సందర్భాలకు అనుగుణంగా సృష్టించుకొని వ్యవహారాన్ని మరింత సునాయాస పరుచుకుంటారు. ఇలా కొనసాగుతున్న జీవితం నుంచి అనేక సామెతలు పుడతాయి.

**'అగ్గువ అమ్మనియ్యది ఫిరం కొననియ్యది'**
**'ఉంటే అమీర్‌సాబ్ లేకుంటే ఫకీర్‌సాబ్'**
**'ఉంటే ఉగాది లేకుంటే శివరాత్రి'**
**'ఉన్ననాడు ఉట్ల పండుగ లేని నాడు లొట్ల పండుగ'**

వంటి వారికి పల్లీయులు తమదైన శైలిలో చురకలు అంటిస్తుంటారు. ఈ సందర్భంలో అనే సామెతలు పుట్టి పిసినారుల కొంచెపుతనాన్ని పట్టి చూపుతాయి.

**'అడిగినట్టిస్తే కడిగినట్టు పోతది'**
**'ఎంగిలి చేతితోని కాకిని కొట్టనోడు బిచ్చం బెట్టడా!'**
**' ఆటా పాటా మాయింట మాపటి భోజనం మీయింట'**

నిజానికి ఆశే మనిషికి శ్వాస. అయితే అది తక్కువైతే నిరాశ. ఎక్కువైతే దురాశ. జానపదులు ఇలాంటి సందర్భాల్లో చాలా అర్థవంతమైన సామెతలను పుట్టించి తమ అనుభవసారాన్ని చెప్తారు.

**'అడ్డెడు వడ్ల ఆశకు పోతే తూమెడు వడ్లు దుడ్డె బుక్కిపోయిందట'**
**'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయిందట'**

పడుతావు. జర నిమ్మళంగా ఉండుమని చెబుతారు. తొందరపాటును జానపదులు గమ్మత్తయిన సామెతల్లో పొదుగుతారు.

**'అగడుబడ్డమ్మ మొగన్ని మింగిందట'**
**'అయ్యేదాక ఉండి ఆరే దాక ఆగనట్టు'**

జానపదుల్లో అత్త చుట్టు, అల్లుని చుట్టు, కోడలు చుట్టు అనేక సామెతలు పుట్టాయి. ఇలా పుట్టిన సామెతల్లో ఎంతో జీవితానుభవం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఈ సామెతల నిండా సున్నితమైన హాస్యంతో పాటు, ఒక కనిపించని హింస, నొప్పి కూడా నర్మగర్భంగా ఉంటుంది.

**'అత్తగారింట్ల సుఖం మోచేతి మీది దెబ్బ'**
**'అత్తగారింట్ల అల్లున్ని జూడాలె, అనుపచేనుల ఆంబోతును జూడాలె'**
**'కోడలుకు బుద్ధి చెప్పి అత్త తెడ్డునాకినట్లు'**


**జానపదుల జీవితం నిండా పేదరికమే పరుచుకొని ఉంటుంది. అలాగని వాళ్లు ఎప్పుడూ తాము పేదలమని, పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని బాధపడరు. జీవితం ఎట్లా పలకరిస్తే అట్లానే దాన్ని అనుభవించి ఉన్నంతలో జీవితాన్ని ఆనందమయం చేసుకుంటారు. ఆ జీవితానుభవం నుంచే అనేక సామెత ల్ని ఆయా సందర్భాలకు అనుగుణంగా సృష్టించుకొని వ్యవహారాన్ని మరింత సునాయాసపరుచుకుంటారు. ఇలా కొనసాగుతున్న జీవితం నుంచి అనేక సామెతలు పుడతాయి.**


పల్లీయులు తమకు ఏ ఆపద వచ్చినా,ఏ నష్టం వచ్చినా దాన్ని తమ అదృష్టమే ఇలా ఉందని భావిస్తారు. ఈ జీవితం ఇంతేనని సరిపుచ్చుకొని లేని దానికోసం పాకులాడరు.దక్కేది దక్కక మానదు. దక్కనిది తమ దరికే రాదనే ఒక నిర్లిప్తతత ఉంటుంది. ఆ మానసిక సంచలనం నుంచి అనేక సామెతలు పుడతాయి. అవి సంభాషణను ఇంకొంత పదునుదేరేలా నడిపిస్తాయి.

**'అచ్చిరాని కాలానికి అడుక్కతినబోతే చేతిలున్న చిప్పపోయిందట'**
**'అధమునికి ఆలయ్యేకంటే బలవంతునికి బానిసయింది మేలు'**
**'ఉప్పోడు చెడె, పప్పోడు చెడె, తమలపాకోడు తమాం చెడె'**
**'ఊహలు ఊళ్లేలుతుంటే కర్మ కట్టెలు మోసిందట'**

జానపదులు సాధారణంగా దానశీలురు. ఆత్మగల్ల మనుషులు. సాటి మనిషికి సాయం చేసే మనస్తత్వం గలవారు అయితే అందరు అలాగే ఉండరు కదా! కొందరు పిసినారితనాన్ని ప్రదర్శించి ఏమో సంపాదించాలని తాపత్రయపడుతుంటారు. అటు

జానపదులు ఊహల్లో కాకుండా వాస్తవంలో జీవించడానికే ఇష్టపడుతుంటారు. దీనికి భిన్నంగా ఏ వ్యక్తి అయినా జీవించడానికి ప్రయత్నించి బొక్కబోర్లా పడ్డప్పుడు సామెతల్ని సృష్టించి జీవితాన్ని వ్యాఖ్యానిస్తుంటారు.

**'మింగ మెతుకు లేదుగాని మీసాలకు సంపెంగ నూనె'**
**'అవ్వకు కూడు పెట్టనోడు పెద్దమ్మకు కోకపెడ్తానన్నడట'**
**'ఏమిలేనోనికి ఏతులెక్కువ'**
**'కూటికి లేకున్నా కాటుక మానది'**

జానపదులు పల్లెల్లో కులాలకు, మతాలకు అతీతంగా, స్థిర, చర ఆస్తులకు అతీతంగా అందరూ వావివరుసలు పెట్టుకొని జీవిస్తుంటారు. దీని ఆధారంగా అనేక సామెతలు పుట్టాయి.

**'అక్క చుట్టం అయితే లెక్క చుట్టమా?'**
**'అక్కకుంటే అడుగరాదు చెల్లెకుంటే చేతికి రాదు'**

పల్లీయులు అతి తొందరను సహించరు. ఎందుకంత తొందర

జానపదులు శృంగార రసానికి చాలా ప్రాధాన్యం ఇస్తారు. అన్ని రసాలు శృంగార రసంలోనే మిళితమవుతాయి.

**'అయ్యగారి ప్రతాపం అంతా కంచం మీదేగానీ మంచం మీద లేదట'**
**'అర్జీలకు పనులు కావు ఆశీర్వచనాలకు బిడ్డలు పుట్టరు'**
**'ఉద్దెరైతే నాకిద్దరు అన్నడట'**

పల్లీయుల జీవితం సాంతం వ్యవసాయం చుట్టే తిరుగుతుంది. కాబట్టి వాళ్ల సామెతల్లో అనివార్యంగా ఈ వ్యవసాయం తొంగిచూస్తుంటుంది.

**'ఉత్తరం దిక్కు మబ్బుకమ్మితే ఉత్తగపోదు'**
**'ఉత్తరలో చల్లిన నారు కత్తెరలో నరికిన కొయ్య'**

రోజంతా శారీరక శ్రమ చేసి ఆ శ్రమను మర్చిపోవడానికి పల్లీయులు 'కల్లు'ను ఆశ్రయిస్తారు. తాగినప్పుడు బయటపడే నిజాల్లో సామెతలు కూడా ఉంటాయి. ఎక్కువ శాతం ఈ సామెతలు 'మందు' చుట్టే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో తాగినప్పటి మనిషి ప్రవర్తనపైనా, అతని మానసిక స్థితిపైనా ఉంటాయి.

**'ఈదుల్లకు బోయినోడు ఇల్లుకాలినా రాడు'**
**'తాళ్లల్లకు పోయినోడు తండ్రి చచ్చినా రాడు'**

పల్లీయులకున్నంత తాత్వికత మరొకరికి ఉండదు. వారికున్న జీవితపు లోతు తాత్విక సామెతల్లో ప్రస్ఫుటంగా ప్రకటితమవుతుంది.

**'ఇయ్యాల ఇంట్ల రేపు మంట్లె'**
**'ఎవరి వీపు వాళ్లకు కనబడది'**

జానపదులు మోసాన్ని సహించరు. మోసపుటాలోచనలను, తద్వారా జరిగే నష్టాన్ని పూసగుచ్చినట్టు సామెతల్లో చెప్పి అందరినీ మేల్కొల్పుతారు, హెచ్చరిస్తారు.

**'ఈతాకు ఇచ్చి తాటాకు దొబ్బుడు'**
**'ఇత్తేసి పొత్తుగూడుడు'**
**'ఇసంత రమ్మంటే ఇల్లంతా నాదన్నట్లు'**

పనితనానికి, సామర్థ్యానికి జానపదులు విలువిస్తారు. జీవితాన్ని ఎలా జయించాలో చెప్తూనే, పశువులాగా శరీరంతో పని చేయకుండా, మెదడుతో పనిచేసి సుఖజీవనం చేయాలని ఈ సామెతలు విడమర్చి చెబుతాయి.

**'ఉపాయమున్నోడు ఉపాసముండడు'**

అమాయకత్వాన్ని, అతితెలివిని పల్లీయులు సామెతల్లో పొదిగి ఎంత జాగరూకతతో ఉండాలో చెప్తారు.

**'ఉత్తకుండ ఉట్టిమీద పెట్టి, నేతికుండ నేల మీద పెట్టినట్టు'**
**'ఉయ్యాలలో బిడ్డను పెట్టుకొని ఊరంతా లెంకినట్టు'**
**'కట్టేసిన బర్రెకు కావలిగాసినట్టు'**

జానపదుల జీవితాల్లో దుఃఖానికి ఎంత ప్రాధాన్యం ఉందో హాస్యానికి కూడా అంతే ప్రాధాన్యం ఉంది.

**'ఉత్తగుండి నా చేతులేంజేత్తయని దండం బెట్టిన అన్నడట'**

జానపదులు జీవితంలో చాలా వాస్తవికంగా, నిజాయితీగా, నిక్కచ్చిగా ఉంటారు. అందుకే సాధ్యమైనంత సూటిగా మాట్లాడుతారు. ఈ వాస్తవికతతో మాట్లాడి కొన్నిసార్లు అనేక సమస్యలను కొని తెచ్చుకుంటారు కూడా.

**'ఉన్నమాటంటే ఉలుకెక్కువ'**
**'ఎంటికలున్న కొప్పు ఎటువెట్టినా సక్కదనమే'**

జీవితం ఎన్ని కోణాల్లో దర్శనమిస్తుందో సామెతలు కూడా అన్ని రకాలున్నాయి. జీవితాన్ని మదురంగా మలిచాయి. సామెతలు తెలుగువారి మౌఖిక సంపద.

జానపద కళలను, పాటలను, సామెతలను, పలుకుబడులను, నానుడులను, పదబంధాలను, పొడుపు కథలను మనం ఇంకా సేకరించాల్సినంత స్థాయిలో సేకరించలేకపోయాం. వాటిని భద్రపర్చాల్సినంత భద్రపర్చలేకపోయాం. సామెత సేకరణ, భద్రతలో, ఇంకా మిగిలిన విభాగాల్లోని జానపద సాహిత్యాన్ని సేకరించి భవిష్యత్ తరాలకు అందించాల్సి బృహత్తర బాధ్యత మనపై ఉంది.

**– డాక్టర్ వెల్దండి శ్రీధర్, 98669 77741**

## మూడు చింతల కింద

**ఇంట్లో గాకుండా ఇంకెక్కడైనా వెలిగించగలవేమో చూడు దీపాన్ని?**
నీ ఒంట్లో కాకుండా మరెక్కడైనా దిద్దగలవేమో చూడు దేహాన్ని?
లోకమే ఒక్కతీరుగ లేదు ఎట్లుంటావు నువ్వు ఒకే కేంద్రంగా
ఎవడు తెలుసుకుంటాడిప్పుడు అప్పటికప్పుడు తిరస్కరించడం కూడా ప్రేమే అని?
ముఖ విలువకు స్థాన విలువకు మధ్య నిలబడతావు నువ్వు
నిర్ణయిస్తుంది అన్నివేళల్లో నిన్ను నీ పని

**ఒకటవ చింత**
చిటికెన వేలు పట్టుకొని ఈ నేల మీద
అతనితో సమానంగా నడవాలనుకున్నది ఆమె
నడవనీయలేదు వాడు
ఆకాశం వైపు ఎగిరింది ఆమె రెక్కలు తొడుక్కొని
నువ్వు పైటను తగలేశావు గాని తల్లీ
వాడు నిన్నే కాల్చేస్తున్నాడు ఏకంగా!

**రెండవ చింత**
వాళ్ళు ఈ భూగోళాన్ని శుభ్రమయం చేసి
భుజానికెత్తుకొని నడిచిన వాళ్ళు
వాళ్ళ చెమట చమురు దీపాల వెలుగులో బతికినవాళ్ళే
వాళ్ళను చీకటి గుహల్లో బంధించి చంపుతున్నారు

దేవత లెక్క జూసుకుంటడని
యువరాణి తోటమాలిని ప్రేమించింది
మేడ దిగివచ్చి ముద్దాడిన రాకుమారి పేద ప్రియుడు
తెల్లారేసరికి ఉరితీయబడ్డాడు
ఒక్కసారిగా కులం డొక్కలో కుమ్మింది
బంగ్లా మీంచి చూసిన రామచిలుక పంజరంలో బందీ అయింది
మధుకరమైన ప్రణయాలన్నీ మాడి మసైపోయినయ్
కులాన్ని వెలేద్దామనుకున్నావు తమ్ముడా!
వాడు వెలివాడల్ని దహనం చేస్తున్నాడు

**మూడవ చింత**
బిగ్గరగా ప్రార్థించారు వాళ్ళు ఆకాశం వైపు చూస్తూ
విగ్రహాలు కదలవని కష్టాలను చూడవని
విభజన రేఖలు గీస్తున్నాయి వికృతంగా మారిన విశ్వాసాలు
సంఘర్షించుకుంటున్నాయి స్వరూపాలు స్వభావాలు
గుంపులో కలుద్దామనుకున్నావు భయ్యా!
తెలతెల్లని పావురాలను తరిమితరిమి చంపుతున్నాయి డేగలు

ఇరువై నాలుగు గంటలు ఉంటావా ఇంట్లోనే రా! వాడల్లోకి
ఎంతసేపుంటావు వాడలో రా! ఊళ్ళోకి!
ఎన్నిరోజులుంటావు ఊళ్ళో నగరానికి రా
ఎన్నేండ్లు నగరంలో చుట్టుముట్టు దేశాన్ని!
ప్రపంచ మానవుడివై లే! విశ్వవీధుల్లోకి నడు నడు
అస్తిత్వమంటే అస్థికలు కాదు మెడలో వేసుకొని తిరగడానికి!
ఆవేశం కూడా కాదు అగ్నివంటి ఆలోచన
ఆత్మగౌరవం సరే ఆత్మవిమర్శ కూడా!
వసంత మేఘాలు గర్జిస్తూనే వుంటాయి వర్షాలు కురిసేదాకా!
ఊరవతల శ్మశానంలో ఒక శవం నేను స్త్రీగానే మరణించానంది
మరొక శవం నేను కులంతోనే హత్యచేయబడ్డానంది
ఇంకో శవం నేను కాందిశీకునిగానే కాలగర్భంలో కలిసిపోయానంది

ఎవరూ మనిషిగా చావలేదని
శవంతో సహా చెట్టుమీదికెక్కిండు బేతాళుడు

**– డాక్టర్ తైదల అంజయ్య**

# చారిత్రక విజ్ఞాన సారస్వం

చరిత్రంతా ఉత్పత్తి కులాలదే. నాగరికతలన్నీ ఉత్పత్తిశక్తుల చేతుల నుంచే పుట్టుకొచ్చాయి. ఉత్పత్తి మూలాల్ని తెలుసుకోలేనివారు సామాజిక మూలాలను కూడా ఎప్పటికీ తెలుసుకోలేరు. కాలం నిత్యం మారుతూ తనకు తాను కావాల్సినవి సృష్టించుకుంటూ నవనాగరికతలను నిర్మించుకుంటూ ముందుకు సాగుతూ ఉంటుంది. కాలాలు మారినా సామాజిక మార్పులు ఎన్ని వచ్చినా మూల పునాదులు లేకుండా వర్తమానం బండి నడవదు. భవిష్యత్తు కూడా తన రూపురేఖల్ని గీసుకోవాల్సి నవచ్చినప్పుడు మళ్లీ మూలాల్లోకి మూలవాసుల చరిత్ర పాదాల దగ్గరకు పోవాల్సిందే.

చరిత్రలో కొన్నివర్గాలు అణగదొక్కబడ్డాయి. ఆ అణగదొక్కబడిన వర్గాల వీపుల మీద ఆధిపత్య సాహిత్యం, ఆధిపత్య చరిత్ర నిలబడింది. మూలాలను తడుముకుంటూ తమ అస్తిత్వంకోసం తాము పాకులాడు సందర్భాలలోనే అస్తిత్వ ఉద్యమాలు ఎగిసిపడ్డాయి. ఈ నేపథ్యం నుంచే తన చరిత్రను తాను రాసుకునే క్రమంలో పాతచరిత్ర తోలుతీసి తమ అసలు చరిత్రను **'చర్మపద కోశం'** అన్న తోలు సంబంధ పదాల నిఘంటువు వచ్చింది. ఈ 'చర్మపదకోశం' తయారుచేయడానికి ఆర్.ఎల్. ప్రసాదు అనే సామాజిక కార్యకర్త చేసిన కృషి మరిచిపోలేనిది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత వస్తున్న అనేక అస్తిత్వ సాహిత్య గ్రంథాల్లో ఆర్.ఎల్. ప్రసాదు గ్రంథం ఆణిముత్యం. చరిత్రలో ఇనుపయుగం, రాగియుగం, పాతరాతియుగం, కొత్తరాతియుగం అంటూ విభజన చేసి పెట్టారు. కానీ ఈ చర్మ పదకోశం గ్రంథం చూస్తుంటే చరిత్ర చర్మ సంస్కృతిని, చర్మకారుల జీవితాలను, చర్మంలో నవ కానికి వేసిన పునాదులన్నీ కండ్ల ముందుంటాయి. తెలంగాణ సమాజానికే కాదు మొత్తం తెలుగు సమాజానికి ప్రసాదు అందించిన తోలుదస్త్రం చర్మపదకోశం అమూల్యమైనది.


ఈ గ్రంథంలో నాగరికతలో తోలు పాత్ర అన్న అధ్యాయాన్ని చూస్తే మొత్తం దేశదేశాల్లో ఈ తోలు ఉత్పత్తుల ద్వారా దేశదేశాల రథచక్రాలు ఎలా కదిలాయో తెలుస్తుంది. ఈనాటి కిన్‌లే బాటిల్‌కు పునాది తోలు తిత్తి. ఈ తోలుతిత్తిద్వారా నీటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తీసుకపోయేవారు. ఇప్పటికీ సమాజంలో ఆరోగ్యకరంగా నీళ్లు తాగడానికి తోలుతిత్తిలోని నీళ్లే శ్రేష్టమైనవి. మానవునికి తొలి నైపుణ్యత గల పని ఉందంటే అది జంతువు పొట్టచీరి తోలును జాగ్రత్తగా ఒలుచడం దగ్గరే జరిగింది.

ఈ చర్మపదకోశంలో భారతదేశ సంస్కృతి నాగరికత గ్రంథంలో డి.డి. కోశాంబి తోలు గురించి చేసిన ప్రస్తావనను రికార్డు చేశారు. ఆహారనిల్వలకు, పశుపోషణకు, నీటి సరఫరాకు, కొలిమిని మండించటానికి, నాగరికతకు పునాదులు వేస్తూ తోలు చరిత్ర ఎలా మొదలైందో వివరించారు. మొగలాయిల కాలంలో తోలు ఉత్పత్తులు, తుగ్లక్ పాలనలో తోలు నాణేలు దగ్గర్నుంచి ఉత్పత్తిలో తోలు భాగస్వామ్యాన్ని వివరించడం జరిగింది. జంతువుల నుంచి ఒలిచిన తోలును నానబెట్టిన దాన్నే 'లంద' అంటారు. లందోల్లు అంటే లంద పనిచేసేవారని అర్థం. సంగారెడ్డి జిల్లాలో లందోల్లు పలుగురాళ్ల గుట్ట దగ్గర ఉండేవారు. అదే కాలక్రమంలో 'అందోలు'గా మారింది.

గుహ నుంచి గూడుకు మనిషిచేరే క్రమం తోలు వల్లనే జరిగింది. పుట్టుక దగ్గర్నుంచి మనిషి అంతర్ధానం అయ్యేవరకు అన్ని జీవన ప్రక్రియల్లో తోలు కీలకపాత్ర పోషించింది. ఈ చరిత్రపై దేశదేశాల భాషా శాస్త్రవేత్తలు జరిపిన కృషినంతా ఇందులో చేర్చటం జరిగింది. రక్షణ రంగ సామాగ్రికి తోలే, యుద్ధతంత్రానికీ తోలే, మని షి నాగరికతకు ఒంటికి తొలిబట్టగా నిలిచింది తోలే. నీటిని దాపి సమాజ దప్పిక తీర్చింది తోలే. ఆదివాసీల జీవన సంస్కృతే తొలి మానవుల ఆది జీవన సంస్కృతి. దానికి పునాది తోలే. పురాణాలు, ఆదికావ్యాలు, చరిత్ర నిక్షిప్తమైన సమాజ నిర్మాణాల్లో తోలు ప్రస్తావన ఉంది.

తోలు ఆవిష్కరణ, తోలు విద్యలున్నాయి. పురాణాలు, బైబిల్, ఖురాన్‌లలో తోలు దుస్తుల ప్రస్తావన ఉంది. తోలు ప్రస్థానం మొదలయ్యాక సమాజ ప్రగతి ముందుకుసాగింది. సమస్త వృత్తి పనులకు పునాది తోలుతోనే ప్రారంభించబడింది. వృత్తిపనులకు అనుబంధంగా తయారుచేసిన వస్తువులపై ఒడిసెల, గులేరు, కోదండం గాండీవం,తిత్తి, కరి, ఇంటిపేర్లు వచ్చాయి. అలాగే రాగాల వారిధి, కళామేళం, బండికచ్చురం, కవచం, అవుశ, జరు దోసి, తసుమ, తోలుబిల్లు, హౌజరు, చెవితబల, గుండె చప్పుడు, కన్నుకర్ణి, దిమ్మెలు, లక్కచెక్క ఎన్నైనా చెప్పుకోవచ్చు.

'పదకోశం' అధ్యాయంలో చర్మభాషపై 6000 పదాలకు ఈ గ్రంథంలో అర్థాలు చెప్పటం జరిగింది. అవుశ





**ఈ పదకోశం రాయటానికి ఆర్.ఎల్.ప్రసాదు తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర అన్ని ప్రాంతాలకు తిరిగాడు. సకల కుల వృత్తులువారి దగ్గరికి వెళ్లాడు. మాదిగ జీవితం దానిచుట్టూ అలుకున్న పద సంస్కృతులను పట్టుకున్నాడు. దళితులు, దళితుల ఉపకులాల చివరిమెట్టు వరకూ వెళ్లి వాళ్ల జీవనమార్గాలను పరిశీలించాడు. లందల్లోకెళ్లి అందర్లో కలిశాడు. చిందు సంస్కృతిలో అడుగులు వేశాడు. మాదిగ సంస్కృతితో సాగుతున్న జీవనయానాన్ని ఆకళింపు చేసుకున్నాడు.**


అంటే మంగలికల్ప అన్న పదానికి అర్థం చెప్పటంతో ఈ పదకోశం మొదలై హౌజరు అన్న పదంతో ఈ గ్రంథం ముగుస్తుంది. 4వ అధ్యాయంలో తోలుతో తయారుచేసిన వస్తువులకు సంబంధించిన చిత్రాలను అనుబంధంగా అందించటం బాగుంది. 100 పేజీలలో ఆ వస్తువుల చిత్రాలు దర్శనమిస్తాయి.

ఈ పదకోశం తయారుచేయటానికి ఆర్.ఎల్. ప్రసాదుకు ఆరేండ్లు పట్టింది. ఈ పరిశోధకుడు విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన వ్యక్తి కాదు. చదువుకునేందుకు అవకాశాలు లేక తన బాల్యంలోనే చదువును వదిలివేసి సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారు. సమాజంపై పట్టును, సమాజనిర్మాణంలో మానవజీవన ప్రయాణాన్ని గమనించినవాడు, అర్థం చేసుకున్నవాడు. అందువల్ల ఈ పుస్తకానికున్న విశిష్టత ఏమిటంటే ఎక్కడో ఒక దగ్గర కూర్చొని దొరికిన సమాచారాన్ని పోగేసి ఈ పదకోశాన్ని తయారుచేయలేదు. నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి చర్మకారుడు వొలుస్తున్న చర్మపు చేతుల దగ్గరకు పోయి వాళ్లతో మాట్లాడి వారి మాటల్లోనే తయారుచేయటం జరిగింది. తోలు పరిశ్రమ మానవ నాగరికతకు పునాది అని ఈ పుస్తక పరిశోధనలో తేల్చారు. పీడితవర్గాలకు, అట్టడుగు బహుజనవర్గాలకు సంబంధించిన జ్ఞానాన్ని ఈ గ్రంథంలో రికార్డు చేయడం ముదావహం.

ఏదైనా పరిశోధన చేయటానికి విశ్వవిద్యాలయాలలో అందుకు సంబంధించిన మెథడాలజీని, విషయ సేకరణ, పరిశోధనా పద్ధతులను, సమాచార సేకరణను పరిశోధకులకు వివరించి పరిశోధన చేయిస్తారు. కానీ, చర్మపదకోశం,తోలు సంబంధిత నిఘంటువును రూపొందించిన ప్రసాదు మాత్రం మనుషుల దగ్గరకే నేరుగా వెళ్లి ఆ వృత్తిలోపల వున్న జీవితాలను ఆ జీవి పదబంధాలను పట్టుకొని ఆరె కత్తితో చర్మాన్ని చీరి వస్తువులను తయారుచేసినట్లు చర్మపదకోశాన్ని శుద్ధిచేసి సమాజం చేతికందించాడు.

విశ్వవిద్యాలయాల్లో చదవని విద్యార్థి చేసిన అద్భుతమైన పరిశోధనగా ఇది చరిత్రలో నిలిచిపోతుంది. చర్మకారుల వృత్తివికాసం, మానవజాతి నాగరికత, జీవన వికాసం, చరిత్ర తిరిగిన ప్రతిమలుపులో చర్మం పాత్ర ఉంది. చర్మ సౌందర్యం ఎంత గొప్పదో, చర్మంతో చేసిన అద్భుతాలకు అర్థంచెప్పే నిఘంటువుగా ఈ పదకోశం తీర్చిదిద్దబడింది. ఈ గ్రంథ పరిశోధనకు మార్గదర్శకులు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు కాదు. చర్మకారులు, వృత్తికళాకారులు, ఆరెకత్తి బట్టిన చర్మసౌందర్య సృష్టికర్తలు. రాష్ట్ర అవతరణ తర్వాత మన ఆదిమూలాల చరిత్రను వెలికితీసే సమయం ఆసన్నమైంది. మాదిగ జీవనశైలి, సంస్కృతులను ఇందులో విశ్లేషించటం జరిగింది. ప్రపంచీకరణ వల్ల పాత ఆచార సాంప్రదాయాలు, సంస్కృతులు అంతరించిపోతున్నాయని పలు వృత్తి కులాలు ఆందోళన చెందుతున్న ఈ సమయంలో చర్మపదకోశం రావటం ఆహ్వానించదగినది. ఈ పుస్తకం ప్రజలవాడుక భాషలో రాయటం బాగుంది. ఈ పదకోశం రాయటానికి ఆర్.ఎల్.ప్రసాదు తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర అన్ని ప్రాంతాలకు తిరిగాడు. సకల కుల వృత్తులువారి దగ్గరికి వెళ్లాడు. మాదిగ జీవితం దానిచుట్టూ అలుకున్న పద సంస్కృతులను పట్టుకున్నాడు. దళితులు, దళితుల ఉపకులాల చివరిమెట్టు వరకూ వెళ్లి వాళ్ల జీవనమార్గాలను పరిశీలించాడు. లందల్లోకెళ్లి అందర్లో కలిశాడు. చిందు సంస్కృతిలో అడుగులు వేశాడు. మాదిగ సంస్కృతితో సాగుతున్న జీవనయానాన్ని ఆకళింపు చేసుకున్నాడు. అట్టడుగు జీవనశైలి తెలుసుకునేందుకు వాళ్లతో కలిసి బతికాడు. అందుకే ఆర్.ఎల్. ప్రసాదు చాలా శక్తివంతమైన చర్మపదకోశాన్ని చరిత్రకందిస్తున్నాడు. ఇది అట్టడుగున పడివున్న సంస్కృతికి భాషకు అత్యాధునిక కాలంలో జరుగుతున్న మహోన్నత సత్కారం. ఇలాంటి పరిశోధన వల్ల మన అట్టడుగు వర్గాల చరిత్ర సంస్కృతి కళారూపాలు పరిరక్షించబడుతాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత వెలుగుచూస్తున్న ఈ పరిశోధనా గ్రంథానికి మొత్తం తెలంగాణ సమాజం, తెలుగు సమాజం స్వాగతం పలుకుతున్నది.

**– జూలూరు గౌరీశంకర్**

## ప్రకటన


### నవలా స్రవంతి

నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా 2020 ఫిబ్రవరి 14న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి కన్ఫరెన్స్ హాలులో పీవీ నరసింహారావు నవల 'లోపలి మనిషి'పై పరాంకుశం వేణుగోపాలస్వామి ప్రసంగం ఉంటుంది. సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. అందరికీ ఆహ్వానం.

**- డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి**

## కొత్త పుస్తకాలు

### ఈ పెద్దాళ్లున్నారే...



**పిల్లలు** స్వచ్ఛతకు మారుపేరు. వారిని పెద్దలు తమ ఇచ్ఛకు తగ్గట్టు మార్చుకుంటారు. శాఖోపశాఖలై విస్తరించాలని పిల్లలు సహజంగా అనుకుంటారు. మొక్కై వంగనిది మానై వంగదని పెద్దలు తమకు తెలిసినట్టు కంచె కడుతారు. పిల్లల్ని కుండీలో మొక్కల్ని చేస్తారు! ఆ అసంగతాలే ఈ కథలు.

**రచన: బమ్మిడి జగదీశ్వరావు, వెల: రూ.80,**
**ప్రతులకు: మంచి పుస్తకం, 12-13- 439, వీధి నెం:1, తార్నాక, సికింద్రాబాద్-17. ఫోన్: 9490746614**


### మూడో కన్నీటి చుక్క



పర్సనల్ అనుభవాల ద్వారా పబ్లిక్ వాస్తవాన్ని రూపుకట్టడం బొల్లోజు బాబా కవిత్వ విధానం. దైనందిన జీవితం, సామాజంలోని అన్ని విషయాలను కవిత్వీకరించి, సరళమైన వచనంతో ఆకర్షణీయమైన కవిత్వ గూడు అల్లడంలో బాబా నిష్ణాతుడు.

**రచన: బొల్లోజు బాబా, వెల: రూ. 100,**
**ప్రతులకు: బొల్లోజు బాబా, 30-7-31, సూర్యనారాయణపురం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా. ఫోన్: 9849320443**


### పూర్ణ



పూర్ణ మలావత్ జీవితం అబ్బురపరిచేదే కాకుండా గంభీరంగా ఆలోచింపజేసేది. దేశంలో జీవన నాణ్యత లోపించిన బడుగువర్గాలలో పుట్టి ఎవరెస్టు శిఖరమంత ఎదగటం అందరికీ స్ఫూర్తి. అన్ని వివక్షలను, అణిచివేతలను ఎదురొడ్డి నిలిచిన విజయబావుటాకు సంకేతం 'పూర్ణ'.

**రచన: అపర్ణ తోట, అనువాదం:పి. సత్యవతి, వెల: రూ. 295,**
**ప్రతులకు: అన్ని పుస్తక కేంద్రాలు**

### 'రివాజు' తెలంగాణ కథ–2018



శిల్పపరంగా తెలంగాణ కథా ఔన్నత్యాన్ని పట్టి చూపే కథలివి. ఇందులోని కథలు ఎక్కువ శాతం తంగెడుపూవు చుట్టూ గునుగుపూలు అల్లుకున్నట్టుగా ప్రేమచుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తాయి. ఇప్పటి సమాజ ముఖచిత్రాన్ని పట్టిచూపే కథ లివి.

**సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ వెల్దండి శ్రీధర్, వెల: రూ. 70,**
**ప్రతులకు:నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా,కాచిగూడ, హైదరాబాద్**


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

## యాదాద్రికి పోటెత్తిన భక్తులు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మేడారం నుంచి తిరిగి వస్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేస్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహుల కల్యాణం, అలంకార సేవోత్సవాలతో పాటు అష్టోత్తరంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రత పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి రూ. 23.99 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో గీత తెలిపారు.
-యాదాద్రిభువనగిరి ప్రతినిధి నమస్తే తెలంగాణ

## కిక్కిరిసిన కొమురవెల్లి



కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. 4వ వారం సందర్భంగా భక్తులు స్వామి వారి దర్శనానికి తరలివచ్చారు. దాదాపు 40వేల మంది భక్తులు మల్లన్నను దర్శించుకొన్నారని అధికారులు తెలిపారు. కోనేటిలో పవిత్ర స్నానాలు చేసిన భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు, నజరు, మహామండప, చిలుక పట్నం వేసి మొక్కులు తీర్చుకొన్నారు.
- చేర్యాల, నమస్తే తెలంగాణ

# మిత్తికి తెచ్చి లంచమిస్తే..

- రిజిస్ట్రేషన్ చేయకుండా బదిలీఅయ్యారు
- కొత్తగా వచ్చినవాళ్లు పనిచేయడం లేదు
- ధర్మగంటను ఆశ్రయించిన జగిత్యాల జిల్లా రైతు

ధర్మగంట



రాజిరెడ్డికి ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భూమిని పట్టాచేయడానికి డబ్బులు అడిగితే మిత్తికి తెచ్చి రూ. లక్ష అధికారుల చేతుల్లో పోశా.. వాళ్లు డబ్బులు తీసుకుని పనిచేయకుండానే బదిలీఅయ్యారు.. కొత్తగా వచ్చినసార్లు పనిచేయడం లేదు.. మిత్తి పెరుగుతున్నా రెవెన్యూఅధికారులు మాత్రం కనికరించడం లేదు అంటూ జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన రైతు తుర్క రాజిరెడ్డి వాపోయారు. తాతల నుంచి 5.08 ఎకరాల భూమి తనకు వారసత్వంగా వచ్చిందని రైతు తెలిపారు. ఆ భూమికి సంబంధించి సర్వేనంబర్లు కూడా తెలియకపోవడంతో ఊర్లో పెద్దమనుషులు, భాగస్తులు వాటాకు వచ్చిన భూమిని చూపించారని, దానినే సాగుచేసుకుంటూ జీవిస్తున్నానని అన్నారు. సర్వేనంబర్లు 10/2లో 2.05, 10/4లో 1.33 ఎకరాలు, 11లో 6 గుంటలు, 16/2లో 1.04 ఎకరాల భూమి ఉన్నదని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, మండల లైసెన్స్ సర్వేయర్లు కూడా ధ్రువీకరించారని తెలిపారు. కానీ, సర్వేనంబర్ 10లో 2.29 ఎకరాలు, 11లో 6 గుంటల భూమికి మాత్రమే పట్టాచేసి రెవెన్యూ అధికారులు పాస్‌పుస్తకం ఇచ్చారని చెప్పారు. మొత్తం 5.08 గుంటల భూమి ఉంటే 2.35 ఎకరాలకు మాత్రమే పట్టా ఇవ్వడమేమిటని వారిని అడిగితే.. గ్రామంలో, చుట్టుపక్కల పొలాల వారిని విచారించి.. 5.08 ఎకరాలుగా నిర్ధారించారని, హద్దులు కూడా నిర్ణయించారని తెలిపారు. దానిప్రకారం మొత్తం 5.08 ఎకరాలకు పట్టా చేయండని తాసిల్దార్, వీఆర్వో వద్దకు వెళితే డబ్బులు అడిగారని, పని అయితదికదా అని అప్పుచేసి మరీ రూ.లక్ష తెచ్చి ఇచ్చానని పేర్కొన్నారు. అయినా పట్టాచేయకుండా మరో 50 వేలు డిమాండ్‌చేశారని చెప్పారు. వారిద్దరూ పనిచేయకుండానే బదిలీ అయిపోయారని.. కొత్తగా వచ్చిన వీఆర్వో, తాసిల్దార్‌లు ఇవాళచేస్తాం.. రేపు చేస్తాం అంటూ తిప్పుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నాకు అక్షరం ముక్కరాదు.. పట్నం ఎట్లుంటదో తెలియదు.. ఊర్లో అందరూ పట్నం పోయి బాధ చెప్పుకోమంటే వచ్చినా.. ఎలాగైనా నా భూమిని నాకు పట్టా చేయించండి' అంటూ తుర్క రాజిరెడ్డి 'నమస్తే తెలంగాణ' ధర్మగంట ముందు వాపోయారు.

# అకాల నష్టం!

## పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం

### ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో తడిసిన మిర్చి.. నేడూ పలు ప్రాంతాలకు వర్ష సూచన



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని లాల్‌సింగ్‌తండాలో మిర్చి కల్లంలో నిలిచిన నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** భ ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండతోపాటు మంచిర్యాల జిల్లాలో అకాల వర్షం కురవగా.. కల్లాల్లో ఆరబోసిన మిర్చితోపాటు పత్తి పంటకు నష్టం జరిగింది. సోమవారం కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో జల్లులు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సరాసరి 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కూసుమంచి మండలంలో 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, తిరుమలాయపాలెం మండలంలో 22.2 మి.మీ, ముదిగొండ మండలంలో 6.6 మి.మీ, నేలకొండపల్లి మండలంలో 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పూర్తిగా తడిసిపోయింది. ఒక్క కూసుమంచి మండలంలో 3,883 ఎకరాలలో మిర్చి సాగు కాగా, దాదాపు 60 శాతం మేర 29 వేల క్వింటాళ్ల పంట దెబ్బతిన్నదని ఉద్యానశాఖ అధికారులు పేర్కొన్నారు. పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంటపొలాలు, మిర్చి కల్లాలను పరిశీలించి.. రైతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలపాటు వర్షం కురిసింది. మోతె మండలంలో అత్యధికంగా 90 మి.మీ., చివ్వెంల, గరిడేపల్లిలో 30 మి.మీ., హుజూర్‌నగర్, కోదాడ, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్, సూర్యాపేట, పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్, నేరేడుచర్ల మండలాల్లో 20 మి.మీ. చొప్పున వర్షంపాతం నమోదైంది. మోతె, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో వర్షానికి మిర్చి, కంది పంటలు తడిశాయి. ఆరబెట్టిన మిర్చి తడిసి మద్దయ్యింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మంచిర్యాల జిల్లాలో 17.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. 25 నుంచి 30 శాతం పత్తి చేలల్లోనే ఏరేందుకు ఉండగా అకాల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేమనపల్లి, నెన్నెల మండలాల్లో పత్తి తడిసి రంగు మారుతుండగా, మామిడి పూత రాలింది.

## నేడు అక్కడక్కడ వర్షాలు

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దక్షిణ ఇంటీరియర్ ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు దక్షిణ తమిళనాడు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు ఇంటీరియర్ కర్ణాటక మరాట్వాడా విదర్భ మీదుగా ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడింది. ఉపరితలద్రోణి ప్రభావంగా రాష్టంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిశాయి. కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 29.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19డిగ్రీలు నమోదైంది.



నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని లావూడితండా వద్ద రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

## పొంగిన చిత్రపరకవాగు

**నల్లగొండ** జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మిర్యాలగూడ, దామరచర్ల, వేములపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వేములపల్లి మండలం శెట్టిపాలెంలో ఉన్న చిత్రపరకవాగు పొంగిపొర్లింది. వరి పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కేతేపల్లి, శాలిగౌరారం, కొండమల్లేపల్లిలో ఓ మోస్తరు వర్షం పడగా, కట్టంగూర్, నార్కట్‌పల్లి, మాడ్గులపల్లి మండలాల్లో ఓ మోస్తరువర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి.



ఆదివారం ఖమ్మంలో 68 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయనిధి వరమని అన్నారు. - ఖమ్మం, నమస్తే తెలంగాణ



రాజపేటలో టీఆర్‌ఎస్ వనపర్తి జిల్లా కార్యాలయ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# పేదల సొంతింటికల సాకారం

- మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సీతారాంపల్లిలో 10 డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభం



హరీశ్‌రావుకు స్వీటు తినిపిస్తున్న మహిళాశిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ విజయ

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** నిరుపేదల సొంతింటి కలను సీఎం కేసీఆర్ సాకారం చేస్తున్నారని ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లిలో 10 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మహిళాశిశు సంక్షేమశాఖ ఆర్గనైజర్ బూర విజయ, ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాంలతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. సిద్దిపేటలో మల్టీపర్పస్ హైస్కూల్ ఏర్పడి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన జూబ్లీ వేడుకల్లోనూ మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేట మల్టీపర్పస్ హైస్కూల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నదని, స్వాతంత్ర్యం రాక ముందే ఈ పాఠశాల ఏర్పడిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలను, ఇద్దరు ఎంపీలను, ఒక ఎమ్మెల్సీని, అనేక మంది విద్యావేత్తలను, సామాజిక కార్యకర్తలను సమాజానికి అందించిందని, మల్టీపర్పస్ హైస్కూల్ సిద్దిపేట ప్రాంతంలో గొప్ప సామాజిక మార్పును తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

# కేసీఆర్ వల్లే నా కొడుకు పెండ్లవుతుంది

## డబుల్‌బెడ్‌రూం ఇల్లు లబ్ధిదారురాలు నాగమ్మ

### దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక



తన కొడుకు పెండ్లికి రావాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాగమ్మ

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'మీకు ఇల్లే లేదు.. ఇక పిల్లనెట్ల ఇవ్వాలి.. అని పెండ్లి సంబంధం చూసిన చాలాచోట్ల అన్నరు.. అయితే సీఎం కేసీఆర్ సార్ ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇల్లు వల్ల నా కొడుకు పెండ్లవుతున్నది' అని మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామానికి చెందిన డంకూరి నాగమ్మ ఆనంద భాష్పాలతో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి తెలిపింది. గ్రామంలో ఇటీవల డబుల్ ఇండ్ల గృహ ప్రవేశాలు జరగగా.. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఆ గృహాలను పరిశీలించేందుకు వెళ్లారు. ఇళ్లను చూస్తూ ఓ ఇంటి వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేను చూసిన నాగమ్మ తన కొడుకుకు గతంలో పెళ్లి జరగక పడిన ఇబ్బందులను తెలియజేసింది. ప్రభుత్వం ఇల్లు ఇవ్వడంతో తన కొడుకుకు పెండ్లవుతున్నదని ఆనందంతో చెప్పింది. ఈ నెల 14న తన కొడుకు పెండ్లికి రావాలని ఎమ్మెల్యేకు పెండ్లి పత్రిక అందించింది.

# విరివిగా మొక్కలు నాటండి

## టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ పనులను పరిశీలించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్:** టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం చుట్టూ ఆకుపచ్చని చెట్లు ఉండేలా విరివిగా మొక్కలు నాటాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. ఆదివారం వనపర్తి మండలంలోని రాజపేట శివారులో నిర్మిస్తున్న పార్టీ కార్యాలయ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అవసరమైనంత మందిని పెట్టి పనులను వేగవంతం చేయాలన్నారు.



సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# అభివృద్ధికి ఆకర్షితులై టీఆర్‌ఎస్‌లోకి..

## వివిధ పార్టీల నుంచి కొనసాగుతున్న చేరికలు

**నాగారం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలోని ఆయన నివాసంలో నాగారం మండలంపస్తాల గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం గ్రామ కోఆప్షన్ సభ్యుడు గంధమళ్ల నర్సింహతోపాటు వార్డు సభ్యులు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

# విద్యార్థులకు కవిత్వం నేర్పించాలి

## సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్



మాట్లాడుతున్న సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్

**సిరిసిల్ల కల్చరల్:** విద్యార్థులకు కవిత్వాన్ని నేర్పించాలని సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ కోరారు. ఆదివారం రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం-2019 ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం 'అద్వంద్వం' పుస్తకరచయిత శ్రీరామ్‌ను సత్కరించి రంగినేని ఎల్లమ్మ పురస్కారం -2019ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కవి, రచయిత జూకంటి జగన్నాథం, రంగినేని ట్రస్టు అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, పురస్కారకమిటి కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా పత్తిపాక మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**పెద్దపల్లి జంక్షన్ :** పెద్దపల్లి మండలంలోని గొల్లపల్లి బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పన్నపేట శివపురి కాలనీకి చెందిన కొలిపాక సత్యనారాయణ(50) కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. తన స్కూటీపై పెద్దపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా, గొల్లపల్లి స్టేజ్ వద్ద మంచిర్యాల నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న వ్యక్తి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో సత్యనారాయణ తీవ్రంగా గాయపడగా, స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.



నిత్యాన్నదాన కేంద్రంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల

# భక్తుల ఆకలి తీర్చుతాం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ రూరల్:** మన్యంకొండ భక్తుల ఆకలి తీర్చేందుకు నిత్యాన్నదానం ప్రారంభిస్తున్నట్టు ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మంత్రి మన్యంకొండ ఆలయంలో వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించారు. మన్యంకొండ లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున వెంకన్నస్వామికి సుప్రభాతసేవ నిర్వహించారు. రాత్రికి గరుడవాహన సేవ కన్నుల పండువగా కొనసాగింది. రథోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాతోపాటు తెలంగాణ, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎడ్లబండ్లు, ప్రత్యేకవాహనాలలో చేరుకున్నారు. ఆదివారం ఒక్కరోజే లక్షా 50 వేల మంది భక్తులు తరలివచ్చినట్టు అధికారులు తెలిపారు.

# 2,994 నామినేషన్లు తిరస్కరణ

- ముగిసిన సహకార ఎన్నికల నామినేషన్ల పరిశీలన
- 11,765 డైరెక్టర్లకు బరిలో 37,114 మంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలకు ఆదివారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 904 పీఏసీఎస్‌ల పరిధిలోని 11,765 డైరెక్టర్ల పదవులకు 37,114 నామినేషన్లు దాఖలయ్యాయి. 2,994 నామినేషన్లు తిరస్కరించినట్టు సహకారశాఖ ఎన్నికల అథారిటీ వెల్లడించింది. తిరస్కరణ అనంతరం 34,120 నామినేషన్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగిన విషయం తెలిసిందే. వెయ్యికిపైగా డైరెక్టర్ల పదవులకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు వచ్చినట్టు తెలిసింది. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం సాయంత్రం 3 గంటల వరకు గడువు ఉన్నది. అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాలపై స్పష్టతరానున్నది. పార్టీలగుర్తుతో ఎన్నికలు జరుగనప్పటికీ టీఆర్‌ఎస్, కాంగ్రెస్ మద్దతుదారులు అధికసంఖ్యలో బరిలో నిలిచారు.

**నిజామాబాద్‌లో 2,992**

అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 89 పీఏసీఎస్‌ల పరిధిలో 2,992 మంది నామినేషన్లు దాఖలు చేశారు. తర్వాత స్థానంలో ఖమ్మం నిలిచింది. ఇక్కడ 76 పీఏసీఎస్‌లకు 2,545 నామినేషన్లు వచ్చాయి. జోగులాంబగద్వాల జిల్లాలో అత్యల్పంగా 11 పీఏసీఎస్‌లకు 454 నామినేషన్లు దాఖలైనట్లు సహకారశాఖ ఎన్నికల అథారిటీ వెల్లడించింది. 10న అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నట్టు సహకారశాఖ ఎన్నికల అథారిటీ అధికారులు తెలిపారు.

# మహనీయుడు బాబూ జగ్జీవన్‌రావు

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

**తొగుట:** బాబూ జగ్జీవన్‌రావు బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచాడని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావు బాటలో యువత ముందుకుసాగాలన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దివంగత చెరుకు ముత్యంరెడ్డి ఎంతో కృషి చేశాడని ఆయన తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి డప్పు శివరాజ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మె ల్యే సోలిపేట రామలింగారెడ్డి రూ.50వేలు అందజేశారు.



# టీవోఏ అధ్యక్షుడిగా జయేశ్

## రంగారావుపై 13 ఓట్ల ఆధిక్యంతో గెలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీవోఏ) అధ్యక్షుడిగా ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఘన విజయం సాధించారు. ప్రత్యర్థి కె.రంగారావుపై ఆయన 13 ఓట్ల ఆధిక్యంతో జయభేరి మోగించారు. నగరంలోని ఎల్బీ స్టేడియం ఒలింపిక్స్ భవన్‌లో ఆదివారం తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన టీవోఏ ఎన్నికల్లో 84 ఓట్లకుగాను మొత్తం 81 ఓట్లు పోలయ్యాయి. జయేశ్ రంజన్‌కు 46 ఓట్లు రాగా, రంగారావుకు 33 మాత్రమే వచ్చాయి. అయితే, క్రాస్‌ఓటింగ్ జరుగడంతో మిగిలిన పదవులకు అంచనాలకు విరుద్ధంగా ఫలితాలు వచ్చాయి. మొత్తం 26 పోస్టుల్లో అధ్యక్ష పదవి సహా మరో నాలుగు స్థానాల్లో జయేశ్ రంజన్ ప్యానెల్ విజయం సాధించింది. టీవోఏ ప్రధాన కార్యదర్శి పదవికి పోటీలో నిలిచిన జయేశ్ ప్యానెల్ అభ్యర్థి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఏ.జగన్‌మోహన్ రావు విజయం తథ్యమని ముందు నుంచి అందరూ అంచనా వేసినా... ఆయన రెండు ఓట్ల స్వల్ప తేడాతో జగదీశ్వర్ యాదవ్ చేతిలో ఓటమి పాలయ్యారు. రంగారావు ప్యానెల్ అభ్యర్థి జగదీశ్వర్‌కు 41 ఓట్లు పోలవగా.. జయేశ్ వర్గాన్ని ముందుండి నడిపించిన జగన్‌మోహన్‌కు 39 ఓట్లు వచ్చాయి. మరో ఓటు చెల్లుబాటు కాలేదు. కోశాధికారి పదవికి సైతం రంగారావు ప్యానెల్ తరఫున పోటీలో నిలిచిన నిలిచిన కె.మహేశ్వర్ (46 ఓట్లు).. ఫణిరావు (31)పై గెలిచారు. నాలుగు ఓట్లు చెల్లలేదు. ఉపాధ్యక్షులుగా ఎస్ వేణుగోపాలాచారి (67 ఓట్లు), రఫత్ అలీ (60), ప్రేమ్ రాజ్ (57), సరల్ తల్వార్ (53) ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా జయేశ్ ప్యానెల్‌కు చెందిన ఏ.సోమేశ్వర్ (40 ఓట్లు), రంగారావు వర్గానికి చెందిన మల్లారెడ్డి (49), రామకృష్ణ (45), నార్మన్ ఇసాక్ (63) గెలుపొందారు. రాష్ట్ర క్రీడా సంఘాల ఈసీ సభ్యులుగా అ బ్బాస్ కిర్మాణి, దత్తాత్రేయ, మహేందర్ రెడ్డి, పురుషోత్తం, రామ కోటేశ్వరరావు, కె.రామకృష్ణ, ఇస్మాయిల్ బేగ్, హంజా బిన్ ఒమర్, టి.స్వామి, మహమ్మద్ ఖాజా ఖాన్ ఎంపికవగా, రాజేంద్ర ప్రసాద్, అజీజ్ ఖాన్, జనార్దన్ రెడ్డి, లింగయ్య, మనోహర్ జిల్లా ఒలింపిక్ సంఘాలకు ఈసీ సభ్యులుగా గెలిచారు.



జగన్‌మోహన్ రావు

### కోర్టుకెళ్తాం..

టీవోఏ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని, ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు జయేశ్ ప్యానెల్ తరఫున ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన ఏ.జగన్‌మోహన్ రావు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) తొలుత 30 సంఘాలకే ఓటు హక్కు ఇవ్వగా.. అందుకు విరుద్ధంగా వాటిని 42కు పెంచారని ఆయన ఆరోపించారు. రిటర్నింగ్ అధికారి జస్టిస్ బి.చంద్రకుమార్‌పై ఐవోఏకు సైతం ఫిర్యాదు చేయనున్నట్టు జగన్‌మోహన్ రావు వెల్లడించారు. టీవోఏకు నెలరోజుల్లోనే మళ్లీ ఎన్నికలు వస్తాయని, తామందరం గెలిచి చూపిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన జయేశ్ రంజన్‌కు జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు.



# సచిన్ బ్యాట్ పట్టిన వేళ

**మెల్‌బోర్న్:** క్రికెట్ దేవుడు సచిన్ రమేశ్ టెండూల్కర్ దాదాపు ఆరేండ్ల తర్వాత మైదానంలో బ్యాట్‌పట్టి అభిమానులను తరింపజేశాడు. ఆస్ట్రేలియా కార్చిచ్చు బాధితుల కోసం 22 గజాల పిచ్‌పై కాలుమోపి ఐదు నిమిషాల పాటు బ్యాటింగ్ చేశాడు. విరాళాల సేకరణ కోసం ఆస్ట్రేలియా సూపర్‌స్టార్ మహిళల మ్యాచ్ విరామ సమయంలో సచిన్ బ్యాటింగ్‌కు దిగాడు. ఆసీస్ మహిళా క్రికెటర్ ఎలెసా పెర్రీ వేసిన ఆరు బంతులను సచిన్ ఎదుర్కొన్నాడు. తొలి బంతినే ఫైన్‌లెగ్ దిశగా బౌండ్రీకి తరలించి అభిమానులను అలరించాడు.

**మరోసారి లారా మ్యాజిక్**

విరాళాల సేకరణ కోసం జరిగిన పురుషుల 10 ఓవర్ల మ్యాచ్‌లో పాంటింగ్ ఎలెవెన్ తరఫున బరిలోకి దిగిన విండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా తనదైన శైలిలో చెలరేగిపోయాడు. స్టయిలిష్ కవర్‌డ్రైవ్‌లు, స్ట్రయిట్ డ్రైవ్‌లతో 30 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పాంటింగ్ ఎలెవెన్ జట్టు 10 ఓవర్లలో 104/5 చేస్తే.. ఆ తర్వాత గిల్‌క్రిస్ట్ ఎలెవెన్ 103/6 దగ్గరే ఆగిపోయింది. యువరాజ్ సింగ్ (2) నిరాశ పరిచాడు.



# బెంగళూరుదే టైటిల్

## పీబీఎల్ ఫైనల్లో నార్త్‌ఈస్టర్న్‌పై గెలుపు.. రెండోసారి విజేతగా నిలిచిన రాప్టర్స్

**హైదరాబాద్:** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో బెంగళూరు రాప్టర్స్ మరోసారి విజేతగా నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఐదో సీజన్‌లో అడుగుపెట్టిన రాప్టర్స్ ఎదురులేని ఆటతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆదివారం ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన తుదిపోరులో బెంగళూరు 4-2తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై విజయ ఢంకా మోగించింది. ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత భమిడిపాటి సాయిప్రణీత్, మహిళల సింగిల్స్ ప్రపంచ రెండో ర్యాంకర్ తై జు యింగ్ రాప్టర్స్‌ను విజయ తీరాలకు చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. ఫైనల్లో తొలుత పురుషుల సింగిల్స్ మ్యాచ్ జరుగగా.. రాప్టర్స్ ఆటగాడు సాయి ప్రణీత్ 14-15, 15-9, 15-3తో లీ చెక్ యూపై విజయం సాధించి, శుభారంభం చేశాడు. ఆ తర్వాత ట్రంప్ మ్యాచ్‌గా ఎంపిక చేసుకున్న పురుషుల డబుల్స్‌లో షాక్ తగలడంతో బెంగళూరు వెనుకబడింది. అనంతరం మహిళల సింగిల్స్‌లో రాప్టర్స్ స్టార్ ప్లేయర్ తై జూ యింగ్ 15-9, 15-12తో నార్త్‌ఈస్ట్ క్రీడాకారిణి మిచెల్ లీపై సునాయాస విజయం సాధించింది. ఆ తర్వాత ప్రత్యర్థి జట్టు ట్రంప్ మ్యాచ్‌గా ఎంపిక చేసుకున్న మిక్స్‌డ్ డబుల్స్‌లో బెంగళూరు జోడీ చాంగ్ పెంగ్ సూన్-ఈవోమ్ హేవోన్ ఉత్కంఠ పోరులో విజయం సాధించడంతో రాప్టర్స్ గెలుపు ఖాయమైంది.

# నసీమ్ షా రికార్డు హ్యాట్రిక్

**రావల్పిండి:** టెస్టు క్రికెట్‌లో అతి పిన్న వయసులో హ్యాట్రిక్ సాధించిన బౌలర్‌గా పాకిస్థాన్ పేసర్ నసీమ్ షా (16 ఏండ్ల 359 రోజులు) రికార్డుల్లోకెక్కాడు. నసీమ్ (4/26)తో పాటు యాసిర్ షా (2/33) కూడా విజృంభించడంతో ఆదివారం ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 126/6తో నిలిచింది. చేతిలో 4 వికెట్లు ఉన్న బంగ్లా ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే ఇంకా 86 పరుగులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కెప్టెన్ మోమినుల్ మక్ (37), లిటన్ దాస్ (0) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 342/3తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన



నసీమ్ (4/26)

పాక్ 445 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (143) క్రితం రోజు స్కోరు వద్దే వెనుదిరగ్గా.. హరీస్ సోహైల్ (75) రాణించాడు. బంగ్లా బౌలర్లలో అబు జయేద్, రూబెల్ హుసేన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.



గిల్ (107★)

# గిల్ సెంచరీ

**లింక్లిన్ (న్యూజిలాండ్):** యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ (107 బ్యాటింగ్; 13 ఫోర్లు, ఓ సిక్స్) అజేయ శతకంతో చెలరేగడంతో న్యూజిలాండ్-ఏతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ దీటుగా బదులిస్తున్నది. మూడో రోజైన ఆదివారం 53 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్-ఏ.. కెప్టెన్ విహారి (59) వికెట్ కోల్పోయి 234 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న భారత్.. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 156 పరుగులు వెనుకబడి ఉంది. గిల్‌తో పాటు చతేశ్వర్ పుజారా (52) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు న్యూజిలాండ్ 390/9 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. డారిల్ మిషెల్ (103 నాటౌట్) శతకంతో ఆకట్టుకున్నాడు.

# భారత్ పరాజయం

## 2-3తో బెల్జియం చేతిలో ఓడిన మన్‌ప్రీత్ సేన

**భువనేశ్వర్:** గత మ్యాచ్‌లో విశ్వవిజేత బెల్జియంకు షాకిచ్చిన భారత పురుషుల హాకీ జట్టుకు మలిపోరులో నిరాశ ఎదురైంది. ఎఫ్ఐహెచ్ హాకీ ప్రొ లీగ్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 2-3తో బెల్జియం చేతిలో పరాజయం పాలైంది. భారత్ తరఫున వివేక్ సాగర్ ప్రసాద్ (15వ ని.లో), అమిత్ రోహిదాస్ (17వ ని.లో) చెరో గోల్ చేయగా.. బెల్జియం తరఫున మ్యాక్సిమ్ ప్లెనేవాక్స్ (17, 26వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో చెలరేగగా.. అలెగ్జాండర్ హెండ్రిక్స్ (3వ ని.లో)ఓ గోల్ కొట్టాడు. గత మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం కనబరిచిన మన్‌ప్రీత్ సేన.. రెండో రోజు అదే జోరు కొనసాగించలేకపోయింది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ రెండో సీజన్‌లో తొలి



రౌండ్లో నెదర్లాండ్స్‌ను రెండు సార్లు చిత్తు చేసిన మన్‌ప్రీత్ సేన.. బెల్జియంపై ఓ మ్యాచ్ నెగ్గి మరో మ్యాచ్ ఓడటంతో 8 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. బెల్జియం (14 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నది.



# భళా బంగ్లా

## తొలిసారి అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన బంగ్లాదేశ్

### ఫైనల్లో 3 వికెట్ల తేడాతో ఓడిన భారత్.. యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్ శ్రమ వృథా

**దురదృష్టాన్ని జేబులో పెట్టుకొని తిరిగే బంగ్లాదేశ్ ఎట్టకేలకు ఐసీసీ టైటిల్ నెగ్గింది. అండర్-19 ప్రపంచకప్‌లో తుదిపోరుకు చేరిన తొలిసారే డిఫెండింగ్ చాంపియన్ యువ భారత్‌కు షాకిస్తూ ట్రోఫీ ఎగురేసుకెళ్లింది.**

**ఇప్పటివరకు నాలుగుసార్లు ప్రపంచకప్ నెగ్గినా.. ఒక్కసారి కూడా ట్రోఫీని నిలబెట్టుకోలేకపోయిన యువ భారత్.. ఈ సారి కూడా అదే ఆనవాయితీని కొనసాగించింది.**

**ఫుల్ ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ ఒంటరి పోరాటంతో ఒక దశలో 103/1తో ఉన్న భారత జట్టు 74 పరుగుల తేడాతో తొమ్మిది వికెట్లు కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది.**

**అనంతరం బౌలింగ్‌లో యువ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ చకచకా నాలుగు వికెట్లు తీసి భారత శిబిరంలో ఆశలు రేపినా ప్రత్యర్థి కెప్టెన్ తుదికంటా నిలిచి ట్రోఫీని లాగేసుకున్నాడు.**

**పోచెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా):** డిఫెండింగ్ చాంపియన్ హోదాలో అండర్-19 ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన యువ భారత్ తుదిమెట్టుపై తడబడింది. మిడిలార్డర్ విఫలమవడంతో మొదట తక్కువ స్కోరుకే పరిమితమైన ప్రియం గార్గ్ సేన.. ఆనక బౌలింగ్‌లో విజృంభించి ప్రత్యర్థిని కట్టడి చేసినా.. తుదివరకు పోరాడిన బంగ్లాదేశ్‌నే విజయం వరించింది. ఆదివారం ఇక్కడి సెన్వెస్ పార్క్‌లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ (డ/లూ) పద్ధతి ప్రకారం 3 వికెట్ల తేడాతో గెలిచి తొలిసారి కప్పు కైవసం చేసుకుంది. బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలి ఐసీసీ ట్రోఫీ కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత అండర్-19 జట్టు నిర్ణీత ఓవర్లలో 177 పరుగులకు ఆలౌటైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ యశస్వి జైస్వాల్ (121 బంతుల్లో 88; 8 ఫోర్లు, ఒక సిక్స్) మరోసారి అదరగొట్టగా.. తెలంగాణ ఆటగాడు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ (65 బంతుల్లో 38; 3 ఫోర్లు) రాణించాడు. ప్రత్యర్థి బౌలర్లలో అవిషేక్ 3, షరీఫుల్, తన్జీమ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడటంతో బంగ్లా లక్ష్యాన్ని 46 ఓవర్లలో 169కి కుదించారు. కాగా.. బంగ్లాదేశ్ 42.1 ఓవర్లలో 7 వికెట్లకు 170 పరుగులు చేసింది. ఓపెనర్ పర్వేజ్ హుసేన్ (47; 7 ఫోర్లు), కెప్టెన్ అక్బర్ అలీ (43 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ (4/30), సుశాంత్ మిశ్రా (2/25) పోరాటం వృథా అయింది. భారత బౌలర్లు ఎక్స్‌ట్రాల రూపంలో 33 పరుగులు సమర్పించుకోవడం ఫలితంపై ప్రభావం చూపింది. అజేయంగా నిలిచి జట్టును గెలిపించిన అక్బర్ అలీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', టోర్నీ ఆసాంతం రాణించిన యశస్వి జైస్వాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డులు దక్కాయి.

**అతనొక్కడే..**

వరుస విజయాలతో జోరుమీదున్న యువ భారత్ ఫైనల్లో తడబడింది. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై బంగ్లా పేసర్లు కట్టుదిట్టమైన బంతులతో బెంబేలెత్తించడంతో.. 7 ఓవర్లు ముగిసే సరికి ప్రియం సేన 9/1తో నిలిచింది. దీంతో పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయిన మన కుర్రాళ్లు.. ఆచితూచి ఆడటంతో భారత రన్‌రేట్ ఏ దశలోనూ 4 దాటలేదు. ప్రత్యర్థి పేసర్లు అవిషేక్ (3/40), తన్జీమ్ (2/28), షరీఫుల్ ఇస్లాం (2/31) పరీక్ష పెడుతున్నా.. యశస్వి జైస్వాల్ పట్టుదలతో బ్యాటింగ్ కొనసాగించాడు. టోర్నీలో అత్యధిక పరుగుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జైస్వాల్‌కు తెలంగాణ ప్లేయర్ తిలక్ వర్మ చక్కటి సహకారం అందించాడు. ఈ జోడీ ఆచితూచి ఆడటంతో నెమ్మదిగా భారత ఇన్నింగ్స్ గాడినపడింది. సగం ఆట (25 ఓవర్లు) ముగిసేసరికి మన జట్టు 80/1తో నిలిచింది. ఈ క్రమంలో యశస్వి 89 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు 93 పరుగులు జోడించాక తిలక్ ఔటయ్యాడు. కెప్టెన్ ప్రియం గార్గ్ (7) ఇలా వచ్చి అలా వెళ్లాడు. ధృవ్ జురేల్ (22)తో కలిసి కాస్త దూకుడు పెంచిన జైస్వాల్.. భారత స్కోరును 150 దాటించాడు. ఈ దశలో షరీఫుల్ వరుస బంతుల్లో యశస్వి, సిద్ధేశ్ వీర్ (0)ను ఔట్ చేసి భారత్‌ను దెబ్బతీశాడు. కాసేపటికే ధృవ్ ఔట్‌కాగా.. రవి బిష్ణోయ్ (2), అథర్వ (3), కార్తీక్ (0), సుశాంత్ (3) పెవిలియన్‌కు క్యూ కట్టారు. యువ భారత్ 21 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయిం ది. భారత ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, ఒక సిక్స్ మాత్రమే నమోదయ్యా యి. యశస్వి, తిలక్, ధృవ్ మినహా తక్కినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

**రవి రఫ్ఫాడించినా..**

ఓ మాదిరి లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కింది. ఓపెనర్లు పర్వేజ్, తన్జీద్ హసన్ (17) ఆకట్టుకోవడంతో బంగ్లా 8.2 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 50 పరుగులు చేసింది. ఇక భారత్ పరాజయం ఖాయమనుకుంటున్న దశలో రవి బిష్ణోయ్ చెలరేగిపోయాడు. తొలి ఓవర్‌లోనే తన్జీద్‌ను వెనక్కి పంపిన రవి.. ఆ తర్వాత తనదైన లెగ్ స్పిన్‌తో దూసుకెళ్లాడు. ఓవర్‌కో వికెట్ చొప్పున మూడు వికెట్లు పడగొటాడు. రవి ధాటికి మహ్ముదుల్ (8), తౌహిద్ (0), షహాదత్ (1) పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో ఆ జట్టు 65/4తో కష్టాల్లో పడింది. కాసేపటికి షమీమ్ (7) కూడా వెనుదిరగ్గా.. గాయం కారణంగా ఓపెనర్ పర్వేజ్ రిటైర్డ్ హర్ట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌కు చేరాడు. ఇక భారత్ గెలుపొందడం ఖాయమనుకుంటున్న దశలో బంగ్లా కెప్టెన్ అక్బర్ ఒంటరి పోరాటం చేశాడు. టెయిలెండర్ల సాయంతో జట్టును విజయం దిశగా నడిపించాడు. అవిషేక్ (5) ఔటవడంతో మరోసారి క్రీజులోకి వచ్చిన పర్వేజ్.. కెప్టెన్‌కు చక్కటి సహకారం అందించడంతో ఆ జట్టు సునాయాసంగా లక్ష్యంవైపు సాగింది. విజయానికి 35 పరుగుల దూరంలో పర్వేజ్ ఔటైనా.. రకీబుల్ (9) అండగా అక్బర్ అలీ మ్యాచ్‌ను ముగించాడు.

**1** ఐసీసీ ట్రోఫీ నెగ్గడం బంగ్లాదేశ్‌కు ఇదే తొలిసారి. ఓవరాల్‌గా అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన ఏడో జట్టుగా బంగ్లా రికార్డుల్లోకెక్కింది.

**1** ఈ మెగాటోర్నీలో అత్యధిక పరగుల జాబితాలో యశస్వి జైస్వాల్ (400) అగ్రస్థానంలో నిలిచాడు.



రవి బిష్ణోయ్ (4/30)

**3** అండర్-19 ప్రపంచకప్‌లో వరుసగా ఐదు అర్ధశతకాలు చేసిన మూడో బ్యాట్స్‌మన్‌గా యశస్వి రికార్డుల్లోకెక్కాడు. గతంలో ఆస్ట్రేలియా ప్లేయర్ బ్రెట్ విలియమ్స్ (1988), భారత ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ (2016) ఈ ఘనత సాధించారు.


**33** అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో అత్యధిక ఎక్స్‌ట్రాలు (33) సమర్పించుకున్న చెత్త రికార్డును యువ భారత్ సమం చేసింది. 1998 ఫైనల్లో ఇంగ్లండ్ 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వగా.. ఈసారి యువ భారత్ ఆ పని చేసింది.

## యశస్వి.. రోహిత్‌లా..

గతేడాది జరిగిన సీనియర్ ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమ్‌ఇండియా ఓడిపోయాక స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ బాధపడిన తీరు క్రికెట్ ప్రేమికులకు ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. ఆ టోర్నీలో ఐదు శతకాలతో సూపర్ ఫామ్ కనబరచినా.. టైటిల్ చేజిక్కకపోవడంతో రోహిత్ కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కలేదు. ఇప్పుడు అండర్-19 ప్రపంచకప్‌లో యువ కెరటం యశస్వి జైస్వాల్‌దీ అదే పరిస్థితి. వరుసగా ఐదు అర్ధశతకాలతో టీమ్‌ఇండియా ఫైనల్ చేరడంలో యశస్విదే కీలకపాత్ర. సహచరులంతా వెనుదిరిగినా ఫైనల్లోనూ అతడు హాఫ్ సెంచరీతో కదంతొక్కాడు. అయినా, తుదిపోరులో జట్టు ఓడడంతో రోహిత్ శర్మలా జైస్వాల్ శ్రమకు కూడా సంపూర్ణ ఫలితం దక్కలేదు.



యశస్వి (88)



కల నిజమైనట్లు అనిపిస్తున్నది. గత రెండేండ్లుగా మేం పడ్డ కష్టానికి ఫలితమే ఈ విజయం. ఈ స్థాయికి చేరడంలో సపోర్టింగ్ స్టాఫ్ కృషి చాలా ఉంది. ఇక ముందు కూడా ఇదే జోరు కొనసాగించాలనుకుంటున్నాం. మ్యాచ్ సందర్భంగా మా బౌలర్లు కాస్త ఆవేశానికి గురైన మాట వాస్తవమే. ఫైనల్లో భారత జట్టు చక్కటి ప్రదర్శన కనబరిచింది. వారికి నా అభినందనలు.

- అక్బర్ అలీ, బంగ్లాదేశ్ కెప్టెన్

## స్కోరు బోర్డు

**భారత్:** యశస్వి (సి) తన్జీద్ (బి) షరీఫుల్ 88, దివ్యాన్ష్ (సి) మహ్ముదుల్ 9బి) అవిషేక్ 2, తిలక్ వర్మ (సి) షరీఫుల్ (బి) తన్జీమ్ 38, ప్రియం (సి) తన్జీద్ (బి) రకీబుల్ 7, ధృవ్ (రనౌట్) 22, సిద్ధేశ్ (ఎల్బీ) షరీఫుల్ 0, అథర్వ (బి) అవిషేక్ 3, రవి (రనౌట్) 2, సుశాంత్ (సి) షరీఫుల్ (బి) తన్జీమ్ 3, కార్తీక్ (సి) అక్బర్ (బి) అవిషేక్ 0, ఆకాశ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 47.2 ఓవర్లలో 177 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-9, 2-103, 3-114, 4-156, 5-156, 6-168, 7-170, 8-170, 9-172, 10-177, **బౌలింగ్:** షరీఫుల్ 10-1-31-2, తన్జీమ్ 8.2-2-28-2, అవిషేక్ 9-0-40-3, షమీమ్ 6-0-36-0, రకీబుల్ 10-1-29-1, తౌహిద్ 4-0-12-0.

**బంగ్లాదేశ్:** పర్వేజ్ (సి) ఆకాశ్ (బి) యశస్వి 47, తన్జీద్ (సి) కార్తీక్ (బి) రవి 17, మహ్ముదుల్ (బి) రవి 8, తౌహిద్ (ఎల్బీ) రవి, షహాదత్ (స్టంప్డ్) ధృవ్ (బి) రవి 1, అక్బర్ (నాటౌట్) 43, షమీమ్ (సి) యశస్వి 7, అవిషేక్ (సి) కార్తీక్ (బి) సుశాంత్ 5, రకీబుల్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు:** 33, **మొత్తం:** 42.1 ఓవర్లలో 170/7. **వికెట్ల పతనం:** 1-50, 2-62, 3-62, 4-65, 5-85, 6-121, 7-143, **బౌలింగ్:** కార్తీక్ 10-2-33-0, సుశాంత్ 7-0-25-2, ఆకాశ్ 8-1-33-0, రవి 10-3-30-4, అథర్వ 4.1-0-22-0, యశస్వి 3-0-15-1.



ఈ రోజు మాది కాదు. ఫలితం నిరాశ పరిచినా.. మా కుర్రాళ్లు చక్కటి ఆటతీరు కనబరిచారు. తక్కువ పరుగులే చేసినా.. బౌలింగ్‌లో రాణించి బంగ్లాకు గట్టి పోటీనిచ్చారు. మరో 30, 40 పరుగులు చేసుంటే ఫలితం వేరేలా ఉండేది.

-ప్రియం గార్గ్, భారత కెప్టెన్

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 10 ఫిబ్రవరి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi

ప్రతి మనిషికీ కొన్ని కలలుంటాయి. అయితే ఆ కలలు నిజమవ్వాలంటే మాత్రం ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు పెద్దలు. లక్ష్యంపై దృష్టి పెడితే ఎన్ని కష్టాలొచ్చినా వాటిని అధిగమించి లక్ష్యాన్ని చేరుకోవచ్చు. కష్టేఫలి అన్నట్లు కష్ట పడితే ఫలితం తప్పకుండా ఉంటుంది. ఆమె కూడా తన కష్టాన్ని నమ్ముకుని ముందుకు సాగింది. ఆ నమ్మకమే ఆమెను నేడు కోటీశ్వరు రాలిని చేసింది. ఒకప్పుడు వీధుల్లో తిరుగుతూ పచ్చళ్లు అమ్మిన ఆమె నేడు ఒక పచ్చళ్ల కంపెనీకి ఓనర్ అయ్యింది. ఒకప్పుడు ఒకటి, రెండు పచ్చళ్లు అమ్మిన ఆమె నేడు ఎన్నో వెరైటీ పచ్చళ్లను అమ్ముతున్నది. అంతేకాదు వ్యాపారంలో రాణించినందుకు రాష్ట్రపతి, ప్రధాని చేతుల మీదుగా ఆవార్డు కూడా అందుకుంది. అనుకున్నది సాధించడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదంటున్న శ్రీకృష్ణ పికెల్ ఓనర్ కృష్ణయాదవ్ సక్సెస్‌మంత్ర.




# పచ్చళ్ల తయారీలో కరోడ్‌పతి
# కృష్ణయాదవ్

## అవార్డులు, రివార్డులు

వ్యాపారంలో విజయం సాధించిన కృష్ణయాదవ్‌ను ప్రభుత్వం కూడా గుర్తించింది. ఈ క్రమంలోనే కృష్ణయాదవ్‌కు పలు అవార్డులు, రివార్డులు లభించాయి. 2015 లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా నారీ శక్తి పురస్కార్ అవార్డును కృష్ణయాదవ్ అందుకున్నది. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఉత్తమ మహిళా వ్యాపారిగా రూ.51000 అందుకొంది. పలు సంస్థలు, మహిళా సంఘాలు కూడా ఆమె కృషిని గుర్తించి అవార్డులు, రివార్డులతో గౌరవించాయి.





**కృ**ష్ణ యాదవ్ ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ షహర్ జిల్లాలో ఉండేది. నిరుపేద కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలతో కృష్ణ యాదవ్ జీవిస్తుండేది. అయితే యాదవ్ పెద్దగా చదువుకోలేదు. అలాగే ఈమె భర్త చదువు కూడా అంతంత మాత్రమే. దీంతో ఏ ఉద్యోగం చేయలేని పరిస్థితి. ఎక్కడ పనిచేసినా చాలీచాలని జీతం. అందుకే ఇద్దరూ కలిసి ఊరగాయ వ్యాపారం మొదలు పెట్టారు. వారు పలు రకాల ఊరగాయలు తయారు చేసి అమ్మేవారు. కానీ ఉత్తర ప్రదేశ్‌లో వారి వ్యాపారం అంతగా సాగలేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో వారు ఢిల్లీకి మకాం మార్చారు. ఆమె పెద్దగా చదువుకోక పోవడం, గ్రామంలో పచ్చళ్ల తయారీలో కొంత అనుభవం ఉండడంతో ఢిల్లీ వచ్చింది కృష్ణయాదవ్. 1996లో కృష్ణ న్యూఢిల్లీలోని కేవీకే ఉజ్వా అనే సంస్థలో ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ తీసుకుంది. దీనివల్ల పచ్చళ్లను ఎక్కువ కాలం నిల్వ ఉంచడం, ఎలాంటి పదార్థాలు వాడితే రుచిగా ఉంటాయి వంటి అనేక విషయాలను ఆమె తెలుసుకోగలిగింది.



### వీధుల్లో తిరుగుతూ..

ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణలో తెలుసుకున్న మెళకువలతో మళ్లీ కృష్ణ ఊరగాయలు వ్యాపారం మొదలు పెట్టింది. దీని కోసం మొదట రూ. 500 మాత్రమే ఖర్చు పెట్టింది. తన వద్ద ఉన్న ఆ ఐదు వందల రూపాయలతో పచ్చడి తయారీ కోసం కావాల్సిన ముడి సరుకులు కొన్నది. ఆ తర్వాత రూ. 3000 ఖర్చు పెట్టి కరివి అంటే హిందీలో కరౌండా అనే కాయతో 100 కేజీల ఊరగాయ పెట్టింది. దీంతో పాటు 5 కేజీల మిరపకాయ కూడా పెట్టింది. వాటిని వీధుల్లో తిరుగుతూ ఆమె భర్తతో కలిసి అమ్మింది. మొత్తానికి వీటిని అమ్మేయగా ఆమెకు రూ. 5200 లాభం వచ్చింది. దీంతో ఆమె అలాగే పచ్చళ్లు తయారు చేయడం, వీధుల్లో అమ్మడం చేసింది. వారి వ్యాపారం రోజు రోజుకు వృద్ధి చెందుతూ వచ్చింది. అప్పటి నుంచి ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. రకరకాల పచ్చళ్లు తయారు చేసి అలాగే రకరకాల ఆహార పదార్థాలు చేసి ఒక స్వగృహ ఫుడ్స్ ప్రారంభించింది. ఈ క్రమంలో వారి వ్యాపారం బాగా సాగింది.

## సవాళ్లను అధిగమించాలి

'వ్యాపారంలో రాణించాలన్నా, డబ్బు సంపాదించాలన్నా పెద్దగా చదువుకోలేకపోయామని బాధపడుతూ కూర్చుంటే ఈ రోజు కృష్ణయాదవ్‌గా ఇంత గుర్తింపు పొందే దాన్ని కాదు. మన మెదడుకి పని పెట్టి, కష్టాన్ని నమ్ముకుంటే సాధించనిదంటూ ఏదీ లేదు. తలచుకోవాలేగానీ.. నిజంగా ఈ ప్రపంచంలో సాధించలేనిది అంటూ ఏదీ లేదు. కరెక్ట్‌గా దృష్టి పెట్టి మనసు లక్ష్యంపై నిలపాలే గానీ ఎవరైనా ఏదైనా సాధించవచ్చు. ఈ క్రమంలో మనకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. అక్కడే ఆగిపోతే విజయాన్ని అందుకోలేం. ఆ సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగినప్పుడే విజయం మనల్ని వరిస్తుంది.

–కృష్ణయాదవ్

### శ్రీకృష్ణ పికెల్

వ్యాపారం లాభసాటిగా సాగుతుండడంతో వీరు ఏకంగా 'శ్రీకృష్ణ పికెల్' అని ఒక కంపెనీ ప్రారంభించారు. దీంతో వీరు ఏటా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇప్పటికి ఈమె ఏదో ఒక వెరైటీ ఊరగాయ తయారు చేస్తానంటున్నది. వాటికీ అప్పటికప్పుడు గిరాకీ పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు ఈమె ఎన్నో రకాల వెరైటీ పచ్చళ్లను ఆహార పదార్థాలను తయారు చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నది. ఇప్పటికీ ఆమె తయారు చేసిన పచ్చళ్లకు ఢిల్లీతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఫ్యాన్స్ అయ్యారంటే అవి ఎంత రుచిగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ ఈమె ఏదో ఒక వెరైటీ ఊరగాయ తయారు చేస్తుంటుంది. వాటికి వచ్చే క్రేజ్ అంతా ఇంతా కాదు.

### వ్యాపారులుగా..

సొంత కంపెనీ కావడంతో భార్యాభర్తలిద్దరూ కష్టపడ్డారు. వారి కష్టానికి తగినట్లు వీరు ఏటా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఈమె, ఈమె భర్త ఢిల్లీలో ప్రముఖ వ్యాపారులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. పెద్దగా చదువుకోకపోయినా, పేద కుటుంబం నుంచి వచ్చిన కృష్ణయాదవ్ ఈరోజు కొన్ని కోట్ల రూపాయలు సంపాదిస్తున్న విధానం మహిళలకూ స్ఫూర్తిదాయకం. భర్త సహకారంతో ఆమె విజయం సాధించడమే కాకుండా పలువురికి ఉపాధిని కూడా ఇస్తున్నారు. ఆమె కూడా ప్రతిరోజు తమ కంపెనీకి వెళ్లి పచ్చళ్ల తయారీలో మునిగి తేలుతుంటుంది. అక్కడి వారికి సలహాలు, సూచనలిస్తుంది.

### ప్రతిరోజూ పండుగే

కృష్ణయాదవ్ పచ్చళ్ల వ్యాపారంలో విజయం సాధించడంతో పలువురు ఔత్సాహికులు, వివిధ మహిళా గ్రూపులు ఆమెను నిత్యం సంప్రదిస్తున్నారు. ఆయా సంస్థలు వీరి కంపెనీకి వచ్చి ఆమె ఎదిగిన తీరును వారికి వివరిస్తుంటారు. కృష్ణయాదవ్ కూడా ఓపికగా అందరికీ సమాధానం చెబుతుంటుంది. ఇక మీడియా సంస్థలైతే రోజు ఆమె ఇంటర్వ్యూ కోసం క్యూ కడుతున్నాయి. ఆమె ఈ రంగంలోకి వచ్చి రెండు దశాబ్దాలు దాటినప్పటికీ ఇప్పటికీ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవడానికి ఆసక్తిచూపే వారే అధికం. అందుకే ఆమె పచ్చళ్ల కంపెనీ ప్రతీరోజు పదుల సంఖ్యలో సందర్శకులతో కళకళలాడుతుంటుంది. పచ్చళ్ల తయారీ విధానం, నిలువ చేయడం, ఎన్ని రకాల పచ్చళ్లు తయారు చేస్తున్నారు. వారి వ్యాపారం విజయం సాధించడానికి అనుసరించిన విధానాలపై నిత్యం ఆమెను సంప్రదించేవారే అధికం. అయినా అటు వ్యాపారం, ఇటు తన విజయాలను అందరికీ పంచుతూ ముందుకు సాగుతున్నారు కృష్ణయాదవ్.

# కాగితాల ఇల్లు!

**ఇటుకలు, ఇసుక, సిమెంట్ లేకుండా ఇల్లు కట్టాలంటే తడికలు ఉపయోగించి పూరిల్లు కడుతారు. లేదంటే రేకులతో ఇల్లు నిర్మించడం చూశాం. ఇవీ కాకపోయినా సినిమా షూటింగులకోసం వేసే టెంపరరీ సెట్టింగుల గురించి తెలుసు. కాగితాలతో ఇల్లు కట్టడం అనేది ఎక్కడా చూడలేదు, కదా వినలేదు కూడా!**





**కా**గితాలతో ఇల్లు కట్టడం ఏంటి. అగ్నిప్రమాదాలకు గురైతే.. పోనీ వర్షాలకు తడిసిపోతే ఇంట్లో వాళ్లు ఎక్కడుండాలి. అప్పటికప్పుడు ఎక్కడికి వెళ్లాలి. ఇలాంటి భయాలేం పెట్టుకోనవసరం లేదంటున్నారు జైపూర్‌కు చెందిన దంపతులు అభిమన్యు సింగ్, శిల్పి దువా. వీరు దీనిపై ఎన్నో ప్రయోగాలు చేసిన పిమ్మట ఇంటి నిర్మాణాన్ని అమలు చేశారు. ఇల్లు కట్టి చూడు, పెండ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. ఇల్లు కట్టాలంటే అధిక మొత్తంలో డబ్బు కావాలి. దీనికితోడు సమయం కూడా ఎక్కువే పడుతుంది. శ్రమ ఉంటుంది. వీటికి భిన్నంగా ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే పేదప్రజలకు కాగితపు ఇండ్లు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ కాగితాలు కూడా రీసైకిల్ చేసినవి. పర్యావరణానికి హానికలిగించని రీతిలో ఈ ఇండ్లు ఉంటాయి. దీనికి వాటర్‌ప్రూఫ్, ఫైర్‌ప్రూఫ్‌లు కూడా ఉన్నాయి. సౌండ్ ప్రూఫ్, షాక్‌లను తట్టుకునే ప్యానెల్లు కూడా ఉన్నాయి. దీనివల్ల ఉపయోగకరమే కానీ ఆటంకాలు కలుగవు. శిల్పి, అభిమన్యు 2008లో జైపూర్‌లోని ఆయోజన్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి ఆర్కిటెక్చర్ డిగ్రీ పొందారు. వీరివురికి 2003 నుంచి పరిచయం ఉంది. అభిమన్యు బెంగళూరులో మాస్టర్స్ చేశాడు. పునర్వినియోగపరచదగిన పదార్థాలను ఉపయోగించడంలో లోతైన పరిశోధనలు చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ఓ పెద్దాయన పడుతున్న తపన చూసి అభిమన్యుకి తక్కువ ఖర్చుతో ఇల్లు కట్టాలన్న ఆలోచన వచ్చింది. అందుకుగాను 2018 నవంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన టై గ్లోబల్ సమ్మిట్‌లో 'ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్నాడు. లండన్‌లో రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజినీర్స్‌తో 'లీడర్స్ ఇన్ ఇన్నోవేషన్ ఫెలోషిప్'కి ఎంపికయ్యారు. రాబోయే ఐదేండ్లలో దేశవ్యాప్తంగా 500 ఇండ్లను నిర్మించాలనుకుంటున్నారు. తర్వాతి తరం పచ్చటి ఇండ్లలో ఉండాలని కార్బన్ పాదముద్రను తగ్గించాలని కోరుకుంటున్నారు.

# కాకరతో పూత మాయం



- ఆకలి తక్కువగా ఉన్నవారు చింతపండు రసాన్ని అన్నంలోకి తీసుకోవాలి. దీంతో జీర్ణక్రియ సరిగా పనిచేస్తుంది.
- అలసట లేకుండా ఉత్సాహంగా ఉండాలంటే ప్రతిరోజూ కొబ్బరినీళ్ళుగాని, బత్తాయి పండ్లరసం గాని తీసుకోవాలి.
- ప్రతిరోజూ కాకరకాయ రసాన్ని పుక్కిలిస్తూ ఉంటే నోట్లో నాలుకపూత, పళ్లు పుచ్చిపోవడాన్ని అరికట్టవచ్చు.
- ప్రతిరోజు ఒక పచ్చి కరక్కాయ తీసుకుంటే ఉబ్బసం తగ్గుతుంది.
- కడుపుబ్బరం, కడుపులో మంట వంటి సమస్యలకు నీటిలో పుదీనా ఆకులు వేసి బాగా మరగించి చల్లార్చి తాగితే మంచిది.
- నిద్రలేమితో బాధపడేవారు ధనియాల కషాయం చేసుకొని అందులో కొద్దిగా పాలు కలుపుకొని తాగితే నిద్ర బాగా పడుతుంది.
- ధనియాల పొడిలో ఉప్పు కలుపుకొని రోజూ ఓ స్పూన్ తీసుకుంటే అజీర్తి బాధ తగ్గి ఆకలి బాగా అవుతుంది.

# విటమిన్ డి టాబ్లెట్లు వేసుకుంటున్నారా?

**విటమిన్ డి. ఎక్కువగా వినిపించే పదం. ఈ లోపం వల్ల ఎముకలు దృఢంగా ఉండవు. చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పి, వెన్నునొప్పిలాంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. టాబ్లెట్ల ద్వారా లోపాన్ని అదిగమిస్తుంటారు. ఇది ఎంతవరకు సమంజసం అంటున్నారు నిపుణులు.**




1 అంతకుముందు పిల్లల్లో విటమిన్ డి లోపం వచ్చేది కాదు ఎందుకంటే.. స్కూల్‌కి నడిచి వెళ్లేవారు ఆ సమయంలో సూర్యరశ్మి వారిపై పడుతుండేది. ఆ తర్వాత సాయంత్రం ఎండలో ఆడుకోవడం వల్ల కూడా విటమిన్ డి దొరికేది. కాని ఇప్పుడు సూర్యుడు ఉదయించేసరికి పిల్లలు స్కూల్‌లో ఉంటారు. పొద్దుపొడిచే సమయానికి ఇంటికి వస్తారు. ఇక సూర్యరశ్మి శరీరంపై పడేదెప్పుడు విటమిన్ డి వచ్చేదెప్పుడు.

2 విటమిన్ డి లోపం పెద్దవారిలో కూడా ఉండేది కాదు. వారు నిరంతరం ఎండలోనే పనిచేసేవారు. ఇప్పుడు ఉద్యోగం పేరుతో వీరి పరిస్థితి కూడా పిల్లల పరిస్థితిలా మారిపోయింది. అయినా ఒక సూర్యరశ్మితో శరీరానికి కావాల్సిన విటమిన్ డి సరిపోదు. అందుకనే ఆ విటమిన్ ఉండే ఆహార పదార్థాలను అధికంగా తీసుకుంటున్నారు. అలా తీసుకోవడం వల్ల శరీరంలోకి ఎంత మొత్తంలో వెళ్తుందో కూడా అంచనా ఉండదు. అలాంటప్పుడు విటమిన్ డి ఎక్కువై అనర్థాలకు దారి తీస్తున్నదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### కొన్ని అనర్థాలు

- చాలామంది ఓరల్ సిరప్స్ రూపంలోనూ, టాబ్లెట్స్ రూపంలో విటమిన్ డి పొందుతున్నారు. అయితే విటమిన్ డి అతిగా తీసుకుంటే మాత్రం కిడ్నీలకు ప్రమాదమని ఓ పరిశోధనలో తేలింది. వాస్తవానికి సూర్యరశ్మి ద్వారా విటమిన్ డి మనకు సహజంగానే లభిస్తుంది.
- అలాగే ఆహారం, పప్పుదినుసులు, కూరగాయలు విరివిగా తీసుకుంటే సరిపోతుంది. అయితే కొందరు డాక్టర్లు సూచన లేకుండా టాబ్లెట్ల రూపంలో విటమిన్ డి పొందుతున్నారు. అలా తెలియకుండా ఒక్కోసారి అధికమొత్తంలో విటమిన్ డి తీసుకుంటే కిడ్నీలు చెడిపోతాయి. అంతేకాకుండా అధిక రక్తపోటు, అలసట, రక్తంలో క్యాల్షియం పెరగడం, వికారం, వాంతులు ఆకలి మందగించడం తరుచూ మూత్ర విసర్జన ఇలాంటివి చివరకు కిడ్నీ సమస్యలకు దారితీస్తాయి.

# వైకల్యాన్ని ఓడించి, విజయం సాధించి!



**ఆమె ఆత్మవిశ్వాసం వైకల్యాన్ని ఓడించి విజయం సాధించింది. ఆధునిక సాంకేతికతతో వినికిడి సమస్యను అధిగమించింది. సోషల్ మీడియా వేదికగా మిలియన్లమంది కష్టమర్లకు సేవలందిస్తూ వ్యాపార రంగంలో రాణిస్తున్నది ఓ మహిళ .**

**బెం**గళూరుకు చెందిన ఆర్తి లక్ష్మణ్ రస్తోగికి చిన్నప్పటి నుంచి ఐస్‌క్రీమ్ అంటే ఎంతో ఇష్టం. సహజసిద్ధమైన పదార్థాలతో పలురకాల ఐస్‌క్రీమ్ ఫ్లేవర్లను రూపొందిస్తున్నది.ఆర్తికి వినికిడి సమస్య ఉన్నది. దానిని అధిగమించడానికి వాట్సాప్ బిజినెస్ యాప్‌ను ఎంచుకున్నది. వ్యాపారాన్ని మొదలు పెట్టిన సమయంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నది. చాలామంది ఆమెకు ఫోన్ చేసేవాళ్లు. ఆమెకు వినికిడి సమస్య ఉన్నదని వాళ్లకు తెలిసేది కాదు. ఓ సారి తన సమస్యను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నది. దీంతో ఆమె పరిస్థితిని గమనించిన వినియోగదారులు ఆమెతో చాటింగ్ చేయడం మొదలు పెట్టారు. వినియోగదారులకు వచ్చే ఎటువంటి సందేహాన్నైనా ఆర్తి చాటింగ్ ద్వారానే తెలిపేది. ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని మొదలు పెట్టే సమసయంలో ఆమెను అందరూ నిరుత్సాహపరిచారు. అయినా ఏమాత్రం పట్టించుకోకుండా ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే ఐస్‌క్రీమ్‌లపై ప్రత్యేకంగా అన్వేషణ మొదలు పెట్టింది. ఎటువంటి ఫ్లేవర్లు అందిస్తే వ్యాపారం బాగా నడుస్తుందో గ్రహించింది. 'ఆర్టిన్సి' పేరుతో ఐస్‌క్రీమ్ వ్యాపారాన్ని ప్రారంభించింది. మార్కెట్‌లో లభించే ఐస్‌క్రీమ్‌లు కాకుండా సరికొత్త రుచులను విపణిలోకి ప్రవేశపెట్టింది. చక్కెర పొడితో రూపొందించిన ఐస్‌క్రీమ్‌లు తింటే జలుబు చేస్తుంది. అందుకోసమే ఆమె తయారు చేసే ఐస్ క్రీమ్‌లలో చక్కెరకు బదులు బెల్లాన్ని వినియోగించింది. బెల్లంతో రూపొందించిన వాటితో ఎటువంటి హాని లేకపోవడంతో వీటిని కొనేవారి సంఖ్య మరింతగా పెరిగింది. డిమాండ్‌కు తగిన విధంగా సరఫరాను పెంచేందుకు మరికొంతమంది సిబ్బందిని నియమించింది ఆర్తి. అలా అనతి కాలంలోనే బెంగళూరులో ఐదు ప్రాంతాల్లో ఔట్‌లెట్లను ప్రారంభించింది. వ్యాపారాన్ని పెంచుకోవడానికి వాట్సాప్ బిజినెస్ యాప్‌లో చేరింది. అందులో వినియోగదారులకు కావల్సిన రీతిలో సేవలు అందించడం మొదలు పెట్టింది. కొందరు ఔట్‌లెట్లకు వచ్చి కొనుగోలు చేస్తుండగా. మరికొందరు ఇండ్లు, కార్యాలయాలకు డోర్‌డెలివరి కోరేవాళ్లు. ఒక్కసారి ఆర్తి ఐస్‌క్రీమ్‌లు ఆర్డర్ చేసిన వారు నెలలో నాలుగైదు సార్లు తెప్పించుకునేవాళ్లు. ఆర్తి వాట్సప్ బిజినెస్ యాప్ ద్వారా తన దగ్గర లభించే అన్ని రకాల ఐస్‌క్రీమ్‌ల ఫొటోలను ఉంచేది.'నాకు వినికిడి సమస్య ఉండడంతో చాలా బాధపడేదాన్ని వాట్సాప్ ద్వారా వ్యాపారం చేయొచ్చనే విషయం తెలుసుకున్న తర్వాత నాలో ఉత్సాహం పెరిగింది. ఏ విషయాన్నైనా టెక్స్ట్ మెసేజ్‌రూపంలోనే చెప్పేదాన్ని' అని ఆర్తి అంటున్నది. 'సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం వల్ల నా సమస్యను అధిగమించగలిగానని' ఆమె చెబుతున్నది.





రాములరావు జూపల్లి, అల్లు అరవింద్, విజయ్ దేవరకొండ

# వందశాతం తెలుగు కంటెంట్

- 'ఆహా' ఓటీటీ వేడుకలో వక్తలు

'మేము గృహనిర్మాణ రంగం నుంచి వినోద రంగంలోకి అడుగుపెట్టాం. అందులో భాగంగా డిజిటల్ మీడియంలోకి ప్రవేశిస్తున్నాం. భవిష్యత్ అంతా డిజిటల్ రంగానిదే. 'ఆహా' ఓటీటీ అరవింద్‌గారి ఆలోచనల నుంచి పుట్టింది. ఇందులో వందశాతం తెలుగు కంటెంట్ ఉంటుంది. అందరికి అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఏడాది ప్రీమియం 365 రూపాయలుగా నిర్ణయించాం' అని అన్నారు రాములరావు జూపల్లి. నేటి యువత ఆలోచనలు, అభిరుచికి అనుగుణంగా రూపకల్పన చేసిన 'ఆహా ఓటీటీ' ప్లాట్‌ఫామ్ ప్రివ్యూ ఫంక్షన్‌ను శనివారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా అచ్చ తెలుగు కంటెంట్‌ను చూపిస్తే బాగుంటుందనుకున్నాం. మై హోమ్ రామేశ్వరరావు, రామ్‌తో ఓసారి ఈ విషయం గురించి మాట్లాడితే వారికి నా ఆలోచన నచ్చి భాగస్వాములుగా చేరారు. ఇప్పుడు ఆహా ప్రివ్యూ మాత్రమే చేస్తున్నాం. ఉగాది రోజున భారీగా లాంచ్ చేయబోతున్నాం. సినిమాల మాదిరిగా డిజిటల్ మీడియం కూడా ప్రేక్షకుల హృదయాలకు హత్తుకుంటుంది. ఈ మీడియంలోకి రావడానికి ఎవరూ సందేహించవొద్దు. అందుకు చక్కటి ఉదాహరణ దర్శకుడు క్రిష్. నేను నా ఆలోచన చెప్పగానే సిరీస్ చేస్తానని ముందుకొచ్చాడు. ఇప్పుడు నాలుగు సిరీస్‌లు ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాదిలో 25 సిరీస్‌లు చేయబోతున్నాం. కొన్ని సినిమాలు కూడా 'ఆహా'లో వస్తాయి' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ''ఆహా' ఓటీటీని ఫ్యూచర్ ఎంటర్‌టైన్‌మెంట్ గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించవొచ్చు. ఓటీటీ టీవీని రీప్లేస్ చేస్తుంది. వినోదమంతా ఒక్క మీటతో మీ చేతిలోకి వస్తుంది. అభిరుచులను బట్టి ఎవరికి కావాల్సిన సిరీస్‌లు, సినిమాలు వారు చూడొచ్చు. 'ఆహా' ద్వారా కొత్త టాలెంట్ బయటకు వస్తుంది. చాలా వర్క్ సృష్టించబడుతుంది' అన్నారు. దర్శకుడు క్రిష్ మాట్లాడుతూ 'ఇందులో వస్తున్న 'మస్తీ' సిరీస్‌కు నేను కథనందించా. పట్టణ నేపథ్యంలో తెరకెక్కిన సిరీస్ ఇది. అనేక జీవితాల సమాహారం. నా రచనలో మరో కోణమే 'మస్తీ'. నేను రాసిన వాటిలో ఇదొక బెస్ట్ రైటింగ్ అని చెప్పొచ్చు. అజయ్ భుయాన్ అద్భుతంగా దర్శకత్వం వహించారు' అని అన్నారు. ఈరోజుల్లో మనుషుల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయనే అంశంతో మస్తీ సిరీస్‌ను రూపొందించారని, 'ఆహా' ఓటీటీ ప్లాట్‌ఫామ్ తెలుగులో పెద్ద విజయాన్ని సాధిస్తుందని హీరో నవదీప్ చెప్పారు.



'సీటీమార్' చిత్రంలో తమన్నా

# కబడ్డీ కోచ్ జ్వాలరెడ్డి

మిల్కీబ్యూటీ తమన్నా కబడ్డీ..కబడ్డీ.. అంటూ తన జట్టుకు శిక్షణనిస్తూ కబడ్డీ కోచ్‌గా అందరిచేత 'సీటీమార్' అని ప్రశంసలు అందుకోవడానికి రెడీ అవుతోంది. గోపీచంద్ కథానాయకుడిగా సంపత్‌నంది దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సీటీమార్'. శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కబడ్డీ కోచ్ జ్వాలరెడ్డిగా ఓ విభిన్నమైన పాత్రలో కనిపించబోతుంది. ఇటీవల ఆమె లుక్‌కు సంబంధించిన ఓ ఫోటోను విడుదల చేశారు. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ 'స్ఫూర్తివంతంగా సాగుతూ సవాలుతో కూడిన పాత్ర ఇది. గోపీంద్‌తో కలిసి తొలిసారి నటిస్తున్నా. జ్వాల రెడ్డి పాత్ర నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది' అని చెప్పింది. 'ఇటీవలే హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ మొదలుపెట్టాం. ఇందులో తమన్నా జాయిన్ అయ్యారు. నిర్విరామంగా ఈ షెడ్యూల్‌ను జరిపి వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. దిగంగన సూర్యవన్షి, తరుణ్ అరోరా, భూమిక, పోసాని కృష్ణమురళి, రావురమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: మణిశర్మ, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంపత్‌నంది.



'భీష్మ' చిత్రంలో నితిన్, రష్మిక మందన్న

# నా కలలే నీ రూపంలో ఎదురయ్యే..

నితిన్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'భీష్మ'. వెంకీ కుడుముల దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నా కలలే నీ రూపంలో ఎదురయ్యే నిజమా మాయ..ఏవేవో ఊహలు నాలో మొదలయ్యే...సరాసరి గుండెల్లో దించావే, మరీ మరీ మైకంలో ముంచావే' అనే గీతాన్ని ఆదివారం చిత్రబృందం విడుదలచేసింది. నితిన్, రష్మిక మందన్నలపై రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఈ పాటను చిత్రీకరించారు. శేఖర్‌మాస్టర్ నృత్యరీతుల్ని అందించారు. శ్రీమణి సాహిత్యాన్ని అందించిన ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు. మహతి స్వరసాగర్ సంగీతాన్ని అందించారు. ఈ నెల 21న చిత్రం విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. భీష్మ ఎవరు? తన ప్రేమప్రయాణంలో ఎదురైన అవరోధాల్ని ఎలా అధిగమించాడన్నది నవ్విస్తూనే ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇటీవల విడుదలచేసిన పాటలు, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. నిర్మాణానంతర కార్యక్రమాలు తుదిదశకు చేరుకున్నాయి' అని తెలిపారు. నరేష్, సంపత్, రఘుబాబు, వెన్నెలకిషోర్, శుభలేఖసుధాకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్, సమర్పణ: పి.డి.వి ప్రసాద్.



'మిస్ ఇండియా' చిత్రంలో కీర్తి సురేష్

# లక్ష్‌లో ఆ తపన కనిపించింది



లక్ష్, అడివి శేష్

'అనుబంధాలు, స్నేహం కంటే తపనను నేను ఎక్కువగా నమ్ముతాను. పాషన్ ఉంటేనే ఇండస్ట్రీలో రాణించగలుగుతాం. ఆ తపన లక్ష్‌లో నాకు కనిపించింది. ట్రైలర్ బాగుంది' అన్నారు హీరో అడివిశేష్. చదలవాడ శ్రీనివాసరావు తనయుడు లక్ష్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'వలయం'. రమేష్ కడుముల దర్శకుడు. శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ పతాకంపై చదలవాడ పద్మావతి నిర్మిస్తున్నారు. దిగంగన సూర్యవన్షి కథానాయిక. ఈ నెల 21న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో అడివి శేష్ విడుదలచేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కె.ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ 'ఇదే సంస్థ ద్వారా 'రిక్షా రుద్రయ్య' సినిమాతో దర్శకుడిగా నేను పరిచయమయ్యాను. ఆ సినిమాలో బాలనటుడిగా లక్ష్ కనిపించారు. అతడు హీరోగా అరంగేట్రం చేస్తున్న ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలి' అని తెలిపారు. 'కంటెంట్, క్రియేటివిటీ ఉంటే చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని 'బిచ్చగాడు' సినిమా నిరూపించింది. ఆ సినిమా తరహాలోనే 'వలయం' ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని చదలవాడ శ్రీనివాసరావు అన్నారు. లక్ష్ మాట్లాడుతూ 'సమిష్టి కృషికి ఈ సినిమా నిదర్శనం. స్క్రీన్‌ప్లే ప్రధాన చిత్రాలతో నూతన ఒరవడికి అడివిశేష్ శ్రీకారం చుట్టారు. హీరోగా అతడి దారినే నేను అనుసరించాలనుకుంటున్నాను' అని పేర్కొన్నారు. అనూహ్యంగా అదృశ్యమైన భార్య ఆచూకీ కోసం అన్వేషించే ఓ భర్త కథ ఇదని, ఆద్యంతం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుందని దర్శకుడు తెలిపారు. కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాకు సంగీతాన్ని అందించాలనే తన కల ఈ సినిమాతో తీరిందని సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, రవిప్రకాష్, నోయల్ తదితరులు పాల్గొన్నారు.

# మిస్ ఇండియా ఫిలాసఫీ

'కొత్తగా కొత్తగా కొత్తగా రంగులే నింగిలో పొంగి సారంగమై..లిప్తలో క్షిప్తమై కాననే కాలమే మొలకలే వేసే నా సొంతమై..' అంటూ జీవితం పట్ల తనకున్న సానుకూల దృక్పథాన్ని తెలియజేస్తున్న ఓ అందాల భామ కథేమిటో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నది కీర్తిసురేష్. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'మిస్ ఇండియా'. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నరేంద్ర దర్శకుడు. మార్చిలో విడుదలకానుంది. ఈ చిత్రంలోని 'కొత్తగా కొత్తగా కొత్తగా రంగులే నింగిలో..' అనే గీతాన్ని చిత్రబృందం విడుదలచేసింది. ఎస్.ఎస్. తమన్ సంగీతాన్ని అందించారు. కళ్యాణ్‌చక్రవర్తి సాహిత్యాన్ని అందించిన ఈ పాటను శ్రేయాఘోషల్, తమన్ ఆలపించారు. నిర్మాత మాట్లాడుతూ 'కీర్తి సురేష్ పాత్ర ప్రయోగాత్మక పంథాలో సరికొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నాం' అని తెలిపారు. ఈ చిత్రంలో జగపతిబాబు, నవీన్‌చంద్ర, నరేష్, నదియా, రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు.

# జొన్నవిత్తుల 'ఆర్జీవీ'



'ఆర్జీవీ' చిత్ర పూజా కార్యక్రమాల దృశ్యం

ప్రముఖ సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో మాగ్నస్ సినీప్రైమ్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'ఆర్జీవీ'. వెంకట శ్రీనివాస్ బొగ్గరం('కార్తికేయ' నిర్మాత) సమర్పణలో బాలకుటుంబరావు పొన్నూరి నిర్మిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో చిత్ర పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రస్తుత సమాజంలో కొందరు వ్యక్తులు స్వేచ్ఛ పేరుతో యువతను తప్పుదోవ పట్టించే భావజాలాన్ని ఒక సిద్ధాంతంగా వ్యాప్తిచేస్తున్నారు. దీనివల్ల సమాజానికి కలిగే నష్టాన్ని ఆవిష్కరిస్తూ ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. పిచ్చెక్కించే వినోదంతో పాటు అలాంటి భావజాలాన్ని కలిగిన వారి పిచ్చి తగ్గించే ఔషదంగా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు. నిర్మాత మాట్లాడుతూ 'నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం. మార్చి మొదటివారంలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని పేర్కొన్నారు.



దివ్య, బాలశ్రీవాస్తవ

# ప్రేమ 'భరోసా'

బాల శ్రీవాస్తవ, దివ్య జంటగా రామ్మోహన్ దర్శకత్వంలో నటరాజ్ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'భరోసా'. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విశేషాలను దర్శకుడు తెలియజేస్తూ 'పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఉండే ప్రేమ కథ కూడా అందర్నీ అలరిస్తుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి' అని తెలిపారు. సుమన్ శెట్టి, ఫిష్ వెంకట్, అప్పారావు, శశి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వెంకట్ ఐనాల.






నమస్తే తెలంగాణ
# నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 10 ఫిబ్రవరి 2020

**పరీక్షల సీజన్ ప్రారంభమైంది. ఇంటర్ విద్యార్థులకు ఇప్పటికే ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి. మరో 20 రోజుల్లో తుది పరీక్షలు జరుగనున్నాయి. లక్షలాదిమంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలంటే చాలామంది ఆందోళన పడుతుంటారు. పరీక్షలకు ముందు ఈ ఇరవై రోజులు నిపుణులు చెప్పిన సూచనలు, సలహాలు పాటిస్తూ ప్రశాంతంగా ప్రిపేరైతే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. ఆ విశేషాలు తెలుసుకుందాం..**



# పరీక్ష కాలం - ప్రశాంత చిత్తం

## పబ్లిక్ పరీక్షల విద్యార్థులకు నిపుణుల సూచనలు

- సాధారణంగా పరీక్షలు అంటే పిల్లలు ఒత్తిడికి గురవుతుంటారు. దీనికి బోర్డు పరీక్షలు లేదా సంవత్సర పరీక్షలు అనే దాన్ని చేర్చడం కచ్చితంగా ఒత్తిడి స్థాయిని మరింత పెంచుతుంది. మార్చి పరీక్షల్లో ఎక్కువ మార్కులు రావాలని కొందరు, కనీసం పాసవ్వాలని మరికొందరు ఆందోళన చెందుతుంటారు. అటువంటి విద్యార్థుల కోసం అందిస్తున్న సలహాలు, సూచనలు..
- ఈ చివరి నెలలో మీరు ఇతరులతో పోల్చుకోకండి. ప్రతి విద్యార్థికి తన సొంత సామర్థ్యాలు ఉంటాయి. దీనిలో కొన్ని బలాలు, మరికొన్ని బలహీనతలు ఉంటాయి. అందువల్ల, ఇతరుల ప్రదర్శనలపై దృష్టి పెట్టవద్దు. మీ సొంత ప్రయత్నాలను ఆప్టిమైజ్ చేయడానికి ప్రయత్నించండి.

### ఆరోగ్యం ముఖ్యం

- తగినంత నిద్ర పోవాలి. ఈ నెల రోజులు మంచి నిద్ర అవసరం. అర్ధరాత్రి వరకు చదవడం మంచిది కాదు. దీనివల్ల ప్రయోజనం లేకపోగా ఆరోగ్యం దెబ్బతింటుంది. పరీక్షకు ముందు విద్యార్థులు కనీసం 6 నుంచి 8 గంటల నిద్రపోయేలా ప్లాన్ చేసుకోవాలి.
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోండి. కెఫిన్, నికోటిన్ లేదా మరేదైనా పదార్థం ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహాయపడుతుందనేది కేవలం భ్రమ మాత్రమే. నిజానికి, అటువంటి పదార్థాలు ఆందోళన స్థాయిలను పెంచే అవకాశం ఉంది. కాబట్టి వాటికి దూరంగా ఉండండి.
- పరీక్షకు ముందు కానీ, తర్వాత కానీ చివరి రివిజన్‌లోకి వెళ్లవద్దు. దీనివల్ల మరింత గందరగోళం, ఒత్తిడికి దారితీస్తుంది. అదేవిధంగా పరీక్ష రాసిన తర్వాత ఆ పేపర్ గురించి విశ్లేషించుకోకండి. తర్వాతి పరీక్ష గురించి ప్లాన్ చేసుకోండి. అయిపోయిన పేపర్ గురించి ఆలోచిస్తే వచ్చే ప్రయోజనం ఏమీలేకపోగా తర్వాత పరీక్ష పై ఆ ప్రభావం పడుతుంది.
- పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందడం సాధారణమే. దీనిగురించి స్నేహితులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా ఒక ప్రొఫెషనల్‌తో కూడా దీని గురించి మాట్లాడండి. ఆందోళన నుంచి బయటపడాలి.

### తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- అనవసరంగా ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకోకండి. మీ పిల్లలు వారి పని వారు చేసుకునేలా, వారి కలలను నిజం చేసుకునేలా పని చేసే అవకాశం కల్పించండి.
- దీనివల్ల పిల్లలపై తక్కువ ప్రేరణ, తక్కువ ఒత్తిడి ఉంటుంది. మంచి ఫలితాలు వస్తాయి.
- ఫలితం కంటే ప్రయత్నాలపై ఎక్కువ దృష్టిపెట్టండి. పరీక్షలో మార్కులు పిల్లల కృషికి అసలు సూచికలు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- మీ ఆందోళనలతో పిల్లలపై ఒత్తిడిని పెంచవద్దు. బోర్డు పరీక్షలు రాస్తున్నారంటే వారి వయస్సుకు తగ్గ బాధ్యతలను వారు చేపడుతున్నారు. వారు దాన్ని ఎదుర్కోగల సామర్థ్యం దానికదే వస్తుంది.

### మ్యాథ్స్

- ఇంటర్ స్థాయిలో మ్యాథ్స్ కొంచెం కష్టంగా ఉన్నప్పటికీ ప్రణాళికాబద్ధంగా సాధనచేస్తే సులభంగా మార్కులు సాధించవచ్చు. పరీక్షలకు సమయం దగ్గపడుతుండటంతో అన్ని చాప్టర్లలోని ముఖ్యమైన భావనలు (key concepts) ముందుగా జ్ఞాపకం చేసుకోవాలి.
- మ్యాథ్స్ పేపర్లలో 2 మార్కుల ప్రశ్నలు కొంచెం కఠినంగా ఇవ్వవచ్చు. వీటిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని 2 మార్కుల ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. తద్వారా ఎక్కువ మార్కులు స్కోర్ చేసుకోడానికి అవకాశం ఉంటుంది.
- మొదటి సంవత్సరం IAలోని ఫంక్షన్స్, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్స్ చాప్టర్ల నుంచి ఏడు మార్కుల ప్రశ్నలు వస్తాయి. అందువల్ల వీటిని ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- 1Bలో స్ట్రెయిట్ లైన్స్, పెయిర్ ఆఫ్ లైన్స్, డిఫరెన్షియేషన్, Tangents & Normals, Maxima & Minima చాప్టర్ల నుంచి ఏడు మార్కుల ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ఎక్కువగా దృష్టిసారించాలి.
- ఇంటర్ సెకండియర్‌లో ప్రశ్నలస్థాయి మరింత కఠినంగా ఉంటుంది. అందువల్ల విద్యార్థులు క్యాలిక్యులస్, ఆల్జీబ్రా చాప్టర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి. ఇందులోని ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- IIAలో బైనామియల్ థియరమ్, ప్రాబబిలిటీ థియరమ్స్, ర్యాండమ్ వేరియబుల్స్, Measures of dispersion చాప్టర్ల నుంచి ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశం ఉంది.
- IIBలో ఇంటిగ్రేషన్, డీఈ, సర్కిల్స్, Parabola, Ellipse Standard forms చాప్టర్లలోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి చాప్టర్‌లోని ఫార్ములాలను గుర్తుంచుకోవాలి.
- 4 మార్కుల ప్రశ్నల కోసం తెలుగు అకాడమీ బుక్‌లోని ఉదాహరణలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.



- దుర్గాప్రసాద్
సీనియర్ మ్యాథ్స్ ఫ్యాకల్టీ
నానో జూనియర్&
ఐఐటీ అకాడమీ
నల్లకుంట, హైదరాబాద్

### పిల్లలకు మద్దతు ఇవ్వండి

- పిల్లలకు తల్లిదండ్రులు సానుకూల వాతావరణాన్ని కల్పించి మద్దతుగా నిలవాలి. పరీక్షల సమయంలో నిరుత్సాహ పరచవద్దు. విద్యార్థులకు ప్రిపరేషన్ మధ్యలో విరామం అవసరం. అభిరుచులు (హాబీస్), ఇతర శారీరక శ్రమల్లో పాల్గొనడం శక్తిస్థాయిలను పునరుజ్జీవింపచేయడంలో బాగా సహాయపడుతాయి. అంతేకాకుండా శ్రద్ధ, ఏకాగ్రత స్థాయిలను కూడా నిర్ధారిస్తుంది. అలాగే వారు పూర్తిగా క్రీడలు, లేదా ఇతర వ్యాపకాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- స్వీయ సంరక్షణను మర్చిపోవద్దు. తల్లిదండ్రులు ముఖ్యంగా మరిచిపోకుండా ఉండాల్సిన విషయం ఇది. ఇది మీ పిల్లల పరీక్ష. కాబట్టి మీ ఆందోళనలు, ఒత్తిడిని పిల్లలపై ప్రభావితం చేయవద్దు. తల్లిదండ్రులు వారి ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలగడం చాలా ముఖ్యం.

### ఎక్కువసేపు చదివేందుకు సూచనలు

- సిలబస్‌లో ఎక్కువ చాప్టర్లు లేదా కాన్సెప్ట్‌లను తీసుకోవడానికి బదులు ప్రతిరోజు చిన్న పరిమాణంలో సిలబస్‌ను అధ్యయనం చేయాలి.
- నిరంతర అధ్యయనం అంటే చదవడానికి సరైన కాలం 2 గంటలు. ఈ 2 గంటలను 25 నిమిషాల చొప్పున సాలిడ్ స్టడీ కోసం విభజించుకోవాలి. మధ్యమధ్యలో ఐదు నిమిషాల బ్రేక్ తీసుకోవాలి. రెండు గంటల తర్వాత తిరిగి చదవడం కోసం 20 నిమిషాలపాటు విరామం తీసుకోవాలి.
- చదువుతూ మధ్యలో బ్రేక్ తీసుకున్నప్పుడు మీరు పరీక్షకు సంబంధించిన విషయాలు ఆలోచించవద్దు. అదేవిధంగా బ్రేక్ తీసుకున్న సమయంలో స్నేహితులతో సిలబస్, లేదా తర్వాత ఏం చదవాలనే విషయాలపై చర్చ జరపకండి. దీనివల్ల మీ మనస్సుకు విరామం ఉండదు. మీ మనస్సు విశ్రాంతి తీసుకోకపోతే, తదుపరి రౌండ్ చదువు అంత ప్రభావవంతంగా ఉండదు.
- సిలబస్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను కోర్ మెటీరియల్‌గా, ఎలాబ్రేటివ్ (విస్తృతమైన) మెటీరియల్‌గా విభజించుకోవాలి. కోర్ మెటీరియల్‌లో ముఖ్యమైన సూత్రాలు, సిద్ధాంతాలు, ముఖ్యమైన రేఖాచిత్రాలు, గ్రాఫ్‌లను కలిగి ఉండగా, విస్తృతమైన మెటీరియల్‌లో ఉదాహరణలు, కోట్స్, ఇలస్ట్రేషన్స్ మొదలైనవి ఉంటాయి.
- పరీక్షల్లో అడిగే ప్రశ్నలలో 80 శాతం కోర్ మెటీరియల్ నుంచి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, మీరు చదవని సిలబస్‌ను చదువుతుంటే కోర్ మెటీరియల్‌లోని అంశాలను చదివితే సరిపోతుంది.
- అంతేకాకుండా కొన్నేండ్లుగా బోర్డు పరీక్షల్లో అడుగుతున్న ప్రశ్నల ప్యాట్రన్‌ను పరిశీలించండి. పరీక్షలో అడగడానికి ఎక్కువ అవకాశం లేని అంశాలపై ఎక్కువ సమయం కేటాయించకండి.
- ప్రతిరోజు చదవడానికి ముందు ఆ రోజు ఏయే సబ్జెక్టులు, ఏయే చాప్టర్లు చదవాలనుకుంటున్నారో షెడ్యూల్ చేసుకోండి. ఈ జాబితాను రూపొందించుకునే ముందు మూడు ప్రధాన విషయాలు గుర్తుంచుకోండి. అవి.. మెమరీపై ఆధారపడేవి అంటే కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, జాగ్రఫీ తదితర సబ్జెక్టులు.
- **ప్రాబ్లమ్ సాల్వింగ్ సబ్జెక్టులు: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో కొన్ని చాప్టర్లు**
- **ఇంటర్‌ప్రిటేన్‌పై ఆధారపడేవి అంటే ఇంగ్లిష్, లిటరేచర్, లాంగ్వేజెస్.**
- చదివేటప్పుడు హార్డ్‌గా ఉన్నవి ప్రశాంత సమయంలో చదవాలి. హార్డ్ సబ్జెక్టు తర్వాత సులువైన సబ్జెక్టులను చదవాలి. తర్వాత మరో కఠినమైన సబ్జెక్టు చదివితే మంచిది.
- ప్రత్యేకంగా నోట్స్ తయారుచేసుకునే టైం ఉండదు. కాబట్టి చదివే బుక్ లేదా నోట్స్‌లోనే పెన్నుతో ఆయా ముఖ్యాంశాలను అండర్‌లైన్ చేయండి. దీనివల్ల మీరు రివిజన్ చేసేటప్పుడు ఆ ప్రధానమైన అంశాలను చదివితే సరిపోతుంది.
- ముఖ్యమైన అంశాలను బిగ్గరగా చదవండి. తరువాత వాటిని రాయండి. దీనివల్ల బాగా గుర్తుండిపోతాయి.
- చివరి నిమిషంలో సిలబస్‌ను సమర్థవంతంగా పూర్తి చేయడానికి సరైన పద్ధతులు ఎంచుకోవడం చాలా ముఖ్యం.
- నోట్-టేకింగ్ పద్ధతుల్లో రెండు శాస్త్రీయంగా నిరూపితమైన పద్ధతులు ఉన్నాయి. అవి.. SQ5R, కార్నెల్ నోట్స్ పద్ధతులు. వీటిలో SQ5R ద్వారా సర్వే, ప్రశ్నలు, చదవడం, రికార్డ్ చేయడం, పఠించడం, సమీక్షించడం, రిఫ్లెక్ట్ కోసం ఈ పద్ధతి మంచిది.
- **సర్వే:** పాఠ్య పుస్తకంలో ముఖ్యాంశాలను, ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించండి. దీనికోసం 7-10 నిమిషాల కంటే ఎక్కువ సమయం తీసుకోవద్దు.

**ప్రశ్న: మీ పాఠ్యపుస్తకంలో, శీర్షికలు, ఉపశీర్షికలను పరీక్షలో అడిగే ప్రశ్నలుగా మార్చండి. టెక్స్‌లో ముఖ్యమైన భాగాల నుంచి వచ్చే ప్రశ్నలను వివరించండి.**

- **చదవండి, రికార్డ్ చేయండి, పఠించండి:** మళ్లీ టెక్స్ట్ ద్వారా వెళ్లి మీ సొంత మాటల్లో ముఖ్యమైన అంశాలను విడిగా రికార్డ్ చేయడం, చూడగానే కన్పించే విధంగా వాటిని బుల్లెట్లలో లేదా బాక్స్‌లుగా గుర్తుపెట్టండి. మీరు గుర్తించిన అంశాలను మీరే పఠించండి
- **రివ్యూ:** మీరు గుర్తించిన ప్రశ్నలను మీరే ప్రశ్నించుకోండి, మీరు వాటికి సరిగ్గా సమాధానం ఇవ్వగలరా లేదా అనేది చూసుకోవాలి.
- **రిఫ్లెక్ట్ (ప్రతిబింబించడం):** పై దశలను పునరావృతం చేయడం, మీరు నేర్చుకునే అంశంపై పూర్తిగా గుర్తుంచుకునే వరకు రిఫ్లెక్ట్ చేయాలి.
- కార్నెల్ నోట్స్ అనేది నోట్స్ చేసుకోవడంలో ప్రభావవంతమైనది. ఇది సమాచారాన్ని గుర్తుంచుకోవడం, గుర్తుచేసుకోవడం చాలా సులభం చేస్తుంది. సవరించేటప్పుడు, కుడి కాలమ్‌ను సులభంగా కవర్ చేయవచ్చు. ఎడమ వైపు ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించవచ్చు.
- చివరిరోజుల్లో ఇప్పటివరకు చదవని అంశాలు/చాప్టర్లు చదివితే కింది మూడు అంశాలను తప్పక గుర్తుపెట్టుకోవాలి. అవి.. Recapped, Reviewed, Reinforced within 24 hours. ఎందుకంటే 24 గంటల్లో ఆ అంశాలను పైన చెప్పినట్లు చేయకుంటే 80 శాతం మర్చిపోతారు.
- చాలామంది విద్యార్థులు అర్ధరాత్రి వరకు చదువుతూ రివిజన్ చేస్తూ ఉంటారు. కానీ సరిగా నిద్రలేకుంటే షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ మెమరీల నుంచి చదివిన అంశాలు పరీక్ష హాల్‌లో గుర్తుకు రావు. కాబట్టి ప్రతిరోజు తప్పనిసరిగా 6-8 గంటలు నిద్రపోవాలి.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

### ఇప్పటి వరకు చదవని వారు ఏం చేయాలి ?

- అకడమిక్ ఇయర్‌లో ఎక్కువ సమయాన్ని వృథా చేసినవారు ఇప్పుడు తీవ్ర ఆందోళన పడుతుంటారు. అలాంటి విద్యార్థులకు చాలా సిలబస్ చదవకుండా మిగిలిపోయి ఉంటుంది. వారు ఈ సమయంలో ఏం చేయాలో తెలుసుకుందాం...
- పాఠ్యపుస్తకాలను సంవత్సరమంతా నిర్లక్ష్యం చేసిన విద్యార్థులకు పరీక్షలు ఒక పీడకలగా మారుతాయి. ఒక సంవత్సరం విలువైన సిలబస్‌ను మీరు ఎంత వేగంగా పూర్తి చేయగలరో అనేది చూడటానికి ఇది ఒక రేసులా ఉంటుంది. అకడమిక్ ఇయర్ చివర్లో పరీక్షలకు చాలా మంది ఇలానే చేస్తారు.
- అటువంటి తీవ్రమైన పరీక్షా ఒత్తిడి సమయంలో, రోజుకు 12 గంటలు అధ్యయనం చేయడం చాలా అనారోగ్యకరమైన విషయం అనేది విద్యార్థులు మొదట గ్రహించాలి. ప్రతి రోజు అలవాటు ఉన్నవారు 12 గంటలు చదివితే ఎటువంటి ఇబ్బంది ఉండదు.
- తక్కువ సమయం అంటే ఒక్కో సబ్జెక్టుకు కొన్ని రెండు లేదా మూడు గంటలు పూర్తి ఏకాగ్రతతో చదవడం మంచిది. మధ్యలో చిన్న విరామం తీసుకోవడం వల్ల అధ్యయనం మరింత ప్రభావవంతంగా మారుతుంది. మీ దృష్టి మీరు ఎంతసేపు చదివాం అనేది దానిపై కాకుండా మీరు ఎంత నేర్చుకున్నారు అనే దానిపై ఉండాలి.

### టైం టేబుల్ ఎలా ఉండాలి ?

**పరీక్షలకు కేవలం 20 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ కీలక సమయంలో ప్రతి విద్యార్థి సొంత టైంటేబుల్‌ను వేసుకొని ప్రిపేర్ కావాలి. అయితే ఈ టైంటేబుల్‌ను వేసుకునే సమయంలో ఈ సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.**

- ఇంటి విషయాలు, ఆర్థిక విషయాలపై దృష్టి పెట్టవద్దు. తల్లిదండ్రులు ఆ విషయాలను చూసుకోవాలి. చదువుకే గరిష్ఠ సమయాన్ని కేటాయించాలి.
- ప్రాతఃకాలం అంటే ఉదయం 4 గంటలకు లేవడం కాలకృత్యాల తర్వాత పాలు/టీ అలవాటు ఉన్నవి ఏవైనా తీసుకుని తర్వాత చదవడం ప్రారంభించాలి. ఉదయం 7 గంటల వరకు అంటే సుమారు రెండున్నర గంటలపాటు చదవండి. కొంచెంసేపు వ్యాయామం లేదా నడిచిన తర్వాత టిఫిన్ చేయండి. తిరిగి చదవడం ప్రారంభించండి. రెండు గంటలపాటు చదివిన తర్వాత బ్రేక్ తీసుకోవాలి. మళ్లీ రెండు గంటలు చదివి, వాటిని ప్రాక్టీస్ చేసుకోవాలి. ఒంటి గంటకు భోజనం చేయండి. 45 నిమిషాలు నిద్రపోండి. లేచిన తర్వాత కొంచెం ఫ్రెష్ అయి ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఎక్కువ ఒత్తిడి, ఆందోళన అనిపిస్తే సాయంత్రం వ్యాయామం, వాకింగ్ లేదా ఫ్రెండ్స్‌తో కొంచెం సేపు గడపాలి లేకుంటే చదువుకోండి. మరో చిన్న బ్రేక్ తర్వాత తిరిగి సాయంత్రం 7 నుంచి సీరియస్ ప్రిపరేషన్ చేయండి. 9 గంటలకు డిన్నర్ చేయండి. ఆ తర్వాత రోజు మొత్తం చదివిన వాటిని రివిజన్ చేయడం, రేపు ఏం చదవుకోవాలనే అంశాలను ప్లాన్ చేసుకుని నిద్రపోవాలి.

### ఏ ఆహారం తీసుకోవాలి?

- మంచి ఆహారం, ఎక్కువగా మంచినీళ్లు తాగడం తప్పనిసరిగా చేయాలి. వీలైతే ఫ్రెష్ జ్యూస్‌లు (తాజా పండ్ల రసాలు) తీసుకోండి. ఎక్కువ ప్రొటీన్ ఉండేవి తీసుకుంటే మెదడు చురుకుగా పనిచేయడానికి సహాయపడుతాయి. 70 శాతం మెదడు/శరీరం నీటితో ఉంటుంది. కాబట్టి ఎక్కువ నీరు తీసుకోవడం మంచి ఫలితాన్ని ఇస్తుంది. కనీసం 2-3 లీటర్ల నీరు తాగండి. జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌లకు దూరంగా ఉండటం తప్పనిసరి. లేకుంటే ఏ చిన్న అనారోగ్యం వచ్చినా పరీక్షలపై ప్రభావం పడుతుంది. సాధ్యమైనంత వరకు హోం ఫుడ్‌నే తీసుకోవాలి. పండ్లు, క్యారెట్‌లు ఎక్కువగా తీసుకోవాలి. ఎందుకంటే పరీక్షల భయంతో మీలో తెలియని ఆందోళన ఉంటుంది. దీంతో నోటిపూత వస్తుంది. సరిగా ఆహారం తీసుకోలేరు. కాబట్టి సీ, బీ విటమిన్ పదార్థాలు ఎక్కువ తీసుకుంటే పై సమస్యలు మీ దరిచేరవు.
- ప్రతిరోజు కనీసం 15-30 నిమిషాలు మెడిటేషన్ చేయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల జ్ఞాపకశక్తి 20 శాతం పెరుగుతుంది. మొదట్లో దీని ఉపయోగం తెలియదు. రెండువారాల తర్వాత మెడిటేషన్ లాభం మీకు తెలుస్తుంది.
- సినిమాలు, షికార్లు, సెల్‌ఫోన్, సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలి. ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం.
- అనవసర ఆందోళనలు, పుకార్లు నమ్మవద్దు. హార్డ్‌వర్క్ చేసినవారికి తప్పక ఫలితం లభిస్తుంది.
- ఫలితం గురించి ఆలోచించకుండా మీరు చదివే అంశాలపై ఎక్కువ దృష్టిపెడితే మంచి మార్కులు మీ సొంతం అవుతాయి.

### ఫిజిక్స్

- ఫిజిక్స్ కఠినమైనదనే భావన నుంచి విద్యార్థులు బయటపడాలి. అర్థం చేసుకుని చదవడంతోపాటు, కొన్ని సూచనలు పాటిస్తే ఈ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించవచ్చు.
- పరీక్షలో న్యూమరికల్, డెరివేషన్, థియరిటికల్ టైప్ అని మూడు రకాలుగా ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు ఉంటే మొదట న్యూమరికల్ టైప్ ప్రశ్నలను ఎంపిక చేసుకోవాలి. వీటికి పూర్తి మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాతి ప్రాధాన్యం డెరివేషన్ టైప్ ప్రశ్నలకు ఇవ్వాలి. థియరిటికల్ సమాధానాలు రాసేటప్పుడు సైడ్ హెడ్డింగ్‌లు ఉంటే వాటిని తప్పకుండా పేర్కొని అండర్‌లైన్ చేయాలి. అవి లేకపోతే విడివిడిగా పేరాగ్రాఫ్‌లా రాస్తే మంచిది.
- ఫిజిక్స్‌లో బొమ్మలకి ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి అవసరమున్న చోట తప్పనిసరిగా చక్కగా బొమ్మలు వేయాలి. దీంతో పేపర్ దిద్దేవారికి మంచి భావన కలుగుతుంది.
- న్యూమరికల్ టైప్ ప్రశ్నలకు మొదటగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారం (డాటా) రాయాలి. తర్వాత దానికి సంబంధించిన ఫార్ములా రాసి, అందులో వ్యాల్యూస్ సబ్‌స్టిట్యూట్ చేయాలి. చివరగా యూనిట్స్ (వచ్చిన మొత్తాన్ని) రాయడం మర్చిపోకూడదు. కొన్నిసార్లు ప్రశ్నలో ఇచ్చిన డాటా మొత్తం ఒకే సిస్టమ్ ఆఫ్ యూనిట్స్‌లో ఉండవు. కాబట్టి డాటా రాసేటప్పుడు అన్ని క్వాంటిటీస్ ఎస్ఐ లేదా సీజీఎస్ పద్ధతిలోకి మార్చుకుని రాసి, వాటిని ఫార్ములాలో సబ్‌స్టిట్యూట్ చేయాలి.
- థియరిటికల్ ప్రశ్నలకు సమాధానం రాసేటప్పుడు అందులో ఉన్న ముఖ్యమైన పాయింట్లని అండర్‌లైన్ చేస్తే విద్యార్థికి సబ్జెక్టుపై మంచి పట్టుందనే భావన కలుగుతుంది. తద్వారా సమాధానాలకు పూర్తి మార్కులు పడే అవకాశం ఉంటుంది.
- ఫిజిక్స్ ప్రశ్నపత్రం మూడు భాగాలుగా ఉంటుంది. అవి వెరీ షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్ (2 మార్కులు), షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్ (4 మార్కులు), లాంగ్ ఆన్సర్ క్వశ్చన్స్ (8 మార్కులు). వీటిలో రెండు మార్కుల ప్రశ్నలు చాయిస్ ఉండదు. మిగతావాటికి ఉంటుంది. అందువల్ల 60కి 60 మార్కులు సాధించాలంటే రెండు మార్కుల ప్రశ్నలే కీలకం.
- పాస్ అవడానికి ఇబ్బంది పడే విద్యార్థులు ముఖ్యంగా 8 మార్కుల ప్రశ్నల జవాబులు బాగా సాధన చేయాలి.
- గత ప్రశ్నపత్రాలు పరిశీలిస్తే ఏ చాప్టర్ల నుంచి ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో అవగాహన వస్తుంది.
- పరీక్షలో అడిగే రెండు మార్కుల ప్రశ్నల్లో ఒకటి లేదా రెండింటిని పాఠ్యపుస్తకంలో ఎక్కడి నుంచైనా అడిగే అవకాశం ఉంది. కాబట్టి పుస్తకం చదివేటప్పుడు కొన్ని డెఫినేషన్లు, థియరీ, కాన్సెప్టులను అండర్‌లైన్ చేసుకోవాలి. దీంతో రివిజన్ చేసేటప్పుడు వాటిని త్వరగా గుర్తించవచ్చు.
- సమాధానాలు రాసేటప్పుడు ఒక సెక్షన్‌కి సంబంధించిన అన్ని జవాబులను ఒకే దగ్గర క్రమపద్ధతిలో రాయాలి.
- అన్ని జవాబులు కరెక్టుగా రాసినవారికి 60కి 60 మార్కులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ ప్రశ్నలకు సమాధానం తెలిస్తే ముందుగా వాటితోనే జవాబులు రాయడం మొదలుపెట్టాలి. దీంతో పేపర్లు కరెక్షన్ చేసేవారికి విద్యార్థిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. అందువల్ల మిగతా జవాబులకు పూర్తి మార్కులు పడే అవకాశం ఉంటుంది.



జీ విద్యాధర్ రెడ్డి
సీనియర్ ఫిజిక్స్ ఫ్యాకల్టీ
నానో జూనియర్&
ఐఐటీ అకాడమీ
నల్లకుంట, హైదరాబాద్

### కెమిస్ట్రీ

- ఇంటర్‌లో సులభంగా ఫుల్‌మార్కులు సాధించడానికి వందశాతం అవకాశం ఉన్న సబ్జెక్టు. సెకండియర్ పరీక్షలో వచ్చే ప్రశ్నలు పరిశీలిస్తే 8 మార్కుల ప్రశ్నలు మూడింటికి... ఇనార్గానిక్‌లో గ్రూపుల నుంచి, ఫిజికల్ కెమిస్ట్రీలో రసాయన గతికశాస్త్రం (Chemical Kinmetics) లేదా విద్యుత్ రసాయన శాస్త్రం (Electro chemistry) నుంచి ఇస్తారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ నుంచి Alkyl halides లేదా ఆల్కహాల్ లేదా కార్బొనైన్ కాంపౌండ్స్ నుంచి రావచ్చు.
- 4 మార్కుల ప్రశ్నలు ముఖ్యంగా మెటలర్జీ, కాంప్లెక్సెస్, పీ బ్లాక్, ఆర్గానిక్ కెమిస్ట్రీలోని నేమ్ రియాక్షన్స్, సర్ఫేస్ కెమిస్ట్రీ, సాలిడ్ స్టేట్ నుంచి చదవాలి.
- 2 మార్కుల ప్రశ్నల కోసం అన్ని పాఠ్యాంశాలను పూర్తిగా చదవాలి.
- మొదటి సంవత్సరం పరీక్ష పత్రంలో ఎనిమిది మార్కుల ప్రశ్నలకుగాను మొదటి మూడు అధ్యాయాలపై పట్టు తప్పనిసరి. నాలుగుమార్కుల ప్రశ్నలకు వాయుస్థితి, కెమికల్ ఈక్వేషన్స్, గణనలు (స్టాటియోమెట్రీ), ఎస్-బ్లాక్, పీ-బ్లాక్, రసాయన సమతాస్థితి, అయానిక సమతాస్థితిలోని ముఖ్యమైన అంశాలను క్షుణ్ణంగా చదవాలి.
- 2 మార్కుల ప్రశ్నల కోసం పర్యావరణ రసాయనశాస్త్రం, కర్బన రసాయన శాస్త్రం ఎస్, పీ, బ్లాక్‌లు క్షుణ్ణంగా చదవాలి.
- గత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం తప్పనిసరి.
- ఈక్వేషన్స్, ఫార్ములాలు, సంకేతాలు, ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఫార్ములాలను తప్పనిసరిగా క్రమంతప్పకుండా ప్రాక్టీస్ చేస్తేనే తప్పులు లేకుండా రాయవచ్చు.



ఆర్ సీ రెడ్డి
సీనియర్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీ
నానో జూనియర్ &
ఐఐటీ అకాడమీ
నల్లకుంట, హైదరాబాద్
9000007761

## సెయిల్‌లో 5% వాటా విక్రయం!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** ప్రభుత్వరంగ సంస్థ స్టీల్ అథార్టీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)లో మరో ఐదు శాతం వాటా విక్రయించేయోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) రూట్‌లో విక్రయించనున్న ఈ వాటా ద్వారా కేంద్ర ఖజానాకు మరో రూ.1,000 కోట్ల నిధులు జమకానున్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ వాటా విక్రయానికి సంబంధించి దీపం, స్టీల్ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు త్వరలో సింగపూర్, హాంకాంగ్‌లలో రోడ్‌షో నిర్వహించబోతున్నారు. కానీ, కరోనా వైరస్ నేపథ్యంలో హాంకాంగ్ రోడ్‌షో వాయిదాపడినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం సంస్థలో కేంద్రం 75 శాతం వాటా కలిగివున్నది. డిసెంబర్ 2014లో 5 శాతం వాటాను విక్రయించింది. ఓఎఫ్ఎస్ రూట్‌లో ఐదు శాతం వాటాను విక్రయించాలనుకుంటున్నాం..రోడ్‌షోలో పెట్టుబడిదారుల డిమాండ్‌ను బట్టి మరింత పెంచే అవకాశాలు కూడా ఉన్నాయని ప్రభుత్వవర్గాలు సంకేతాలిచ్చాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సెయిల్‌లో ఐదు శాతం వాటాను విక్రయిస్తే కేంద్రానికి రూ.1,000 కోట్ల వరకు నిధులు సమకూరవచ్చును.

## రాష్ర్టాలకు మరో రూ.35 వేల కోట్లు!

### త్వరలో జీఎస్టీ పరిహారం చెల్లించనున్న కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** జీఎస్టీ వసూళ్లలో ఆదాయ నష్టాన్ని ఎదుర్కొంటున్న రాష్ర్టాలకు మరోమారు పరిహారం చెల్లించేందుకు సిద్ధమైంది కేంద్రం. త్వరలో రూ.35 వేల కోట్ల నిధులను విడుదల చేయబోతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2015-16 ఆర్థిక సంవత్సరం ఆధారంగా చేసుకొని రాష్ర్టాల పన్ను ఆదాయం 14 శాతం పెరుగకుంటే ఈ నష్టాన్ని ఐదేండ్లపాటు భరించనున్నది కేంద్రం. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పరిహారం మొత్తం తగినంతగా ఉండటం లేదని రాష్ర్టాలు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ మాసాలకు సంబంధించి గత ఏడాది డిసెంబర్‌లోనే రూ.35,298 కోట్లు విడుదల చేసింది. మరో రూ.35 వేల కోట్లను రెండు విడుతలుగా త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తొలి విడుత అక్టోబర్-నవంబర్ మాసాలకు సంబంధించింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 2017 నుంచి ఇప్పటి వరకు రాష్ర్టాలకు కేంద్రం రూ.2.11 లక్షల కోట్ల మేర నిధులను పరిహారం రూపంలో చెల్లించింది.

## తగ్గిన కార్పొరేట్ల విదేశీ అప్పు

**ముంబై, ఫిబ్రవరి 9:** దేశీయ కార్పొరేట్లు విదేశీ అప్పులను క్రమంగా తగ్గించుకుంటున్నాయి. గతేడాది చివరి నెలలో 2.09 బిలియన్ డాలర్లు మాత్రమే రుణాలు తీసుకున్నాయట. అంతక్రితం ఏడాది ఇదే నెలలో తీసుకున్న 3.81 బిలియన్ డాలర్లతో పోలిస్తే 45 శాతం తగ్గాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. వీటిలో ఆటోమేటిక్ రూట్‌లో 1.2 బిలియన్ డాలర్ల రుణాలను ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్(ఈసీబీ) రూట్‌లో తీసుకున్న సంస్థలు..840 మిలియన్ డాలర్లను ఈసీబీ రూట్‌లో అనుమతిపొందాయి. మిగతా 55.98 మిలియన్ డాలర్లు రూపాయి లేదా మసాలా బాండ్ల రూపంలో సేకరించుకున్నాయి.

## సర్జికల్ మాస్క్, గ్లోవ్స్‌లపై నిషేధం ఎత్తివేత

### ఎగుమతుల జాబితా నుంచి తొలగించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:** నిషేధ ఎగుమతుల జాబితా నుంచి సర్జికల్ మాస్కులు, గ్లోవ్స్‌లను ఎత్తివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఆదివారం ప్రత్యేక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. గత నెలలో వ్యక్తిగత రక్షణ పరికరాలు, మాస్కులపై నిషేధం విధించిన కేంద్రం..తాజాగా వీటిపై నిషేధం ఎత్తివేసింది. చైనాలో ప్రబలిన కరోనా వైరస్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. వ్యక్తిగత రక్షణ పరికరాలకు పెరుగనున్న డిమాండ్ నేపథ్యం ఇందుకు కారణమని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి.

# స్థూల ఆర్థికాంశాలు కీలకం

### ఢిల్లీ ఎన్నికల ఫలితాలు కూడా.. స్టాక్ మార్కెట్లపై విశ్లేషకుల అంచనా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:**

గతవారంలో రాకెట్ వేగంతో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు ఈవారంలో దేశీయ స్థూల ఆర్థికాంశాలు కీలకంగా మారనున్నాయి. కరోనా వైరస్ మరింత ఉధృతమవుతుండటం, ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై దలాల్‌స్ట్రీట్ వర్గాలు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. బుధవారం పారిశ్రామిక వృద్ధి గణాంకాలతోపాటు రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ కూడా విడుదల కానున్నది. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు మాత్రం శుక్రవారం విడుదల కానున్నది. ఈ నెల 8న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కాబోతున్నాయి. గతవారంలో భారీగా పుంజుకున్న దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఈవారంలో నిలకడగా కొనసాగే అవకాశాలున్నాయని, కరోనా వైరస్ మరిన్ని దేశాలకు విస్తరిస్తే మాత్రం ఈ ప్రభావం సూచీలపై ప్రతికూల ప్రభావం పడనున్నదని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ హెడ్ సిద్దార్థ తెలిపారు. కరోనా వైరస్‌తో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలపై కూడా మదుపరులు ప్రధానంగా దృష్టి సారించే వీలున్నదన్నారు. ఈ వైరస్ దెబ్బకు ఇప్పటి వరకు ఎనిమిది వందలకు పైగా మరణించారు. సార్వత్రిక బడ్జెట్, ఆర్బీఐ పాలసీ, కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో గతవారంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,406.32 పాయింట్లు లేదా 3.53 శాతం చొప్పున లాభపడింది. వీటితోపాటు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్న అంశాలని పేర్కొంది.



### బ్లూచిప్ దూకుడు

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో బ్లూచిప్ సంస్థల మార్కెట్ విలువ కూడా అంతేస్థాయిలో దూసుకుపోయింది. గతవారంలో టాప్-10 బ్లూచిప్ సంస్థల విలువ నికరంగా రూ.1.57 లక్షల కోట్ల మేర పెరిగింది. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా రూ.31,981 కోట్ల మేర లాభపడటం విశేషం. కేవలం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్), ఇన్ఫోసిస్‌లు మాత్రం నష్టపోగా, మిగతా ఎనిమిది సంస్థలు అత్యధికంగా లాభపడ్డాయి. వీటిలో ఆర్ఐఎల్ రూ.31,981.45 కోట్లు అధికమై మళ్లీ రూ.9 లక్షల కోట్లు దాటి రూ.9,08,888.02 కోట్ల వద్ద ముగిసింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.23,503.35 కోట్లు పెరిగి రూ.6,80.391.85 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ రూ.23,385.05 కోట్ల ఎగబాకి రూ.4,16,003.19 కోట్లకు, భారతీ ఎయిర్‌టెల్ రూ.23,049.72 కోట్లు అధికమై రూ.2,94,381.87 కోట్లకు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.20,676.16 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ పెరిగి రూ.3,47,086.53 కోట్లకు చేరుకున్నాయి. హెచ్‌యూఎల్ విలువ మరో రూ.18,617 కోట్లు పెరిగి రూ.4,67,512.81 కోట్లకు చేరుకోగా, ఎస్బీఐ రూ.15,484.20 కోట్లు ఎగబాకి రూ.2,86,033.80 కోట్లుగా ఉన్నది. కానీ, టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.10,656.80 కోట్లు కోల్పోగా, ఇన్ఫోసిస్ రూ.1,296.88 కోట్లు కోల్పోయాయి.


### ఎఫ్‌పీఐ 5 వేల కోట్ల పెట్టుబడి

విదేశీ పెట్టుబడులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. వరుసగా ఆరో నెల ఫిబ్రవరిలోనూ రూ.5,177 కోట్ల మేర నిధులు చొప్పించారు. ఈ నెల 3 నుంచి 7 మధ్యకాలంలో డెబిట్ మార్కెట్లోకి రూ.6,350 కోట్ల పెట్టుబడులు పెట్టిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)..ఇదే సమయంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.1,172.56 కోట్ల నిధులను తరలించుకుపోయారు. నికరంగా రూ.5,177.44 కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు అయింది. ఈ విషయాన్ని డిపాజిటరీ డాటా వెల్లడించింది. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం, భవిష్యత్తులో కూడా తగ్గించే అవకాశాలు లేవని సంకేతాలు ఇవ్వడంతో విదేశీ పెట్టుబడిదారులు నిధులను కుమ్మరించడానికి ప్రధాన కారణమని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజరీ సీనియర్ మేనేజర్ హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. కరోనా దెబ్బకు చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడంతోపాటు ప్రపంచ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపనున్నప్పటికీ ఈక్విటీ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. కార్పొరేట్ల బాండ్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడుల పరిమితిని 9 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం కూడా పెట్టుబడుల్లో వృద్ధికి పరోక్షంగా దోహదం చేసిందన్నారు.

## జీఎస్టీ ఏడాదికొకసారి మార్పు: సీతారామన్



జీఎస్టీ రేట్లను ఇక నుంచి ఏడాదికొకసారి మార్చే అవకాశం ఉన్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంకేతాలిచ్చారు. ప్రస్తుతం జీఎస్టీ రేట్లను ప్రతి మూడు నెలలకొకసారి మారుస్తున్నారు. మరోవైపు, దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్లడానికి సార్వత్రిక బడ్జెట్‌లో పునాది పడిందని ఆమె వ్యాఖ్యానించారు.




## ఒక్క చార్జింగ్‌తో 116 కిలోమీటర్లు

### మార్కెట్లోకి ఇ-ప్లూటో 7జీ స్కూటర్



చార్జింగ్ బ్యాటరీతో నడిచే హైస్పీడ్ స్కూటర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి, నీతి అయోగ్ సభ్యులు సారస్వత్.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్ సహకారంతో ప్రముఖ స్టార్టప్ ప్యూర్ ఈవీ.. మార్కెట్లోకి అత్యంత వేగవంతమైన విద్యుత్‌తో నడిచే ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఈప్లూటో 7జీ'ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కూటర్‌ను నీతి అయోగ్ సభ్యులు వీకే సారస్వత్, డీఆర్‌డీవో చైర్మన్ జీ సతీష్ రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆదివారం ఆవిష్కరించారు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ స్కూటర్ ధరను రూ.79,999గా నిర్ణయించింది. ఒక్క చార్జింగ్‌తో 116 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ స్కూటర్ బ్యాటరీపై 40 వేల కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయం కల్పించింది సంస్థ. అంటే ప్రయాణానికి అయ్యే ఖర్చు కిలోమీటర్‌కు 25 నుంచి 35 పైసలు మాత్రమే కావటం గమనార్హం. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన యూనిట్‌లో నెలకు 2 వేల స్కూటర్లు తయారవనున్నాయని, డిమాండ్ అధికంగా ఉంటే భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే అవకాశం కూడా ఉన్నదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. తొలి ఏడాదిలో 10 వేల యూనిట్ల స్కూటర్లను విక్రయించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది.

**ఐఐటీ విద్యార్థుల ప్రయోగం అద్భుతం: సతీశ్ రెడ్డి**

దేశీయ పరిజ్ఞానంతో తయారు చేస్తున్న పరికరాలను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నామని డీఆర్‌డీవో చైర్మన్ సతీశశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఐఐటీ విద్యార్థులు ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టి, నైపుణ్యాన్ని ప్రదర్శించడం గొప్ప విషయమని, అత్యంత వేగవంతమైన ఈ-స్కూటర్ తయారుచేయడం మంచి పరిణామమని, వారిని మరింత చైతన్య పరిస్తే మరిన్ని నూతన ఆవిష్కరణలు జరుపవచ్చునని ఆయన పేర్కొన్నారు.

